ఆకాశమే గత వారంరోజుల్లో వివరాలు

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

fb.com/vaartha Digital


Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-4-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 82 పేజీలు: 12 వెల: 6.50


విదేశీ అతిథుల పర్యటనల్లోనే ఉగ్రదాడులు

శాంతి చర్చలకు సిద్ధమే: పుతిన్

9లో



# నేర చరితులతో ఎప్పటికీ ప్రమాదమే

## వీరయ్య చౌదరి కుటుంబం నా కుటుంబమే

## మృతుని కుటుంబాన్ని ఓదార్చిన సిఎం చంద్రబాబు

**ఒంగోలు (నాగులుప్పలపాడు), ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** నేర చరిత్ర కలిగిన వారు భూమిపై ఉండరాదని వారితో ప్రమాదం ఎప్పుడైనా పొంచి ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. బుధవారం నాగులుప్పలపాడు మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి నివాళులర్పించారు. తొలుత చదలవాడ రవిశంకర్ హెలిప్యాడ్ నుండి రోడ్డు మార్గంలో వీరయ్య చౌదరి స్వగ్రామమైన అమ్మనబ్రోలు చేరుకున్నారు. అప్పటికే వేలాది మంది ప్రజలు చౌదరి నివాసంతో పాటు గ్రామమంతా రహదారుల వెంట చంద్రబాబు రాక కోసం ఎదురుచూస్తున్న ప్రజలు ఆయన వస్తున్నట్లు సంకేతం తెలుపగానే ఒక్కసారిగా ముప్పవరపు వీరయ్య చౌదరి అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. చంద్రబాబు నాయుడు చౌదరి సతీమణి సుచరిత కుమారుడు చంద్ర సిద్దార్ధను ఓదార్చి ఇక నుండి మీ కుటుంబం నా కుటుంబంతో కలిసి ఉంటుందని భరోసా ఇచ్చారు. నేరస్తులు ఎక్కడ ఉన్నా వెతికి శిక్షింపచేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్సీ ప్రభుత్వంలో నేర ప్రవృత్తి పెరిగిపోయిందని నేరస్తులు ఎంతకైనా బరితెగిస్తున్నారని ఎంతో మంది తెలుగుదేశం కార్యకర్తలను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

**పార్టీలో ముప్పవరపు గుర్తింపు**

హత్యకు గురైన ముప్పవరపు వీరయ్య చౌదరి తెలుగుదేశం పార్టీలో మంచి గుర్తింపు ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంతో పాటు చీరాల నియోజకవర్గం బాధ్యతలను ఆయనకు అప్పగించడంతో అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఘనత వీరయ్య చౌదరికి దక్కిందన్నారు. పార్టీలో క్రమశిక్షణ కలిగిన యువ నేతగా ఎదుగుతున్న తరుణంలో ఇలా జరగడం బాధాకరమన్నారు. యువగళం పాదయాత్ర వంద రోజులు చేపట్టిన నారా లోకేష్‌కి వెంట ఉండి ఆయన సంకల్పాన్ని నెరవేర్చిన వారిలో వీరయ్య చౌదరి ఒకరన్నారు. అమరావతి రైతుల పాదయాత్రకు మద్దతు పలికిన ఆయన ఏంటో మరోసారి నిరూపించుకున్నారని చౌదరి ఘనత

>>2



బుధవారం పహల్గాం దాడికి సంబంధించి రక్షణ, భద్రతా వ్యవహారాల కేబినెట్ సమావేశం దృశ్యం

# దేశం వీడాల్సిందే

## సార్క్ వీసా పాక్ పౌరులు సైతం వెళ్లాల్సిందే

## ఇండస్ నదీ జలాల ఒప్పందం రద్దు

## ఇరు రాయబార కార్యాలయాల్లో సిబ్బంది కుదింపు

## మే 1వ తేదీలోపు అమలు: భద్రతా కేబినెట్ కమిటీ నిర్ణయాలు

**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భద్రతా కమిటీ సమావేశం తీవ్రంగా ఖండించింది. ఉగ్రదాడుల్లో మృతులకు సంతాపం తెలిపింది. ఉగ్రదాడికి ప్రతిగా కీలక నిర్ణయాలు తీసుకుంది. 1960లో కుదిరిన ఇండస్ వాటర్ ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. అటారీ చెక్‌పోస్టును తక్షణమే నిలిపివేస్తున్నట్టు

>>2

# పిఎస్‌ఆర్‌కు రిమాండు

**విజయవాడ,ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఇంటలిజెన్స్ మాజీ ఛీఫ్ పిఎస్‌ఆర్ ఆంజనేయులుకు విజయవాడ కోర్టు రిమాండ్ విధించింది. ముంబయి నటి కాదంబరి జెత్వానీ కేసులో మంగళవారం ఆయనను అరెస్ట్ చేసిన విషయం విదితమే. బుధవారం ఉదయం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం మూడవ అదనపు ఛీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. మే 7 వరకు న్యాయమూర్తి ఆయనకు రిమాండును విధించారు. దీంతో ఆయనను విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

# కెసిరెడ్డికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

**విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డికి విజయవాడ ఎసిబి ప్రత్యేక కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఈ మేరకు న్యాయాధికారి భాస్కరరావు మంగళవారం అర్ధరాత్రి 12.30లకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయనను పోలీసులు విజయవాడలోని జిల్లా జైలుకు తరలించారు. అంతకుముందు కెసిరెడ్డిని కోర్టులో హాజరుపర్చిన సందర్భంగా న్యాయాధికారి ప్రాథమిక దశలో అభ్యంతరం వ్యక్తం చేశారు. సిఐడి కోర్టులో కూడ హాజరుపర్చాల్సిందని వ్యాఖ్యానించారు. ఓ దశలో రిమాండ్‌ను తిరస్కరిస్తాను మెమోను సవరించుకొని సిఐడి కోర్టులో హాజరుపర్చండి అని సూచించారు. సిఐడి తరపున అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్,పీపీ కళ్యాణి వాదనలు వినిపిస్తూ అవినీతి నిరోధక చట్టం(పీసీ యాక్ట్)తో ఈ కేసు ముడిపడి ఉంది. నిందితుడు కెసిరెడ్డికి జ్యుడీషియల్ రిమాండ్ విధించే విచారణాధికార పరిధి ఏసిబీ కోర్టుకు ఉంది. ఇదే కేసులో మూడో నిందితుడు అప్పటి ప్రత్యేక అధికారి సత్యప్రసాద్‌ను పిసి చట్టం క్రింద విచారించేందుకు కాంపిటెంట్ అథార్టీ నుండి సెక్షన్ 17(ఎ) అనుమతి లభించిందని న్యాయాధికారి దృష్టికి తెచ్చారు. కెసిరెడ్డి విషయంలో 17(ఎ) అనుమతి అవసరం లేదా? అని న్యాయాధికారి భాస్కరరావు ప్రశ్నించగా అవసరం లేదని ఎజి బదులిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఐటి సలహాదారుగా ఉంటూ ఎపి బేవరేజెస్ కార్పొరేషన్‌లో అధికారులను కెసిరెడ్డి ప్రభావితం చేశారు. ఆ కార్పొరేషన్‌లో ఆయన ప్రభుత్వ ఉద్యోగి కాదు. అందులో అధికారిక విధులు నిర్వర్తించలేదు. కాబట్టి 17(ఎ) అనుమతి అవసరం లేదు అని వాదించారు.

**రిమాండ్ రిపోర్టులో సెక్షన్లు మార్చారు**

ఇక ఎసిబి ప్రత్యేక కోర్టులోనిందితుడు కెసిరెడ్డి తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకరరెడ్డి వాదిస్తూ రిమాండ్ విధించే పరిధి ఎసిబి కోర్టుకు లేదు. అరెస్ట్‌కు గల కారణాలను పేర్కొంటూ సోమవారం నిందితుడికి అందచేసిన మెమోలో పిసి యాక్ట్ లోని సెక్షన్లు లేవు. తాజాగా సిఐడీ అందచేసిన రిమాండ్ రిపోర్టులో పిసి యాక్ట్ సెక్షన్లను చేర్చారు. రిమాండును తిరస్కరించాలని కోరారు. దమ్మాలపాటి జోక్యం చేసుకొని రిమాండ్ నివేదికలో పీసీ యాక్ట్ ప్రస్తావన ఉంటే చాలన్నారు. ఏ3 విచారణ నిమిత్తం సెక్షన్ 17(ఎ) అనుమతి లభించిన విషయాన్ని గుర్తు చేసారు.

>>2

# పదవ తరగతిలో బాలికలదే పైచేయి

## 84.09 శాతం ఉత్తీర్ణత సాధించిన బాలికలు, బాలుర ఉత్తీర్ణత 78.31 శాతమే

## కాకినాడకు చెందిన నేహాంజని అనే విద్యార్థిని 600కు 600 మార్కులు

## యలమంచిలికి చెందిన అనిత అనే విద్యార్థినికి 599 మార్కులు

**విజయవాడ.ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 10వ తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. మంత్రి లోకేశ్ ఆన్‌లైన్‌లో ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో మొత్తం 81.14 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 93.90 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా నిలవగా 47.64 శాతం ఉత్తీర్ణతతో అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో నిలిచింది. 84.09 శాతం ఉత్తీర్ణతతో బాలికలు పైచేయి సాధించగా 78.31 శాతం ఉత్తీర్ణతతో బాలురు నిలిచారు.

మే 19 నుంచి 28 వరకూ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. 10వ తరగతి పరీక్షలకు 6,14,459 మంది విద్యార్థులు హాజరుకాగా వీరిలో 4,98,585 మంది ఉత్తీర్ణత సాధించారు. 1,680 పాఠశాలల్లో వందశాతం ఫలితాలు వచ్చాయి. కాకినాడ చెందిన నేహాంజని అనే విద్యార్థిని 600కు 600 మార్కులు సాధించి అరుదైన రికార్డు సృష్టించింది.నగరంలోని భాష్యం పాఠశాలలో బాలిక చదువుతోంది. యలమంచిలి చైతన్య స్కూల్‌లో చదువుతున్న ఎండ అనిత అనే విద్యార్థిని 599 మార్కులు సాధించింది. పల్నాడు జిల్లాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినికి 598 మార్కులువచ్చాయి. ఒప్పిచర్ల జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న పావని చంద్రిక ఈ ఘనత సాధించింది. టెన్త్ ఫలితాలను గమనించినప్పుడు సబ్జెక్టులవారీగా ఉత్తీర్ణత పరిశీలిస్తే మొదటి ల్యాంగ్వేజ్‌లో 95.94శాతంమంది, రెండవ ల్యాంగ్వేజ్‌లో 99.51శాతం, థర్డ్ ల్యాంగ్వే

>>2





# లిక్కర్ స్కాం బిగ్‌బాస్ గుట్టు తీస్తాం

## -మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం స్కాంలో బిగ్ బాస్ బండారం బయట పెడతామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. జగన్ పాలనలో రాష్ట్రాన్ని స్కాములకు కేంద్రంగా మార్చారని ఆయన మండిపడ్డారు. జగన్ రెడ్డికి అడ్డగోలుగా సహకరించిన వారంతా జైలు పాలవ్వడం తథ్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మద్యం స్కాం వెనుక పెద్ద రాకెట్ ఉందని విజయసాయి బయటపెట్టారని తెలిపారు. స్కాముల్ని కప్పిపుచ్చుకోవడానికే గోవుల మరణాల డ్రామా అని మంత్రి దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందన్నారు. మంత్రి జగన్ పాలనలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని ఒక్కో ఇటుక పేర్చి బాగు చేస్తున్నామన్నారు.

>>2

# వివిపి బ్రేక్ దర్శనాల సమయం మార్పు

## ట్రయల్‌రన్‌కు 'బ్రేక్'?

## వేసవిసెలవుల్లో సామాన్యభక్తులకే ప్రాధాన్యం!



**తిరుమల,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి విఐపి బ్రేక్‌దర్శనాల సమయం మార్పు దిశగా అడుగులేస్తామని, ప్రస్తుతం అమలవుతున్న విధానంలో ఏకధాటిగా మూడు, మూడున్నరగంటలపైగా విఐపిలకే సమయం సరిపోతోందని టిటిడి ట్రస్ట్‌బోర్డు ప్రకటనచేసింది. సరిగ్గా నెలరోజుల క్రిందట తిరుమలలో బోర్డు సమావేశంలో విఐపి బ్రేక్ దర్శనాల సమయాన్ని రెండేళ్లక్రిందట అమలైన పాత విధానం ఉదయం 5గంటల నుండి 8గంటల వరకు తిరిగి పున: ప్రవేశపెడతామని, ప్రయోగాత్మకంగా పరిశీలిస్తామని ప్రకటించించారు. అయితే నెలరోజులు కావస్తున్నా ఇప్పటికీ బ్రేక్ దర్శనాలు ఉదయం 10గంటలకే అమలవుతున్నాయి. దీనివల్ల కంపార్టుమెంట్లలో భక్తులు గంటలతరబడి వేచివుండే పరిస్థితులు పునరావృతమవుతున్నాయి.ఈ సమయాన్ని మార్పుచేస్తామని బోర్డు ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. కానీ కొత్తసమయం ఇంకా అమలుకు నోచుకోలేదు. రానున్న రెండున్నరనెలలు వేసవిసెలవులు కావడంతో దేశవ్యాప్తంగా విద్యాసంస్థలకు వేసవిసెలవులు మొదలవడంతో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఇప్పటికే గత పది రోజులుగా తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా కొనసాగుతోంది. సర్వదర్శనానికి 20గంటలపైగానే సమయం పడుతోంది. 2022వ సంవత్సరం సెప్టెంబర్‌నెలనుండి విఐపి బ్రేక్ దర్శనాల వేళలను అప్పటి వైసిపి ట్రస్ట్‌బోర్డు మార్పుతీసుకువచ్చింది.

**2022లోనే బ్రేక్ దర్శనాల సమయం మార్పు!:**

ఇష్టదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునే విధానంలో విఐపి బ్రేక్‌దర్శనాలకు కొంత ప్రత్యేకత వుంది. ఈ దర్శన టిక్కెట్లు కలిగిన భక్తులను కులశేఖరపడి,రాములవారిమాడ గడప వరకు అనుమతిస్తారు. 2002 సెప్టెంబర్‌కు ముందు తిరుమలలో విఐపి బ్రేక్ దర్శనాల వేళలు ప్రోటోకాల్ విఐపి దర్శనాలు

>>2

# టెక్నాలజీ అతి వినియోగం అనర్థమే

## - మంత్రి పార్థసారథి

**విజయవాడ, ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఏ సాంకేతిక పరిజ్ఞానాన్నైనా ఎంత వరకు జీర్ణించుకోగలమో అంత వరకే వినియోగించుకోవాలని సూచిస్తూ అతిగా వినియోగిస్తే మాత్రం ఇబ్బందులకు దారి తీస్తుందని సమాచార ,పౌరసంబంధాల శాఖామంత్రి కె పార్థ సారథి, వాఖ్యానించారు. ఏ సాంకేతిక పరిజ్ఞానాన్నైనా మానవాళి అభివృద్ధి మాత్రమే వినియోగించుకోవాలని అన్నారు. ఎలా వినియోగించుకోవాలనే విచక్షణ కోల్పోతే మాత్రం వైపరీత్య పరిణామాలు సంభవిస్తాయని అన్నారు.

>>2




# పిఒకెలో 42 ఉగ్రవాద శిక్షణ కేంద్రాలు

**శ్రీనగర్, ఏప్రిల్ 23:** భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ ఉగ్రవాద కార్ఖానాలు నడుపుతోంది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో పీఓకేలో 42 ఉగ్రవాద శిక్షణ కేంద్రాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇవి నియంత్రణ రేఖకు సమీపంలోనే ఉన్నట్లు నిఘా వర్గాలు తాజాగా గణాంకాలు విడుదల చేశాయి. అందులో వందల సంఖ్యలో ముష్కరులు శిక్షణ పొందుతున్నట్లు సమాచారం. పహల్గాంకు సమీపంలోని పర్యాటక కేంద్రం బైసరన్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ఉగ్ర తండాల వివరాలను నిఘావర్గాలు వెల్లడించాయి. నియంత్రణ రేఖకు సమీపంలోని పీవోకేలో ఉన్న 42 ఉగ్రవాద శిక్షణా కేంద్రాల్లో 115 నుంచి 130 మంది ఉగ్రవాదులు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అందులో 115 మంది పాకిస్థాన్ జాతీయులని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇక జమ్ముకశ్మీర్ విషయానికొస్తే 130 నుంచి 140 మంది వరకు ఉగ్రవాదులు ఉండొచ్చని భద్రతా దళాలు అంచనా వేశాయి. కశ్మీర్ లోయలో 70నుంచి 75 మంది ఉగ్రవాదులు యాక్టివ్‌గాఉన్నట్లు సమా

>>2

# బిసి హాస్టళ్లలో ఇన్వర్టర్లు, సిసి కెమెరాలు

## - సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** బిసి హాస్టళ్ల విద్యార్థులకు భద్రతతో కూడిన విద్య అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సిఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఇందులో భాగంగా ప్రతి హాస్టల్లోనూ, గురుకుల పాఠశాలల్లోనూ ఇన్వర్టర్లతో పాటు సిసి కెమెరాలు ఏర్పాటు చేయనున్నామని స్పష్టంచేశారు.తాజాగా టెన్త్ ఫలితాల్లో బిసి హాస్టళ్ల విద్యార్దులు అనుహ్య ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. ఎపి చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా బిసిల అభ్యున్నతికి అత్యధిక నిధులు కేటాయించామన్నారు. అందులో భాగంగా బిసి హాస్టళ్ల మరమ్మతులకు రూ.25 కోట్లు కేటాయించామన్నారు. బిసి హాస్టళ్ల విద్యార్థులకు భద్రతతో కూడిన విద్య అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యంగా నిరంతరం విద్యుత్ సదుపాయం ఉండేలా హాస్టళ్లలో ఇన్వర్టర్లతో పాటు విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. హాస్టళ్లలో పరిశుభ్రమైన వాతావరణంతో పాటు నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. తలిదండ్రులు ఏ నమ్మకంతో అయితే తమ పిల్లలను బిసి హాస్టళ్లకు పంపుతున్నారో, అదే భరోసాతో విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుతున్నామన్నారు. 2014-19లో అప్పటి టిడిపి ప్రభుత్వం బిసి భవన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ భవనాలన్నీ 70 నుంచి 80 శాతం పూర్తయ్యాయన్నారు. తరవాత వచ్చిన జగన్ ఆ నిర్మాణాలను పట్టించుకోలేదన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన బిసి భవన్లతో పాటు కొత్త జిల్లాల్లోనూ నూతన భవనాలు నిర్మించనున్నామన్నారు. ఎపి బడ్జెట్లో వెనుకబడిన తరగతుల అభివృద్ధికి తమ ప్రభుత్వం రూ.39 వేల కోట్లకు పైగా కేటాయించామన్నారురు. గత ప్రభుత్వం బిసి హాస్టళ్లను కూడా గాలి కొదిలేశారన్నారు. హాస్టళ్ల మరమ్మతులకు రూపాయి కూడా నిధులివ్వలేదని, చివరికి విద్యార్థుల డైట్ బిల్లులు కూడా చెల్లించలేదని అన్నారు. రంగుల రెడ్డికి భవనాలకు రంగుల వేయడంపై ఉన్న శ్రద్ధ హాస్టళ్ల నిర్వహణపై చూపలేదని జగన్‌పై తీవ్ర ఆగ్రహం

>>2

# సీమలో అధునాతన శాప్ క్రీడా కాంప్లెక్స్‌లు

## - క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**తిరుపతి క్రీడ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** రాయలసీమకు తలమానికమైన తిరుపతిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో శాప్ ఆధ్వర్యంలో క్రీడా సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాన్ని ఏర్పాటు చేశామన్నారు. తాజాగా తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని శ్రీశ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఎపి స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన అత్యాధునికీకరణ పనులను ముఖ్యఅతిథిలుగా హాజరైన తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, శాప్ ఛైర్మన్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా

>>2

24-4pg2exHMNWJQE.qxd:24-4pg2exHMNWJQE.qxd 01/01/01 10:16 AM Page 1





శ్రీనగర్‌లో సొంతూళ్లకు వెళ్లేందుకు వేచిఉన్న పర్యాటకులు

# శాప్ క్రీడా కాంప్లెక్స్‌లు

>> స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అత్యాధునీకరించిన ఎన్టీఆర్ క్రీడావికాస కేంద్రం, రైఫిల్ షూటింగ్ రేంజ్, మేకర్ ల్యాండ్, విగ్రహావిష్కరణ, స్విమ్మింగ్ పూల్, మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీనా, పికిల్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, విద్యుత్ లైటింగ్ ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి మండిపల్లి మాట్లాడుతూ శాప్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ సిటీ, సీఎస్ఆర్ నిధులు రూ.4 కోట్లతో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. క్రీడాకారులకు మెరుగైన వసతులను కల్పించడంతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేశానికి ఆదర్శవంతంగా హైదరాబాద్‌లో ఆనాడే అత్యుత్తమ క్రీడాసదుపాయాలను సీఎం చంద్రబాబు నాయుడు నెలకొల్పారన్నారు. క్రీడాకారులకు మేలు చేయడంతోపాటు వారికి గౌరవాన్ని కిరీటంగా అందజేయాలనే లక్ష్యంతో ఆయన పనిచేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆదుదాం ఆంధ్రా పేరుతో రూ. 120కోట్లు కాజేసిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే 16,400 పోస్టులకు మెగా డీఎస్సీని విడుదల చేయడంతోపాటు స్పోర్ట్స్ కోటా కింద 3శాతం అమలు చేస్తూ క్రీడాకారులకు 450కి పైగా ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రాజధాని అమరావతిలో వెయ్యి ఎకరాల్లో త్వరలోనే స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని, దానికి సంబంధించి మంత్రివర్యులు నారాయణ కూడా కసరత్తు చేస్తున్నారన్నారు. టీటీడీ నిధుల దుర్వినియోగంపై ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని, వైసీపీ నేతల కపటత్వం పేరుతో శ్రీవేంకటేశ్వరుని నిధులను మేమేమీ కాజేయలేదని హెచ్చరించారు. క్రీడల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, క్రీడాకారులకు ముందస్తుగానే ఆర్థిక ప్రోత్సాహకాలు, రవాణా భత్యాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. కూటమి ప్రభుత్వంతో క్రీడలకు పూర్వవైభవం చేకూరుతోందని, తిరుపతి వేదికగా క్రీడాసదుపాయాలను నెలకొల్పడం సంతోషదాయకమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వివరించారు. సమర్థవంతంగా క్రీడల అభివృద్ధి.. తిరుపతిలో సమర్థవంతంగా క్రీడలను అభివృద్ధి చేయంతోపాటు క్రీడాహబ్‌గా తీర్చిదిద్దేందుకు సాయశక్తులా కృషి చేస్తున్నామని శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రతినబూనారు.

# ఎప్పటికీ ప్రమాదమే

>> అమోఘం అన్నారు.

**మంత్రులు, ఎమ్మెల్యేలు రాక:**

అమ్మనబ్రోలులో నేత వీరయ్య చౌదరి భౌతికకాయానికి సిఎం చంద్రబాబు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి అనిత, ఇతర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, మంత్రి బాలవీరాంజనేయస్వామి, అనగాని సత్యప్రసాద్, వీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య, పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్లజనార్దన్, మార్కెట్లైం బోర్డుచైర్మన్ సత్య, సంతనూతల పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, ఒంగోలుఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతాపం తెలియజేశారు.

**హత్య చేసిన వారి గురించి ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వచ్చు: చంద్రబాబు**

వీరయ్య చౌదరిని హత్య చేసిన వారి గురించి ఆచూకీ తెలిస్తే ఎవరైనా సమాచారం ఇవ్వొచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. వీరయ్య చౌదరిని హత్య చేసిన వాళ్ళ గురించి గోప్యంగా తెలియజేయాలంటే టోల్ ఫ్రీ నెంబరు 9121104784 కు ఫోన్ చేసి చెప్పవచ్చన్నారు. మీ వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు.

# పిఒకెలో 42 ఉగ్రవాద శిక్షణ కేంద్రాలు

>> వారం. 60 నుంచి 65 మంది జమ్ము, రాజౌరి, పూంచ్ రీజియన్లలో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. జమ్ము కశ్మీర్‌లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు ఉన్నారని భద్రతాసంస్థలు వెల్లడించాయి. వారిలో అత్యధికంగా లష్కరే తొయిబా ముఠా సభ్యులే ఉన్నట్లు పేర్కొన్నాయి. అందులో 18 మంది జైషే మహమ్మద్, 35 మంది లష్కరే తొయిబా, ముగ్గురు హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందినవారు ఉన్నారు. మరో 17 మంది స్థానిక ఉగ్రవాదులు ఉన్నారు. విదేశీ ఉగ్రవాదులతో పోలిస్తే స్థానిక ఉగ్రవాదుల సంఖ్య తక్కువగా ఉంది. విదేశీ ఉగ్రవాదుల సంఖ్య ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని అధికారులు అంటున్నారు. మంగళవారం జరిగిన ఉగ్ర దాడిలో ఇద్దరు విదేశీయులుసహా 26 మంది పర్యాటకులు చనిపోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ దాడికి లష్కరే తొయిబాకు అనుబంధంగా పనిచేస్తున్న ద రెసిస్టెంట్ ఫ్రంట్ బాధ్యత తీసుకుంది. సైనికుల దుస్తుల్లో వచ్చిన ఉగ్రమూకలు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని సమాచారం. కాల్పుల అనంతరం సమీప అడవుల్లోకి పారిపోవడంతో భద్రతా సిబ్బంది ఉగ్రవాదుల కోసం గాలిస్తున్నారు. కశ్మీర్‌లో గత కొంతకాలం నుంచి పర్యటకుల తాకిడి పెరిగిన తరుణంలోనే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు భద్రతా దళాలు భావిస్తున్నాయి.

# 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

>> రిమాండ్‌ను డిఫెండ్ చేసుకోవడానికి నిందితునికి అన్ని వివరాలు అందచేసామన్నారు. తన వాదనలకు బలం చేకూరేలా పలు తీర్పులను ఉటంకించారు. రూ. 3,200 కోట్ల మద్యం కుంభకోణంలో కెసిరెడ్డి కీలక పాత్ర పోషించారని,నేర తీవ్రత దృష్ట్యా నిందితునికి జ్యుడీషియల్ రిమాండ్ విధించాలని కోరారు. న్యాయమూర్తి భాస్కరరావు నిందితుడు కెసిరెడ్డితో మాట్లాడారు. సిఐడి అధికారులు అరెస్ట్‌కు గల కారణాలను తెలియచేశారా? విచారణకు హాజరుకావాలంటూ నోటీసులిచ్చారా? ఇంట్లో తనిఖీలు చేశారా? తెలియచేశారా?విచారణకు హాజరుకావాలంటూ నోటీసులిచ్చారా?ఇంట్లో తనిఖీలు చేశారా?ఆరోగ్య సమస్యలేమైనా ఉన్నాయా? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం నిందితునికి మే 6 వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులిచ్చారు.



బుధవారం అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కుటుంబ సమేతంగా తాజ్‌మహల్‌ను సందర్శించిన దృశ్యం

# బాలికలదే పైచేయి

>> జ్‌లో 96.10 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. గణితంలో అత్యల్పంగా 86.92 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా సైన్స్ సబ్జెక్టులో 90.17 శాతం మంది, సోషల్‌లో 92.90 శాతం మంది పాసయ్యారు. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 83.19 శాతం మంది పాస్ కాగా తెలుగు మీడియం విద్యార్థులు 58.59 శాతం మంది పాసయ్యారు. హిందీ మీడియంలో 100 శాతం మంది, ఉర్దూ మీడియంలో 70.71 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను జిల్లాలవారీగా పరిశీలిస్తే 93.90 శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా మొదటి స్థానం, 91.43 శాతంతో బీ.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా 2వ స్థానం, 89.14 శాతం ఉత్తీర్ణతతో విశాఖ జిల్లా మూడవ స్థానాల్లో నిలిచాయి. గుంటూరు, అనకాపల్లి, తూర్పుగోదావరి, విజయనగరం, ఎన్టీఆర్, ప్రకాశం, కృష్ణా జిల్లాలు ఆ తర్వాతి 10 స్థానాల్లో నిలిచాయి. పల్నాడు, బాపట్ల, నెల్లూరు, శ్రీకాకుళం, కాకినాడ జిల్లాలు ఆ తర్వాతి 15 స్థానాల్లో నిలిచాయి. 16వ స్థానంలో పశ్చిమ గోదావరి, 17వ స్థానంలో నంద్యాల, 18వ స్థానంలో కడప, 19వ స్థానంలో తిరుపతి, 20వ స్థానంలో అన్నమయ్య జిల్లాలు నిలవగా ఏలూరు, సత్యసాయి, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఫలితాల్లో బాలురతో పోలిస్తే బాలికలు 5.78 శాతం అధిక ఉత్తీర్ణత సాధించారు. 19 పాఠశాలల్లో సున్నాశాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అత్యధికంగా 95.02 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గత 10 ఏళ్ల ఫలితాలతో పోలిస్తే 2015 నుంచి 2019 వరకు 90శాతం ఉత్తీర్ణత నమోదైంది. 2020, 2021ల్లో కరోనా కారణంగా పరీక్షలు నిర్వహించకుండానే విద్యార్థులందరినీ పాస్ చేయడంతో 100 శాతం ఫలితాలు నమోదయ్యాయి. 2022లో అతి తక్కువగా 65.26శాతం ఫలితాలు నమోదయ్యాయి. మార్కుల వారీగా ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్లను ఆయా పాఠశాలలకు పంపించనున్నారు. పాఠశాల హెడ్‌మాస్టర్లు విద్యార్థులకు వాటిని అందచేయాల్సిందిగా ఆదేశాలు జారీచేశారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినవిద్యార్థులు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఉత్తీర్ణత సాధించనివారు నిరుత్సాహపడకుండా సప్లమెంటరీలో అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రీకౌంటింగ్ లేదా రీవెరిఫికేషన్‌కు రేపటి నుంచి (24ఏప్రిల్) మే 1వ తేదీ వరకూ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ ఫలితాలను వెబ్‌సైట్ చూసుకునే అవకాశం కల్పించారు.మనమిత్ర వాట్సప్, లీప్ యాప్‌లోనూ పదోతరగతి ఫలితాలు. వాట్సప్ నెంబర్ 95523 00009కు హాయ్ అని మెసేజ్ పంపి పంపి, విద్యా సేవలను ఎంచుకుని, ఆపై పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఎంచుకుని, వారి రోల్ నంబర్‌ను నమోదు చేస్తే ఫలితాల పిడిఎఫన కాపీ ద్వారా వస్తాయి.

# లిక్కర్ స్కాం బిగ్‌బాస్ గుట్టు తీస్తాం

>> వైఎస్సార్సీ అరాచకం కారణంగానే అమరావతి, పోలవరం నిర్మాణ వ్యయం అమాంతం పెరిగిందని విమర్శించారు. ఆడబిడ్డల విషయంలో తప్పుడు ప్రచారం చేస్తే ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. దాడులు, హత్యాయత్నాలు చేసినోళ్లకు పదవులిచ్చిన ఘనత జగన్ రెడ్డిదని విమర్శించారు. దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుంది పేర్ని నాని వ్యవహారమని మంత్రి ఎద్దేవా చేశారు.పేదల బియ్యం గురించి ప్రశ్నిస్తే మట్టి దోపిడీ అంటూ హడావుడి చేస్తున్నారన్నారని దుయ్యబట్టారు.

మట్టి దోపిడీ ఎవరి హయాంలో జరిగిందో ప్రజల్ని అడిగి తెలుసుకుందామని సవాల్ చేశారు. ఫిషింగ్ హార్బర్, బందరు పోర్టు పనులు ప్రారంభించింది టిడిపి ప్రభుత్వమేనని గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమం అజెండాగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. మచిలీపట్నంలో కనీవినీ ఎరుగని అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు. పి4 కార్యక్రమం ద్వారా మచిలీపట్నంలో పేదరికాన్ని నిర్మూలిస్తానన్నారు. ప్రజాస్వామ్యంలో సంఘు విద్రోహ శక్తులకు స్థానం లేదని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. త్వరలో మాజీ సీఎం జగన్ అవినీతి గుట్టురట్టుకావడం ఖాయమన్నారు.ఒక్కో దొంగ బయటకు వస్తున్నారన్నారు.ఎవ్వరిని వదిలేది లేదన్నారు.

# దేశం వీడాల్సిందే

>> ప్రకటించడంతో పాటు పాకిస్థాన్ పర్యాటకులు, పౌరులు వెంటనే వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. కేబినెట్ భేటీలో తీసుకున్న కీలక నిర్ణయాలను భారత విదేశంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు తెలిపారు. 1960లో కుదిరిన ఇండస్ జల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తోంది. ఇది తక్షణమే అమల్లోకి వస్తోంది. సరిహద్దు ఉగ్రవాదాన్ని పాక్ నిలిపివేసేంత వరకూ ఈ నిర్ణయం అమలు చేయనుంది. అటారి ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ తక్షణమే మూసివేత. ఇప్పటికే ఆ మార్గం ద్వారా వచ్చిన వారు 2025 మే 1లోగా తిరిగి వెళ్లవచ్చు.పాకిస్తాన్ పౌరులకు వీసాలపై భారతదేశ ప్రవేశం నిషిద్ధం. ఇంతకుముందు జారీచేసిన వీసాలురద్దు. ప్రస్తుతం భారత్‌లో ఉన్న పాక్ పౌరులు 48 గంటల్లోగా దేశం విడిచివెళ్లాలి. సార్క్‌వీసాలకు ఇచ్చిన మినహాయింపును కూడా నిలిపివేసింది. ఈ వీసాతో ఉన్నవారంతా కూడా రెండు రోజుల్లో దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. పాకిస్థాన్, భారత్ సరిహద్దులో ఉన్న అట్టారి సమీకృత చెక్‌పోస్టునుకూడా వెంటనే మూసివేయాలని నిర్ణయించినట్లు విక్రమ్ మిస్రీ తెలిపారు. ఆ దారిలో భారత్‌కు వచ్చిన పాకిస్తాన్‌వాసులు వచ్చేనెల ఒకటవ తేదీలోపు వెళ్లిపోవాలని ఆదేశించింది. న్యూఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌లో ఉన్న రక్షణ, సైనిక, నౌకాదళ, వాయుసేన సలహాదారులను 'పర్సోనా నాన్ గ్రాటా'గా ప్రకటించి, వారిని వారంలోగా దేశం విడిచి వెళ్లమని ఆదేశించింది. భారత హైకమిషన్, ఇస్లామాబాద్ నుంచి భారత్ తన సలహాదారులను వెనక్కి వచ్చేయాలని ఆదేశించింది. ఈ పదవులను రద్దు చేసింది. అలాగే 5 మంది సపోర్ట్ స్టాఫ్ కూడా వెనక్కి పిలిపించనుంది. భారత్, పాకిస్తాన్ హైకమిషన్లలోని సిబ్బంది సంఖ్యను 55 నుండి 30కి తగ్గించనుంది. ఈ మార్పులు 2025 మే 1లోగా అమల్లోకి వస్తాయి. దేశ భద్రతా పరిస్థితిని సమీక్షించింది. అన్ని భద్రతా బలగాలు అత్యంత అప్రమత్తతతో విధులు నిర్వహించాలన్న ఆదేశాలు ఇచ్చింది.ఈ ఉగ్రదాడికి పాల్పడిన వారిని చట్టానికి లోబడి శిక్షించడమే కాక, వారికి మద్దతు ఇచ్చిన వారినీ చర్యలను బహిరంగంగా బహిర్గతం చేసి చర్యలు తీసుకుంటామని సంకల్పించింది. తహవ్వూర్ రాణాను భారతదేశానికి అప్పగించిన ఉదాహరణను ప్రస్తావిస్తూ, ఉగ్రవాదం పట్ల కఠినమైన ధోరణిని భారత్ కొనసాగిస్తుందని స్పష్టం చేసింది.

**పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి లష్కర్ ఏ తోయిబా టెర్రరిస్టు ఖలీద్**

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో బైరసీన్ వద్ద పర్యాటకులపై మంగళవారం జరిగిన ఉగ్రదాడికి పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ లష్కర్ ఏ తోయిబాకు చెందిన గజ టెర్రరిస్టు ఖలీద్‌గా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) తేల్చింది. ఈ దాడిలో 27 మంది ప్రాణాలు కోల్పోగా మరో 20 మందిగా యపడిన విషయం తెలిసిందే. ఈ ఘటన తరువాత విచారణ నిమిత్తం రంగంలో దిగిన ఎన్ఐఎ అనేక విషయాలను వెలుగులోకి తెచ్చింది. ఇందులో ముఖ్యమైనది ఈ దాడికి సూత్రధారి ఖలీద్‌గా తేల్చింది. దాడికి పాల్పడిన ముగ్గురు ముష్కరుల రేఖా చిత్రాలను ఎన్ఐఎ విడుదల చేసింది. లష్కర్ ఏ తోయిబాలో ఖలీద్ కీలక వ్యక్తి. పాక్‌కు చెందిన 30 ఏళ్ల వయస్సున్న ఖలీద్ అసలు పేరు సైఫుల్లా కసూరి. లష్కర్ ఏ తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితుడు. ఖలీద్ ప్రస్తుతం లష్కర్ ఏ తోయిబా పెషావర్ ప్రధాన కార్యాలయానికి అధిపతిగా వున్నాడు. ఇదే సమయంలో మిల్లీ ముస్లిం లీగ్ సంస్థకు అధ్యక్షుడు కూడా. ఈ సంస్థ హాఫీజ్ సయీద్‌కు చెందిన జమాత్ ఉద్ దవాకు రాజకీయ విభాగంగా పనిచేస్తోంది. జమాత్ ఉద్ దవా ప ంజాబ్ ప్రావిన్స్ సమన్వయ విభాగం కూడా ఖలీద్ చూస్తున్నాడని ఎన్ఐఎ విచారణలో తేలింది. జమాత్ ఉద్ దవా లష్కర్ ఏ తోయిబాతో సంబంధాలు వున్నట్లు తేలడంతో దీనిపై అమెరికా ఉగ్రవాద సంస్థ ముద్రవేసి నిషేధం విధించింది. కాగా పహల్గాం దాడికి సూత్రధారి ఖలీద్ కాగా దాడికి పాల్పడ్డ ఉగ్రమూకల బృందానికి నాయకత్వం వహించింది మాత్రం ఆసిఫ్ ఫౌజీగా ఎన్ఐఎ విచారణలో తేలింది. ఇతను కాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ ఎఫ్)లో కీలక నేతగా ఎన్ఐఎ తేల్చింది. పాక్ కేంద్రంగా పనిచేసే బడా ఉగ్రవాద సంస్థ లష్కర్ ఏ తోయిబాకు టిఆర్ఎఫ్ మరో అనుబంధ సంస్థ. కాగా ఫౌజీ జమ్మూ కాశ్మీర్‌కు చెందిన వాడు. ఇతను పాకిస్తాన్ ఆర్మీతో కలిసి పనిచేయడం వల్ల ఫౌజీ అని పేరు చేరింది. కాగా పహల్గాం దాడి తరువాత ఉగ్రవాదులు ముజఫరాబాద్ లోని సేఫ్ హౌజ్ దిశగా వెళ్లారని ఎన్ఐఎకు ఆధారాలు లభించాయి. పహల్గాం దాడికి పాల్పడ్డ నలుగురు ఉగ్రవాదుల ఫోటోలను ఎన్ఐఎ విడుదల చేసింది. కాగా పహల్గాం దాడికి కారణమైన టిఆర్ఎఫ్ 2017లో కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తరువాత ఏ ర్పాటవగా అప్పటి నుంచి కాశ్మీరేతరులు, వలస కూలీలను టార్గెట్ చేస్తోంది. 2021లో శ్రీనగర్‌లో వాయుసేన స్థావరంపై డ్రోన్ల దాడులకు కూడా ఈ సంస్థ కారణంగా తేలింది. 2020 నుంచి ఈ సంస్థ జమ్మూ కాశ్మీర్‌లో 50 మంది వరకు వలస కూలీలు, కాశ్మీరేతరులు, భద్రతా బలగాలను అంతమొందించింది. ఈ సంస్థ కమాండర్‌గా వున్న సజ్జాద్ గుల్‌ను కేంద్రం ఇప్పటికే ఉగ్రవాదిగా ప్రకటించగా ఇతను పాక్‌లో తలదాచుకున్నాడు. టిఆర్ఎఫ్‌లో వున్న ఉగ్రవాదుల్లో ఎక్కువగా స్థానికులే వున్నట్లు పోలీసు చెబుతున్నారు. టిఆర్ఎఫ్ సభ్యులకు కాశ్మీర్‌లోని పలు చోట్ల ఆశ్రయాలు లభిస్తుం డడంతో పాటు వారికి ఆహారం ఇతర సహాయాలు అందుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

# కుట్రలు పన్నేవారిని ఊరికే వదలబోం!
## రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:** పహల్గాంలో పర్యటకులపై జరిగిన ఉగ్రదాడిపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. భారత్‌పై కుట్ర పన్నుతున్న వారిని ఊరికే వదలబోమన్నారు. దాడికి భారత్ గట్టి బదులిస్తుందని హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఆ ఉగ్ర దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదనవ్యక్తంచేశారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించాలనేది భారత్ విధానమని, ఉగ్రవాదులను ఎదుర్కొనే విషయంలో దేశ ప్రజలంతా ఐక్యంగా ఉన్నారని రాజ్‌నాథ్ సింగ్‌చెప్పారు. తమ కుటుంబసభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. దాడికి పాల్పడిన వాళ్లను, కుట్ర పన్నిన వాళ్లను బయటకు లాగి తగిన బుద్ధి చెబుతామన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 24-04-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.ఏకాదశి మ.2.27
శతభిషం ఉ.10.45
వర్జ్యం మ.3.48-సా.5.03
దు.ఉ.10.00-10.51, 2) మ.3.03-3.54
శుభసమయం : ఉ.6.20-6.50
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులుపెడతాయి. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు.

**వృషభం :** కుటుంబంలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**మిథునం:** బంధువుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ఆకస్మిక ధన, వస్తు లాభాలు పొందుతారు.

**కర్కాటకం :** విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. పనులు నిదానంగా పూర్తిచేస్తారు.

**సింహం:** ఋణ వత్తిడులు ఎదురైన చికాకులు పెడతాయి. కుటుంబసభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది.

**కన్య :** మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**తుల :** వృత్తి, వ్యాపారాలు అనుకూలంగా వుంటుంది. బంధువుల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి.

**వృశ్చికం:** ప్రయాణాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**ధనుస్సు:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. ఉద్యోగాలలో స్థాన మార్పులు వుంటాయి.

**మకరం:** విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త అవసరం. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**కుంభం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం

**మీనం:** వృత్తి, వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఇన్వర్టర్లు, సిసి కెమెరాలు

>> వ్యక్తంచేశారు. హాస్టల్ భవనాలకు రంగు మార్చో...పేరు మార్చో...నిర్మాణాలు పూర్తి చేసి ఉంటే బిసి విద్యార్థులకు ఎంతో మేలు కలిగేదన్నారు. గత 5 ఏళ్లు బిసిలను అన్ని విధాలా అన్యాయం చేసి.. బిసి ద్రోహిగా జగన్ చరిత్రలో నిలిచిపోయారని మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు.

రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా ఎన్డీయే ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. బిసి కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలు అందజేయనున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్తను రూపొందించేలా ప్రణాళికలు తయారు చేశామన్నారు. బిసి హాస్టళ్లలో నాణ్యామైన ఆహారం అందిస్తున్నామని ఓ ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. హాస్టళ్ళను సందర్శించినప్పుడు...తీవ్రమైన సమస్యలను గుర్తించామన్నారు. విద్యార్థులకు డైట్ బిల్లులు కూడా రాలేదని వార్డెన్లు తెలిపారన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి...డైట్ బకాయిలు చెల్లించామన్నారు. ఇప్పుడు అన్ని హాస్టళ్లలోనూ నాణ్యమైన ఆహారం విద్యార్థులకుఅందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు హాస్టల్ లోని అన్ని గదులు శుభ్రంగా ఉండాలన్నారు. ఎస్సీలు, ఎస్టీలు, బిసిలు అభివృద్ధికి ప్రాధాన్యం లభిస్తుంటుందని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం ఎస్టీ, బిసి, గిరిజన సంక్షేమ శాఖల హాస్టళ్లను గాలికొదిలేసిందన్నారు. నా ఎస్సీలు...నా ఎస్టీలు...నా బిసిలు...అంటూ బడుగు బలహీన వర్గాల వారిని జగన్ ఓటు బ్యాంకుగా చూశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి బిడ్డలు చదువు కోవడం జగన్ కు ఇష్టంలేదన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోలేదన్నారు. చిన్న చిన్న మరమ్మతులకు నిధులు కూడా మంజూరు చేయలేదన్నారు. చివరికి విద్యార్థులకు ఇవ్వాల్సిన డైట్, కాస్మోటిక్ బిల్లులను కూడా చెల్లించలేదన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే హాస్టళ్ల మరమ్మతులకు, విద్యార్థుల డైట్, కాస్మోటిక్ బిల్లులను కూడా చెల్లించిన విషయాన్ని మంత్రి సవిత తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బిసి బిడ్డల విద్యకు, అభివృద్ధికి చంద్రబాబు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు.

# బ్రేక్ దర్శనాల సమయం మార్పు

>> ఉదయం 5గంటలకు మొదలైతే, శుక్రవారం రోజు 6గంటలకు అనుమతినిచ్చేవారు. విఐపిల సిఫార్సులేఖల ద్వారా టిక్కెట్లు కలిగిన భక్తులను ఆది,సోమ,మంగళ,బుధ వారాలు ఉదయం 6.30గంటలకు, గురువారం 7.30గంటల ప్రాంతంలో, శుక్రవారం 8.30గంటల సమయంలో ఇలా అనుమతించారు. దీనివల్ల వేర్వేరు సమయాలు అమలవుతుండటంతో సామాన్యభక్తుల సర్వదర్శనాల సమయం మరింత ఆలస్యమయ్యేది. రాత్రి సమయంలో వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లలో రాత్రంతా గంటలుగంటలు వేచివుండే సామాన్యభక్తులు శ్రీవారి దర్శనం ముగించేలోపు ఉదయం 11గంటలుదాటిపోయేదని అప్పట్లో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అదేగాక విఐపి దర్శనాలు ఉదయత్పూర్వంవేళ ఉండటంతో అతిదిగృహాలు, విశ్రాంతి గృహాల గదులు మధ్యాహ్నం 1గంట వరకు కూడా చాలావరకు ఖాళీ చేయలేకపోయారు. సామాన్యభక్తులకు గదుల కేటాయింపు గగనంగా మారింది. అప్పట్లోనే బ్రేక్ దర్శనాల సమయంలో మార్పుచేస్తే విఐపిలు ఉదయం వేళ కొండకు చేరుకుని నేరుగా స్వామివారిని దర్శించుకుని తిరిగి వెళ్ళిపోతారనే అభిప్రాయం వ్యక్తమైంది.

**సామాన్యభక్తులకు త్వరగా దర్శనానికే మార్పు!:**

తిరుమలకు వచ్చిన భక్తులు ఎక్కువ సమయం కంపార్టుమెంట్లలోనే వేచివుండేవారు. అప్పట్లో గదుల కొరత, మంచినీటి సమస్య ఎదురవడంతో విఐపి భక్తుల దర్శనాల వేళలను ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలకు మార్పుచేశారు. కానీ ఇప్పుడు మధ్యాహ్నం 1గంట వరకు బ్రేక్ కొనసాగుతుండటం విశేషం. సామాన్యభక్తులను వేకువజామున 3.30-4గంటలకే దర్శనాలకు క్యూలైన్లలో అనుమతించి గంటసమయంలోనే శ్రీవారి దర్శనంచేసుకునేలా ఏకధాటిగా ఉదయం 7గంటల వరకు అమలవుతోంది. ఇప్పుడు చాలావరకు తిరుమలలో భక్తులకు గదుల కొరత తీరడం, నీటి సమస్య అధిగమించడంతో ప్రస్తుత కూటమి టిటిడి బోర్డు మళ్ళీ ఉదయం 5గంటలకే విఐపి బ్రేక్ దర్శనాలు అమలుచేస్తే మంచిదని అభిప్రాయంతో ముందుకు కదులుతోంది. ఇందుకు ట్రయల్‌రన్‌గా వారంరోజులు పరిశీలించాలని సూచించారు. అయితే గతనెలరోజులుగా ఈ నిర్ణయాలు అమలుకు నోచుకోలేదు. దర్శనాలు అమలుచేసే విదానంలో లోటుపాట్లు, సామాన్యభక్తుల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకుని విఐపి బ్రేక్ సమయం మార్పుచేయడం మంచిదనే విషయంపై అధికారవర్గాలు ఆలోచనతో ఉన్నారు.

# టెక్నాలజీ అతి వినియోగం అనర్థమే

>> ఈ ఆలోచనలతోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం నడుస్తోందని వ్యాఖ్యానిస్తూ సాంకేతికను వినియోగించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ముందంజలో ఉందన్నారు. నేషనల్ పి ఆర్ డే సందర్భంగా పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్ వారు ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సమాచార, పౌరసంబంధాల శాఖా మంత్రి కె పార్థ సారథి, ఆంధ్ర కేసరి యూనివర్శిటి,ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి, వైస్ ఛాన్సలర్, విజయవాడ డివిజన్, సౌత్ సెంట్రల్ రైల్వే నస్రత్ యం మండ్రూప్కర్, వారు ప్రధాన ఉన్యాసకులుగా పాల్గొన్నారు. విజయవాడలోని పి బి సిద్ధార్థ కాలేజి ఆఫ్ ఆర్ట్స్ సైన్సెస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ కార్యక్రమాన్ని ముందుగా సాంప్రదాయబద్ధమైన జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన అనంతరం మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ప్రభుత్వ పనిని వాట్సప్ ద్వారా అందించే స్థాయిలో నేటి ప్రభుత్వం ఆధునిక సాంకేతక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంలో దేశానికే మార్గదర్శకునిగా ఉందన్నారు. సాంకేతికతను ప్రభుత్వ పనిని మెరుగు పరచుకోవడానికి ఎలా వినియోగించుకోవాలో ఆలోచించే వ్యక్తి చంద్రబాబు నాయుడు గారని ప్రశంసించారు. చంద్రబాబు నాయుడు కేవలం నేటి గురించి ఆలోచించే వ్యక్తి కాదని గతంలో 2020 విజన్ పేరుతో కొన్ని దశాబ్దాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పని చేసిన వాడని నేడు కూడా అదే రీతిలో 2047 విజన్ పేరుతో రాష్ట్రం, దేశ బాగు కోసం ఆలోచించే వ్యక్తని అన్నారు. అటువంటి వ్యక్తి ఆలోచనలను నేడు యువనాయకుడు లోకేష్ ముందుకు తీసుకొని వెళుతున్నారని ఇది రాష్ట్ర భవిష్యత్తు సురక్షితంగా ఉందనే భావనను అందించగలుగుతున్నారని ప్రశంసించారు.

ఇక మీడియా సాంకేతికతను వినియోగించుకోవాలని అదే సందర్భంలో దానిని ఎలా మంచికి వినియోగించుకోవాలనే విచక్షతతో పని చేయాల్సిన బాధ్యత మీడియా పైనే ఉంటుందన్నారు. ఇటీవల తెలంగాణలో ఒక భూమి అంశంపై ఏఐ వినియోగంపై జరిగిన రాద్ధాంతం ఉదాహరణగా భావిస్తే టెక్నాలజీ ఎలా తప్పును ఒప్పుగా మారుస్తుందనే విషయాన్ని అందరి దృష్టికి తెచ్చిందని అలా జరుగుకుండా సాంకేతికను ఎలా, ఎంతవరకూ వినియోగించుకోవాలనే నిర్ణయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదే సందర్భంలో మీడియా కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ఇతరులను బ్లాక్ మెయిల్ చేయడానికి కాకుండా మానవాళిని మంచి చేయడానికి వినియోగించుకోవాలని సూచించారు. ఇక సోషల్ మీడియా మితిమీరిన వినియోగం కూడా సరైనది కాదని అభిప్రాయపడ్డారు. చైర్మన్ అమరావతి చాప్టర్ వారు చాప్టర్ డా. జి. అనిత సంస్థ యొక్క కార్యకలాపాలను వివరించారు. కార్యక్రమం యొక్క థీమ్ రెస్పాన్సిబిల్ యూజ్ ఆఫ్,రోల్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్ రిలేషన్స్ (కృత్రిమ మేధస్సు యొక్క బాధ్యతాయుతమైన వినియోగం – ప్రజా సంబంధాల పాత్ర ప్రాధాన్యతను వివరించారు. ఇప్పటికే సోషల్ మీడియా కారణంగా కొనసాగుతున్న గందరగోళాన్ని మరింత సంక్లిష్టపరుస్తోందని తెలిపారు.

నస్రత్ యం మండ్రూప్కర్ ప్రసంగిస్తూ సాంకేతక పరిజ్ఞానం కారణంగా ఎన్ని ఉపయోగాలున్నాయో అదే సందర్భంలో దానిని భాద్యతతో వినియోగించుకోకుండా, దుష్ఫలితాలను సరిగ్గా అంచనా వేయకుండా ముందుకు సాగితే సమాజానికి హాని కలిగే ప్రమాదముందని హెచ్చరించారు. అట్లని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోకుండా ఆపితే దాని వలన వచ్చే మంచి ఫలితాలకు దూరమయ్యే ప్రమాదముందని రైల్వే విభాగంలో ఏఐతో ఎలా మంచి ఫలితాలను రాబడుతున్నారో సోదాహరణంగా వివరించారు డివిఆర్ మూర్తిమాట్లాడుతూ ప్రింట్ మీడియా రోజుల నుండి నేటి సోషల్ మీడియా రోజులను నిశితంగా పరిశీలిస్తే పని తీరు, వార్తల ఎంపికతో పాటూ ప్రసార శైలి దిగజారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఏఐ వినియోగంతో ఈ పరిస్థితి మరింత జఠిలంగా మారుతోందని అన్నారు. రాష్ట్ర సమాచార పౌర సంబందాల శాఖ మంత్రి కె పార్థ సారథి మాట్లాడుతూ నేడు సోషల్ మీడియా దోరణులు చాలా దారుణంగా ఉన్నాయని దీనిని అరికట్టాల్సిన భాద్యత అందరిపై ఉందన్నారు.

**పర్యాటకులపై కాల్పులు అత్యంత హేయమైన చర్య: మంత్రి పార్థసారధి**

జమ్మూ కాశ్మీర్‌లోని బైసరన్, పహల్గామ్, అనంత్‌నాగ్‌లలో అమాయక పర్యాటకులు, స్థానికులపై మంగళవారం జరిగిన ఉగ్రదాడిని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తీవ్రంగా ఖండించారు. దీనిని హేయమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. 26 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్న, అనేక మందిని గాయపరిచిన సంఘటన అనాగరిక చర్య అన్నారు. మానవత్వం, శాంతి, కాశ్మీర్ ఆతిథ్య స్ఫూర్తిపై దాడిగా ఆయన పేర్కొన్నారు. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సాను భూతిని తెలియజేస్తూ గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా మన్నారు. నాగరిక సమాజంలో ఇటువంటి హింసకు స్థానం లేదన్నారు. అత్యంత హేయమైన దాడికి పాల్పడిన హంతకులు, వారి వెనుకవున్నవారిని న్యాయస్థానం ముందుకు తీసుకురావాలన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మరియు జమ్మూ కాశ్మీర్ ప్రజలతో సంఘీభావంగా భారత్ ఐక్యంగా నిలుస్తుందన్నారు.

GNT 3rd pg.qxd:24-04Pg3exHMNWJQEKTRP.qxd 01/01/01 9:38 AM Page 1



## పదో తరగతి ఫలితాల్లో తిరుమల విద్యార్థుల విశేష ప్రతిభ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో ఏప్రిల్ 23 ప్రభాతవార్త** పదో తరగతి పరీక్షా ఫలితాలలో తిరుమల ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలియజేశారు. యేలూరి లాశ్య శ్రీ సాయి 597 మార్కులు, ఉప్పాల జశ్వంత్ పవన్, సిహెచ్. సుప్రూత భరద్వాజ్, కొట్టిన దుర్గ కశ్యప్, కూసుమంచి శ్రీవల్లి 596 మార్కులు సాధించారని, 595 పైన 12 మంది విద్యార్థులు, 592 పైన 54 మంది విద్యార్థులు, 590 పైన 99 మంది విద్యార్థులు, 575 పైన 869 మంది విద్యార్థులు, 550 పైన 1798 మంది విద్యార్థులు సాధించారని మరియు 100 ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను డైరెక్టర్ నున్న సరోజినీదేవితో కలిసి ఆయన అభినందించారు.

## మహిళా సాధికార కమిటీ ఛైర్‌పర్సన్‌గా పురందేశ్వరి

**విజయవాడ ఏప్రిల్ 23 ప్రభాతవార్తప్రతినిధి:** పార్లమెంటు మహిళా సాధికార కమిటీ ఛైర్‌పర్సన్‌గా రాజమహేంద్రవరం భాజపా ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి నియమితులయ్యారు. 20 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులతో ఏర్పాటైన కమిటీలో సభ్యులుగా విభిన్న పార్టీలకు చెందిన మహిళా ఎంపీలు నియమితులయ్యారు. ఇందులో మహబూబ్‌నగర్, వరంగల్ ఎంపీలు డీకే అరుణ, కడియం, కావ్య, సినీ నటి హేమామాలిని, సుధామూర్తి, పాత్రికేయురాలు సాగరిక ఘోష్, ఢిల్లీ మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ స్వాతి మలివాల్, మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్ సతీమణి సునేత్ర అజిత్‌పవార్ తదితరులు ఉన్నారు.

## రైల్వే సిసిటిసి పరీక్షా ఫలితాలు వెల్లడి

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 23,ప్రభాతవార్త** రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో సిసిటిసి పోస్టుల భర్తీకి నిర్వహించిన వ్రాతపరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. డివిజన్ పరిధిలో కమర్షియల్ విభాగంలో ఖాళీగా ఉన్న 42సిసిటిసి పోస్టులను 331/3శాతం డిపార్ట్‌మెంటల్ కోటాలో భర్తీ చేసేందుకు సంబంధిత ఉన్నతాధికారులు ఈ ఏడాది ఫిబ్రవరి 7న వ్రాత పరీక్ష నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫలితాలను సంబంధిత ఉన్నతాధికారులు విడుదల చేశారు. జనరల్ స్టాండర్డ్ విభాగంలో 90మంది, రిలాక్స్‌డ్ విభాగంలో మరో 8మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరికి సీనియారిటీ, సర్వీసు రికార్డుల ప్రాతిపదికన పోస్టింగ్స్ కల్పించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## రోగులకు ఎండ వేడి నుండి రక్షణ

### - తిరుపతి రుయా ఆస్పత్రి ప్రాంగణంలో చలువపందిళ్లు



**తిరుపతి,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమకే తలమానికంగా ఉన్న తిరుపతి రుయా ఆస్పత్రికి రోజువారీగా వేలాదిమంది పలు రకాల అనారోగ్యకారణాలతో వైద్యంకోసం వస్తుంటారు. ఈ ఆస్పత్రి తిరుపతి ఎస్వీవైద్యకళాశాలకు అనుబంధంగా ఉండటంతో అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. నిపుణులైన వైద్యులతోబాటు వైద్య విద్యార్థులు, పిజి విద్యార్థులు, మెడికోలు వైద్యసేవలందిస్తారు. వచ్చిన ప్రతిరోగిని సొంతవారిలా చూడాలనేది వైద్యఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌యాదవ్ సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా ఉండటంతో ఆయన నేతృత్వంలో రుయా ఆస్పత్రి ప్రాంగణంలో పూర్తిగా చలువపందిళ్ళు ఏర్పాటుచేశారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల కావడంతో రోగులు, వారి సహాయకులకు విపరీతమైన ఎండవేడినుండి కొంతవరకు ఉపశమనం కోసం ఈ చలువపందిళ్ళు ఏర్పాటుతో రోగులు ఉపశమనం చెందుతున్నారు. 8.5లక్షల రూపాయలు వ్యయంతో చలువపందిళ్ళు ఏర్పాటుచేశారు. ప్రత్యేకంగా అత్యవసర విభాగం, క్యాజువాలిటీ, ఓపి విభాగం, సిటి స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, ఎక్స్ రే, అల్ట్రాసౌండ్,రక్తపరీక్షల కేంద్రాల వద్ద ఈ చలువపందిళ్ళు రోగులకు కాస్త వేడినుండి రక్షణ కల్పిస్తున్నాయి. రాయలసీమ జిల్లాల్లోనే ప్రభుత్వ ఆస్పత్రి రుయాలో ఈ ప్రత్యేకత కల్పించడం అభినందనీయం.

# ఉగ్ర దాడిలో అసువులు బాసిన కావలివాసి మధుసూధన్

## భార్య, బిడ్డల కళ్లెదుటే జరిగిన దారుణం

**కావలి (నెల్లూరు), ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** విహారయాత్రకు వెళ్లి ఉగ్రవాదులచేతుల్లో చిక్కి అతి కిరాతకంగా, దారుణంగా హత్యగావింపబడిన కావలివాసి సోమిశెట్టి మధుసూధన్ విషాదవార్త కావలిని కుదిపేసింది. భార్య, బిడ్డల కళ్లెదుటే ఉగ్రవాదులు కిరాతకంగా హత్యచేసిన సన్నివేశంనుంచి వారు కోలుకోలేకపోయారు. శోకసముద్రంలో మునిగిపోయారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా కావలి పట్టణానికి చెందిన ఆనాలవారి వీధిలో నివసిస్తున్న అరటికాయల వ్యాపారి సోమిశెట్టి తిరుపాలు, పద్మావతి దంపతుల కుమారుడు మధుసూధన్. ఉగ్రవాదుల చేతుల్లో మృతిచెందిన మధుసూధన్‌కు ఒక బాబు, ఒక పాప ఉన్నారు. కుమార్తె మేధు ఇంటర్ చదువుతుంది. కుమారుడు దత్తు 8వ తరగతి చదువుతున్నాడు. 20 సంవత్సరాలుగా కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులో ఐబిఎం కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 20వ తేది మధుసూధన్ తన కుటుంబంతో కాశ్మీర్ విహారయాత్రకు వెళ్లారు. 7 రోజులపాటు విహారయాత్ర ముగించుకుని బెంగుళూరుకు రావాల్సిన మధుసూధన్



భార్య, పిల్లలతో మధుసూదన్ (ఫైల్‌ఫొటో)

జమ్ము కాశ్మీర్ వద్ద పహల్గామ్ ఉగ్రదాడిలో మృతిచెందారు. భార్య, బిడ్డల కళ్లెదుటే ఉగ్రవాదులు హత్యచేయడంతో మధుసూధన్ కుటుంబం రోదిస్తూ శోకసముద్రంలో మునిగిపోయింది. ఈ వార్త దావానలంలా వ్యాపించడంతో కావలిలోని కుటుంబసభ్యుల రోదనలు వర్ణణాతీతంగా మారాయి. ఉగ్రదాడిలో మృతిచెందిన మధుసూధన్ పార్థివదేహాన్ని బుధవారం అర్ధరాత్రి సమయంలో కావలిలోని తండ్రి నివాసానికి తీసుకువస్తున్నట్లు సమాచారం. మధుసూధన్ మృతితో కావలిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఉగ్రదాడిలో 28 మంది హిందువులు మృతిచెందినట్లు పోలీసుల చెప్పడాన్నిబట్టి తెలుస్తోంది.

# జమ్ముకశ్మీర్ ఉగ్రదాడిలో ఆంధ్రప్రదేశ్ వాసుల మరణంపై మాజీ సిఎం జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ, ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** జమ్ముకాశ్మీర్ ఉగ్రదాడిలో ఏపీకి చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు."ఎక్స్" వేదికగా మృతులకు ఆయన సంతాపం ప్రకటించారు. టెర్రరిస్ట్‌ల దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపడం అమానవీయ చర్య అన్నారు. బాధిత కటుంబాలను ఆదుకుని అండగా నిలవాలని కేంద్రాన్ని కోరారు. శోకతప్తులైన వారి కుటుంబీకులకు వైయస్ జగన్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఘటనలో విశాఖ వాసి చంద్రమోళిని, కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదన్ రావును ముష్కరులు దారుణంగా హత్య చేసినట్టు తెలిసింది. కశ్మీర్‌లో ఉగ్రదాడిని నిరసిస్తూ వైయస్సార్‌సీపీ క్యాండిల్ ర్యాలీలు కశ్మీర్‌లోని పహల్గామ్‌లో టూరిస్టులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ వైయస్సార్‌సీపీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో క్యాండిల్ ర్యాలీలు నిర్వహించనుంది. ఉగ్రవాద దాడిని ఖండిస్తూ ఈరోజు సాయంత్రం ర్యాలీలు చేపట్టనుంది. పార్టీ అధ్యక్షుడు శ్రీ వైయస్.జగన్ ఈమేరకు పార్టీ నాయకులకు, పార్టీ



శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉగ్రవాదుల దాడిని అమానుష చర్యగా పేర్కొన్నారు. దేశం అంతా ఒక్కతాటిపై నిలవాలన్నారు. ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండిస్తూ పార్టీ శ్రేణులు క్యాండిల్‌ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అన్ని జిల్లాకేంద్రాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పహల్గాం ఘటనలో పలువురు మరణించండం అత్యంత బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఏపీకి చెందిన ఇద్దరు వ్యక్తులు మరణించడం అత్యంత బాధాకరమన్నారు.

## పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య

### - ఎంపి డాక్టర్ మద్దెల గురుమూర్తి

**వెంకటగిరి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త** జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడి పిరికిపంద చర్య అని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తీవ్రంగా ఖండించారు. అమాయక పర్యాటకులపై జరిగిన ఈ కిరాతక దాడిని ముష్కర మూకల పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు. దేశ సమైక్యతను దెబ్బతీసే ఉగ్రవాద చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించరాదని అన్నారు. పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు చేసిన ఈ దాడి దేశ శాంతి భద్రతలను భంగ పరిచే చర్యగా అభివర్ణించారు. రాజకీయాలకు అతీతంగా, ఈ దాడులకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడవలసిన సమయం ఇదని తెలిపారు. బాధితులకు తగిన న్యాయం జరిగే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తెసుకోవాలని కోరారు. అలాగే ముష్కరులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ఘటనలో మరణించిన బాధిత కుటుంబాలకు ఎంపీ గురుమూర్తి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తిరుమలలో భద్రతా లోపాలపై తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం.గురుమూర్తి ఫిర్యాదు చేయడంతో కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. తక్షణ జోక్యం అవసరమని కోరుతూ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి చేసిన ఫిర్యాదుతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సెక్రటరీ మృత్యుంజయ్ త్రిపాఠి ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీకి లేఖ రాశారు. ఈ అంశంపై నిశితంగా పరిశీలించి సమాధానం పంపాలని ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీని కేంద్రహోంశాఖ ఆదేశించింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలలో ఒకటైన తిరుమలలో భద్రత చాలా కీలకమని, అలాంటి చోట వరుసగా పునరావృతమవుతున్న భద్రతలోపాలు ఆందోళన కలిగిస్తున్నాయని ఎంపీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖకు లేఖ రాసిన విషయం విదితమే. ఈ లేఖలో భక్తుల రక్షణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లను మెరుగుపర్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, కాని రెడ్ బుక్ రాజ్యాంగంపై దృష్టి సారించిన ప్రభుత్వం పాలనపై పట్టు కోల్పోయిందని పేర్కొన్నారు. తిరుమలలో భద్రతా లోపాలు భక్తుల జీవితాలను ప్రమాదంలో పడేయడంతో పాటు, వెంకటేశ్వర స్వామి వారి ఆలయ పవిత్రతను తీవ్రంగా దెబ్బతీశాయని తెలిపారు. ప్రస్తుత టీటీడీ పాలక మండలి భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తెలిపారు.



## కోయంబత్తూర్ బస్సులో బాలికపై వేధింపులు

**తిరుపతి, ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రప్రభుత్వ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నడిచే బస్సులో ఓ బాలికపై వేధింపులకు పాల్పడిన ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. బాలిక తరపున ఓ వ్యక్తి వేధింపుల ఘటనపై ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, తమిళనాడు సిఎం స్టాలిన్‌కు, పర్యాటకశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టిటిడి దర్శనాల విషయంలో 300 రూపాయలు సుపథం దర్శన టిక్కట్లను మూడునెలల క్రిందట రద్దుచేశారు. దీంతో ప్యాకేజీ బస్సులు కూడా పర్యాటక శాఖ తిరుమల యాత్ర నడపడంలేదు. అనధికారికంగా పర్యాటకశాఖ తిరుపతి శాఖ తిరుపతినుండి కోయంబత్తూరుకు ప్రత్యేక ప్యాకేజీ బస్సును నడిపింది. ఇందులో ఈనెల 14వతేదీ చాలావరకు తమిళనాడు ప్రయాణీకులు ఉన్నారు. ఆ బస్సును డ్రైవర్ బివి ప్రసాద్, ఎంవి రమణలు నడిపారని, ఆ సమయంలో సిసికెమెరాలు కూడా పనియుయలేదని ప్రయాణీకుల ఆరోపణలు. అనధికారికంగా ప్రయాణీకులను ఎక్కించుకుని నడపడమేగాక బస్సులో ఓ వ్యక్తి మైనర్‌బాలికపట్ల అసభ్యకరంగా వ్యవహరించి, వేధించాడనే ఫిర్యాదు మెయిల్ ద్వారా వెలుగుచూసింది. అనధికార ప్యాకేజీలు నడపడమేగాక ఈ ఘటనపై కనీసం పర్యాటకశాఖ డ్రైవర్‌లు కూడా నోరుమెదపకపోవడం పట్ల ప్రయాణీకులు మండిపడ్డారు. ఉచిత దర్శనం పేరుతో నడిపే ఈ ప్యాకేజీ బస్సులో జరిగిన ఘటనపై విచారణకు పర్యాటకశాఖ అధికారులు ఆదేశించినట్లు సమాచారం. అంతేగాక డ్రైవర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఓ ప్రయాణీకుడు సిఎంకు ఫిర్యాదు చేయడంతోనే పర్యాటకశాఖ అక్రమాలు వెలుగుచూడటం మరీ కొసమెరుపు. మరీ మైనర్‌బాలికపై వేధింపులకు పర్యాటకశాఖ చర్యలు ఏంటో చూడాల్సిందే.

## ప్రజాసమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

### - అంకభూపాలపురంలో ఎమ్మెల్యే ఇంటూరి

**వలేటివారిపాలెం (నెల్లూరు), ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఇందుకోసం నిరంతరం శ్రమిస్తున్నట్లు ఆయన వివరించారు.ఇందులో బాగంగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో నియోజకవర్గంలో కోట్లాదిరూపాయలు వెచ్చించి అభివృద్ధి సంక్షేమ పనులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం మండలంలోని సుమారు రూ.10లక్షలుతో నిర్మించిన సీసీ రోడ్డుకు, దాదాపు రూ.40లక్షలతోనిర్మించిన సచివాలయ భవనానికరి ప్రాంరభోత్సవం చేశారు. అనంతరం సుమారు రూ.8లక్షల విలువైన వ్యవసాయ ఉపకరణాలును 50శాతం సబ్సిడితో లబ్దిదారులుకు పంపిణీ చేశారు. తదుపరి ఎంపీడీవో నరేంద్రదేవ్ అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు.గత ప్రభుత్వ తప్పిదాలను విమర్శిస్తూ తమ ప్రభుత్వం పూర్తిగా ప్రజోపయోగకరమైన పనులుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి పనులుకు రాజకీయాలకతీతంగా సహకరించాలన్నారు. ఉద్దేశ్యపూరితంగా ఇబ్బందుల కల్గిస్తే ప్రత్యామ్నాయం ఎంటో తమకు పూర్తిగా తెలుసన్నారు. కనీసం గ్రామంలో శ్మశానం కూడా లేదంటే ఎంత హాస్యాస్పదంగా ఉందో గమనించాలన్నారు. ఈ గ్రామంలో డ్రైనేజివ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అయ్యవారిపల్లెలో చేపట్టబోయే పారిశ్రామికీకరణతో ఈ ప్రాంతప్రజలుకు ఎంతో ఉపయోగం కలగనుందన్నారు.పరిష్కారానికి సహకరించాలని గ్రామస్తులకు విజ్ఞప్తిచేశారు. మండల తెదేపా అధ్యక్షుడు మాదాల లక్ష్మినరసింహం



మాట్లాడుతూ యువనేత 24గంటలు పనిచేసే ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సేవలును వినియోగించు కోవాలన్నారు.ఏ సమస్యకైనా నేరుగా ఎమ్మెల్యేని కలవాలని సూచించారు. కార్యకర్తలంతా ఐక్యతతో సమస్యల పరిష్కారానికి ఆయనకు చేయూత నివ్వాల్సిన ఆవశ్యకతను ఆయన గుర్తుచేశారు. వ్యవసాయశాఖ ఏడీ అనసూయ మాట్లాడుతూ ఈ క్రాపు నమోదుచేసుకొని ప్రభుత్వ రాయితీలు పొందాలన్నారు.సీనియర్ అడ్వకేట్ ఎగడా శ్రీనివాసులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే ఇంటూరికి మంచి పట్టు ఉందన్నారు. దశలవారీగా పరిష్కారానికి ఆయన ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్న తీరును వివరించారు. శ్మశాన,భూసమస్యలపై బి.మాల్యాద్రి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ మధుబాబు, హౌసింగు ఏఈ నాగరాజు,ఏవో హేమంత్‌కుమార్,నాగరాజు, తెదేపా నేతలు పెగడా నరసింహారావు, కాకుమాని హర్షకుమార్, వలేటి మధు, కొంకా రమేష్,గుత్తా మహేశ్వరరావు,పెగడా మోహన్, చెంచు శ్రీనివాసులు,సిరిగిరి కొండారెడ్డి,గుత్తా తిరపతయ్య, చుండి సాంబయ్యపాల్గొన్నారు.

## పది ఫలితాలతో పాఠశాలల్లో సంబరాలు

**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** పది పరీక్షా ఫలితాలతో శ్రీకాళహస్తిలో సంబరాలు అంబరాన్ని అంటాయి. శ్రీకాళహస్తిలో 11 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. కార్పొరేట్ పాఠశాలలు 4 ప్రవేటు పాఠశాలలు 29 ఉన్నాయి.పదవ తరగతి పరీక్షలకు 2220 మంది హాజరు కాగా ప్రభుత్వ పాఠశాలల నుంచి 1167 మంది హాజరు కాగా ఉత్తీర్ణులైంది 834 మంది.71శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో మున్సిపల్ పరిధిలోని బాబూ అగ్రహారం పాఠశాలకు చెందిన కేతన్ 600 మార్కులకు గాను 589 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో టౌన్ ఫస్ట్ అయ్యాడు. బాలుర ఉన్నత పాఠశాలలో నితిష్‌మోషన్ రాజ్ 584 మార్కులు సాధించి పాఠశాల ఫస్ట్ అయ్యారు. రాజీవ్‌నగర్‌లోని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సి విద్యార్థి 583 మార్కులు సాధించగా శ్రీకాళహస్తిలోని సరస్వతి బాయ్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి 579 మార్కులు సాధించారు. ఎపిడబ్ల్యు బాలికల గురుకులంకు చెందిన విద్యార్థిని 560 మార్కులు సాధించగా జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థి 576 మార్కులు సాధించింది. ఎపిఎస్ డబ్ల్యుఆర్ఎస్ బాలికల గురుకులంలో విద్యార్థి 565 మార్కులు సాధించి రికార్డు సాధించారు. మొత్తం మీద ప్రభుత్వ పాఠశాలల్లో 71.47శాతం ఉత్తీర్ణత సాధించారు.ఇక ప్రవైటు పాఠశాలల్లో ద స్కూల్ విద్యార్థి దయాశంకర్ 595 మార్కులు సాధించారు.ఇక కార్పొరేట్ పాఠశాలల్లో భాష్యం పాఠశాలకు చెందిన విద్యార్థి చాతుర్య 597 మార్కులు సాధించినట్లు మేనేజ్‌మెంట్ ప్రకటించింది.కాగా నారాయణ పాఠశాలకు చెందిన ప్రశాంతి 596 మార్కులు సాధించగా రత్నం పాఠశాలకు చెందిన ఎన్ సాయిశ్రీ 591 మార్కులు సాధించినట్లు ఆయా మేనేజ్‌మెంట్లు ప్రకటించాయి. శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులకు తీసుపోమని పది ఫలితాలు చాటి చెబుతున్నాయి.గత ఏడాది కూడా గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థుల కంటే 10 మార్కుల తేడాతోనే సత్ఫలితాలు సాధిస్తున్నారు.

## విహార యాత్రలో విషాదం!

## ఉగ్ర మూకల దాడిలో విశాఖ వాసి చంద్రమౌళి మృతి

**విశాఖపట్నం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** కాశ్మీర్ దాడి లో వెంటాడి మరి హత్య చేసిన ముష్కరులు!! బుధవారం రాత్రికి విశాఖ చేరుకున్న మృతదేహం!!శుక్రవారం విశాఖలో అంత్యక్రియలుజమ్మూ కాశ్మీర్లో సుందర ప్రదేశాలను తిలకించాలని చేపట్టిన వారి విహారయాత్ర విషాదంగా మారింది.టూరిస్టులు అందరూ ఒకే చోట సేదతీరి ఉన్న సమయంలో ముష్కరులు వారిని చుట్టుముట్టి విచక్షణారహితంగా కాల్పులు జరిపి పలువురును పొట్టన పెట్టుకున్నారు.ఈ ఘటనలో విశాఖపట్నం కు చెందిన రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి జరజాపు చంద్రమోళి (69) మృతి చెందారు.ఈనెల 16న మరో రెండు కుటుంబాలతో కలిసి కాశ్మీర్ టూర్ కి వెళ్లిన చంద్రమోళి షెడ్యూల్ ప్రకారం ఈనెల 25న విశాఖ తిరిగి రావాల్సి ఉంది.ఇంతలోనే ఈ విషాదం చోటు చేసుకుంది.అతను మృతి చెందారన్న విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.జమ్మూ కాశ్మీర్ లోని పహల్గా సమీపంలో టూరిస్టులందరూ ఒకే చోట ఉన్న సమయంలో ఆర్మీ సిబ్బంది దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు వారందరిని చుట్టుముట్టారు.మరి ఐడి కార్డులను కూడా పరిశీలించారు.అందులో ముస్లిమ్స్ కానీ వారిని నిర్దాక్షి ణ్యంగా కాల్పులు జరిపి హతమార్చారు.ఉగ్రవాదులకు చిక్కిన చంద్రమోళి తనను వదిలేయాలని ప్రాదేయపడినప్పటికీఉగ్ర మూకలు కనికరించలేదు.వారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్న సమయంలో మీ ప్రధాని నరేంద్ర మోడీకి చెప్పుకో అంటూ అతనిపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపారు.ఈ ఘటనలో మృతి చెందిన వారిలో చంద్రమోళి పేరు లేకపోవడంతో అతను మిస్సింగ్ అయినట్లు కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. మరుసటి రోజు కొందరు టూరిస్టుల ద్వారా అతను మృతి చెందినట్లు సమాచారం వచ్చింది.ఇతనితో పాటు వెళ్లిన మరో ఐదుగురు క్షేమంగా ఉన్నట్లు తెలిసింది.అతను మృతదేహాన్ని బుధవారం ప్రత్యేక విమానం ద్వారా విశాఖ తరలించనున్నారు.!! కుటుంబ సభ్యుల కన్నీటి పర్యంతం..ఉగ్ర మూకల దాడిలో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి చంద్రమోళి మృతి చెందడం ఆయన కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఒక కుటుంబ పెద్దగా అలాగే ఎంకరేజ్ అపార్ట్మెంట్ వైస్ ప్రెసిడెంట్ గా ఉంటూ తన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ అందరి మనసులలో ఒక మంచి వ్యక్తిగా చెరగని ముద్ర వేసుకున్నారు.అందరితో చాలా కలవిడిగా ఉండే చంద్రమోళి కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందడం చాలా షాకింగ్ గా ఉందని ఆ అపార్ట్మెంట్ వాసులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మరోపక్క కుటుంబ సభ్యులు కూడా కన్నీటి పర్యంతమవుతున్నారు.!! ఈనెల 25న తిరిగి రావాల్సి ఉండగా ఇంతలోనే ఇలా జరిగింది..ఈనెల 16న ట్రావెల్ ఏజెంట్స్ ద్వారా చంద్రమోళి తో పాటు మరో ఐదుగురితో కాశ్మీర్ వెళ్లిన చంద్రమోళి ఈనెల 25న విశాఖ తిరిగి రావాల్సి ఉందని చంద్రమోళి సమీప బంధువు కుమార్ రాజా తెలిపారు.చంద్రమోళి కుటుంబంతో పాటు అప్పన్న, శశిధర్ కుటుంబాలు కూడా ఉన్నాయన్నారు.ఉగ్రవాదులు టూరిస్టులు అందరిని చుట్టుముట్టి వారిపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపి చాలామందిని హతమార్చారని తెలిపారు. ఈ క్రమంలో చంద్రమోళి తప్పించుకునే ప్రయత్నం చేశారని కానీ ముష్కర్లు వెంటాడి మరి అతనిని హత మార్చారని పేర్కొన్నారు.మృతదేహం బుధవారం రాత్రి విశాఖ రానున్నట్లు తెలిపారు.అతని ఇద్దరి కుమార్తెలు అమెరికా నుంచి గురువారం వస్తున్నట్లు వెల్లడించారు.శుక్రవారం అతని పార్థివ దేహానికి అంత్యక్రియలు జరుగుతాయని తెలిపారు.

## తిరుపతిలో యువతిపై సామూహిక అత్యాచారం

### -మత్తుకలిపిన జ్యూస్ తాగించిన నిందితులు

**తిరుపతి,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతినగరంలో సామాజిక మాధ్యమంద్వారా పరిచయమైన ఓ యువతిపై కొందరు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మత్తుకలిపిన జ్యూస్ తాగించి నలుగురు యువకులు ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు బాధిత యువతి ,తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం సాయంత్రం తిరుపతి నగరంలోని వెస్టుపోలీసుస్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. నగరంలోని పెహ్రూనగర్‌లో నివాసముంటున్న (16)ఏళ్ల దళిత యువతితో సామాజిక మాధ్యమంలో అప్పటికే పెళ్లయి భార్య, ఓ పాప ఉంది. అయినా చెడుఅలవాట్లకు బానిసైన యువకుడు సామాజిక మాధ్యమంద్వారా యువతితో పరిచయంచేసుకుని ప్రేమ కార్యకలాపాలు సాగించాడు. ఏకంగా పెళ్ళిచేసుకుంటానని నమ్మించాడు. యువతికి మరో మైనర్‌బాలికకు మాయమాటలు చెప్పి నమ్మించి తీసుకురమ్మన్నాడు. ఇద్దరూ కలసి యువకుడు వద్దకు వెళ్ళడంతో అతనితోబాటు మరో ముగ్గురు యువకులు దళిత యువతిని తీసుకుని బయటకు వెళ్ళారు. అక్కడ యువతికి మత్తుకలిపిన జ్యూస్‌తాగించి ఆపై అత్యాచారంచేశారు. మరుసటిరోజు తిరుపతి ఆర్టీసిబస్టాండ్‌లో వదలిపెట్టి పరారయ్యారు. అప్పటికే యువతి కనిపించడం లేదని బాధిత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్టాండులో అపస్మారకస్థితిలో ఉన్న యువతిని మహిళ ఆటోడ్రైవర్ చేరదీసి ఇంటికి చేరవేసింది. బుధవారం సాయంత్రం యువతి సోదరుడికి విషయం చెప్పడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు విచారణలో యువతి విస్తుబోయే విషయాలు వెల్లడించడం, ,యువతి మొబైల్‌ఫోన్‌లో ఉన్న ఇన్‌స్టాగ్రామ్‌లోని ఫోటోలతో నిందితులను గుర్తించింది. దీంతో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. యువతిని ప్రసూతి ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్యనివేదిక అందితే అత్యాచారంలో ఎంతమంది పాల్గొన్నారనేది తెలియదని, ఈ కేసును విచారణ చేస్తున్నట్లు పోలీసువర్గాలు మీడియాకు తెలిపాయి. అనుమానంతో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## తిరుపతిజూలో బెంగాల్‌పులి మృతి

**తిరుపతి,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జూలో ఉన్న 20ఏళ్ళ వయస్సున్న బెంగాల్‌పులి అనారోగ్యంతో మృతి చెందింది. జూలో ఎండవేడి అధికంగా ఉండటం, కొండదిగువన జూ వుండటంతో మరింతగా జంతువులకు సమస్యలు ఎదురవుతున్నాయి. జూలో చల్లదనం కోసం వట్టివేర్లు, కూలర్లుఏర్పాటుచేసినా వేడికి అనారోగ్యానికి గురైంది. బెంగాల్ పులిని 2003లో ఆత్మకూర్ డివిజన్ నుండి తిరుపతికి జూకు తీసుకువచ్చారు. మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందడంతో బుధవారం మధ్యాహ్నం ఎస్వీపశువైద్యశాలలో పోస్టుమార్టమ్ నిర్వహించారు.


**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

**E-PROCUREMENT SHORT TENDER NOTICE**

| S.No | NIT No | Name of the Work |
|---|---|---|
| 1 | NIT No. 18/PROC/MAU61-OPOM0COMM/16/2025-JDC, Dt. 23.04.2025 | APCRDA-"Request for Proposal (RfP) for Appointment of Agency for Branding, Communications, and Digital Outreach Strategy for Amaravati" |

The bid can be downloaded on AP e-procurement portal from **24.04.2025 to 01.05.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **01.05.2025 up to 15.00 Hrs,** Technical bid opening **01.05.2025 @ 16.00 Hrs**

**E-PROCUREMENT TENDER NOTICE**

| S.No | NIT No | Name of the Work |
|---|---|---|
| 2 | NIT No. MAU61-ADMN0SD(VI)/19/2025-HB, Dt. 23.04.2025. | Supply and fixing of split air conditioners of four numbers in APCRDA thullur unit office"- **Estimate Amount: Rs. 3.60 Lakhs.** |

The bid can be downloaded on AP e-procurement portal from **24.04.2025 to 08.05.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid **08.05.2025 up to 15.00 Hrs,** Technical bid opening **08.05.2025 @16.00 Hrs.**

| S.No | NIT No | Name of the Work |
|---|---|---|
| 3 | NIT No. MAU61-ADMN0SD(VI)/16/2025-HB, Dt. 23.04.2025. | "Construction of Horticulture Nursery cum training centre (HNTC) at UD Palem in CRDA Region"- **Estimate Amount: Rs. 96.00 Lakhs.** |

The bid can be downloaded on AP e-procurement portal from **24.04.2025 to 09.05.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid **09.05.2025 up to 15.00 Hrs,** Technical bid opening **09.05.2025 @16.00 Hrs.**

For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**

Sd/- Commissioner, APCRDA, Vijayawada.

కల్లోలంగా ఉన్న కొలనులో నిశ్చలమైన ప్రతిబింబం కనపడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.

-కె. స్టాన్ స్లావిస్కి

# మంచుకొండల్లో నెత్తుటి ధార

కశ్మీరులో పదమూడేళ్ల తర్వాత 26 మంది పర్యాటకులను బలితీసుకుంటూ ముష్కరులు వికటాట్టహాసం చేశారు. ఇదేదో దొంగ దెబ్బ కానేకాదు. పకడ్బందీ ప్లాన్‌తో చేసిన దాడే. ముందే హెచ్చరికలున్నా పర్యాటకుల్ని కాపాడుకోలేకపోయాం. ప్రభుత్వాధికారులను లక్ష్యంగా చేసుకున్న చర్యగా భావించేందుకు ఆధారాలున్నా ఇతర పర్యాటకుల్ని కూడా చంపేశారు. వారిలో ఐబి. నేవీ, ఎయిర్‌ఫోర్స్ అధికారులు తమ కుటుంబాలతో సందర్శనకు వచ్చారు. తమను వదలిపెట్ట మని చంపొద్దని ప్రాధేయపడినా ఎవర్నీవారు కనికరించలేదు. నిర్దాక్షిణ్యంగా కాల్చేశారు. చనిపోయిన వారిలో 25 మంది పురుషులు, ఒక మహిళ ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో దక్షిణ కశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లా పహల్‌గాంలో దాదాపు వందలాది మంది పర్యాటకులున్న బైసరన్ ప్రాంతంపై ఒక్కసారిగా ఉగ్రవాదులు చుట్టుముట్టారు. మృతిచెందిన వారిలో ప్రభుత్వాధికారులే ఎక్కువ మంది ఉండడంతో టెర్రరిస్టులు వారినే లక్ష్యంగా చేసుకున్నారని తొలుత భావించినా వారి పాశవిక చర్య వెనుక పాకిస్థాన్ ఆర్మీ హస్తం ఉండి ఉండవచ్చుననే అనుమానాలు బలపడ్డాయి. ఇదొక హృదయ విదారక అమానుష హత్యాకాండగా ఈ సంఘటనకు ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. ఈ దురాగతానికితామే బాధ్యులమని లష్కరే ఎతోయిబా అనుబంధ సంస్థది రెసిస్టెన్స్‌ఫ్రంట్ బహిరంగంగానే ప్రకటించుకోవడం విశేషం. ప్రత్యక్ష సాక్షులు చెబుతున్న దానిని బట్టి తమను చంపొద్దని వేడుకున్నా తూటాల వర్షం కురిపించారని, మోడీతోచెప్పుకోండన్నారని వివరించారు. విశాఖపట్నంకు చెందిన చంద్రమౌళి పారిపోతుండగా వెంటాడి స్నైపర్ ఫైర్‌తో కాల్చిచంపారు. వేసవిలో కశ్మీర్ వెళ్లడానికి ఎంతో మంది ఇష్టపడతారు. ఇటీవలే వివాహంచేసుకున్న నవజంటలు కూడాఉన్నాయి. మృతుల్లో ఇద్దరు విదేశీయులుకాగా ఒకరు నేపాలీ, మరొకరిది యూ.ఎ.ఇ. పలువురు కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, యుపి,బీహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణరాష్ట్రాలకు చెందినవారున్నారు. పహల్గామ్‌కు 5,6కిలోమీటర్ల దూరవంలో ఉండే బైసరన్ ప్రత్యేకమైన రిసార్టులుండే టూరిజం ప్రదేశం. యేటా ఈ ప్రాంతానికి అధిక సంఖ్యలో దేశ విదేశాల నుంచి టూరిస్టులు వస్తుంటారు. 2019లో పుల్వామాలో సిఆర్‌పిఎఫ్ కాన్వాయ్‌పై జరిపిన ఉగ్రవాదులదాడిలో 47మందిబలయ్యారు. తాజా దాడిలో ముష్కరులు చాలా విచిత్రంగా వికృతంగా ప్రవర్తించారని సమాచారం. పర్యాటకులు హిందువులని నిర్ధారించుకున్న తర్వాతనే వారిని పాయింట్ బ్లాక్‌లో కాల్చేశారు. తన భర్త శివ మొగ్గకు చెందిన మంజునాథ్ రావును చంపగానే తననూ చంపమని కోరినా చంపకుండా దుర్భాషలు మాట్లాడారని కర్ణాటకకు చెందిన పల్లవి చెప్పింది. హిందువులో ముస్లింలో తేల్చుకోడానికి ముస్లిం ప్రార్థనాగీతాల గురించి ప్రశ్నించి తీవ్రఉన్మాదాన్ని ప్రదర్శించారట. గుడారాలోంచి లాగి పేరడిగి కాల్చిపారేశారు. హోటళ్లలో తింటున్నవారినీ విచక్షణారహితంగా ఒక్కొక్కరిగా కాల్చేస్తుండగా పర్యాటకులు ఆర్తనాదాలు చేశారు. కశ్మీర్‌కు వేసవిలో దాదాపు 30లక్షలమంది దాకా పర్యాటకులు వస్తుంటారు. అయినా ప్రభుత్వపరంగా పహల్గామ్ ప్రాంతంలో ప్రత్యక్ష భద్రతా ఏర్పాట్లేవీ ఉన్నట్లు లేదు. కేవలం ఐదుగురుసాయుధులు, కెమెరా కలిగిన హెల్మెట్లు ధరించి పర్యాటకప్రాంతం మీదటెర్రర్ అటాక్‌జరిగినప్పుడే నిలువరించగల భద్రతా సిబ్బంది లేకపోవడంవిచారకరం. కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేసి, మూడు ప్రాంతాలుగా విభజించి, ఎన్నికలు జరిపించడంతో పాకిస్థాన్ బాగా ఆగ్రహంతో ఉంది. దేశంలో వక్ఫ్‌బిల్లు సవరించాక దేశీయ ముస్లింలలోనూ ఆగ్రహావేశాలు వ్యక్తమైనా ఎవరూ పాక్ దేశీయులతోచేయి కలుపలేదు. ఇదిలాఉండగా ఇక కేంద్ర ప్రభుత్వం ముందున్నది ఉమ్మడి పౌరస్మృతి మాత్రమే. కనుక ఆదిశగా అడు గులువేసే తరుణంలో పాక్‌ఆగ్రహం గురించి అంచనా వేయలేని పరిస్థితి ఏమీలేదు.అయినా జరుగరానిది జరిగిపోయింది. ఇంతమంది ప్రముఖులు ఒకేసారి కశ్మీర్ రావడాన్ని ముష్కరులు అలుసుగా తీసుకున్నారనిపిస్తుంది. ఏమయితేనేం అమాయకులు బలయ్యారు. సైఫుల్లాఖాన్ అనే ఉగ్రవాది ముందుగానే ఈ దాడుల గురించి హెచ్చరించాడు. రాబోయే రోజుల్లో ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో ముజాహిదీన్‌లు దాడిచేస్తారని, ఆ తర్వాత కశ్మీర్ తమ చేతుల్లోకి రాబోతోందని కేంద్రప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించినా భద్రతాబలగాలుఏమాత్రం అప్రమత్తంగాలేరని అర్థమవుతోంది. ఇప్పుడు జరిగినదాడి కశ్మీరు టూరిజానికి పెద్ద దెబ్బ. కశ్మీరుకు రావడానికి దేశ విదేశీ టూరిస్టులు తీవ్ర భయభ్రాంతులౌతారు. పర్యాటకులు తగ్గిపోయే అవకాశముంది. పర్యాటకాదాయం భారీగా పొందే కశ్మీర్‌కు భద్రత కోసం కేంద్రం మరిన్ని పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలి. 2000 మార్చిలో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ భారత్‌లో పర్యటిస్తున్న సమయంలో అనంత్‌నాగ్‌జిల్లా చట్టీసింగ్ పురాలోఉగ్రవాద దాడిలో 36మంది సిక్కులను కాల్చిచంపారు. తాజాగా అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ ఇండియాలోపర్యటిస్తున్నవేళ అలాంటి దుండగుల దుశ్చర్యకు 26 మంది చనిపోవడం విచారకరం. ఇలాజరిగిన ప్రతిఉగ్రవాది దాడిలోనూ ఎక్కువ మంది చనిపోతున్నారు. ఈ ఘటనను ఖండిస్తూ కశ్మీరు వాసులు ప్రజాసంఘాలు సైతంనిరసన వ్యక్తంచేస్తున్నాయి ముష్కర చర్యలను ఖండిస్తున్నాయి. సభ్య సమాజం గొంతెత్తి మృతుల కుటుంబాలకు సంతాపం తెలియచేస్తోంది. పహల్గామ్ ఊచకోతను ఖండిస్తూ సుప్రీంకోర్టుఏకగ్రీవ తీర్మానం చేసింది. ముష్కరులకు పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐసహాయం అందించిందని తెలుసు. ఇక పాక్ కవ్వింపు చర్యలపై భారత్‌యుద్ధం ప్రకటించడమే తరువాయి.

లోకులు తొందరగా నిందిస్తారు. అంతే త్వరగా అభినందిస్తారు కూడా. అందువల్ల ఇతరులు నిన్ను గురించి అనుకునే మాటలకు అంత విలువ ఇవ్వొద్దు.



రామకృష్ణ పరమహంస

అతిథి అంటే ఇంటికొచ్చిన బంధువు మాత్రమే కాదు. ఆకలి బాధతో మిమ్మల్ని ఆశ్రయించిన ప్రతిజీవి, పశుపక్ష్యాదులు సైతం అతిథులే.



వి.జాన్సన్

# ప్రజావాక్కు



## నీటి ఎద్దడిని అరికట్టాలి

వేసవి మొదలవడంతోనే చాలా ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి ఎదురవుతుంది. నీటి కొరత ప్రజల జీవితాల్లో తీవ్ర ప్రభావం చూపుతోంది. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ప్రతి ప్రాంతంలో నీటి కోసం పోటీపడే పరిస్థితి ఏర్పడుతోంది. ఈపరిస్థితికి ప్రధానంగా భూగర్భ జలాల క్షీణత, వర్షపు నీటి వృథా, పట్టణీకరణ వల్ల అడవులు దెబ్బతినడంవంటి అంశాలే ప్రధాన కారణం. పూర్వపు రోజుల్లోగ్రామాల్లో కొలనులు,చెరువులు, వాగులు, వంకలు వంటి ప్రకృతిసిద్ధ నీటి వనరులు అధికంగా ఉండేవి. వానాకాలంలో ఎక్కువగా వర్షపు నీరు వీటిలో నిల్వ ఉండి,భూగర్భ జలాలు పెరిగేలా సహాయపడేవి. అయితే ఇప్పుడు కాలక్రమేణా చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయి,వాగులు,వంకలు కనుమరుగవుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో మంచినీటి సమస్య మరింత తీవ్రమోతోంది. ఇదే అదనుగా భావించి ట్యాంకర్ల ద్వారా నీటి వ్యాపారం విపరీతంగా పెరుగుతుంది.

-తోట యోగేందర్, మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా

## గురుకులాలలో ఇంటర్ కోర్సులు

వచ్చే విద్యా సంవత్సరం తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీగురుకులాలలో తప్పనిసరిగా ఇంటర్మీడియట్ స్థాయిలో అన్నికోర్సులుఎంపిసి, బైపిసి, హెచ్ఈసి, సిజిసి, ఎంఇసి అన్నికోర్సులను ప్రవేశపెట్టాలి. ఇప్పటివరకు మ్యాథమెటిక్స్ సైన్స్‌కోర్సులున్నాయి. వాటితోపాటుగా సామాజిక శాస్త్రాలు అయిన ఎకనామిక్స్. హిస్టరీ, సివిక్స్,కామర్స్ వంటి కోర్సులను కూడా తప్పనిసరిగా వచ్చే విద్యా సంవత్సరం నుండి తప్పనిసరిగా ప్రారంభించాలి. పేద విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంటుంది.

-డాక్టర్ ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

## పెరుగుతున్న మధుమేహం

దేశంలో పెరిగిపోతున్న మధుమేహం ,గ్యాస్ట్రిక్ వ్యాధుల తగ్గుదలకువాడుతున్న స్టెరాయిడ్,అసిడిటీ వగైరా మందులు నాణ్యత పరీక్షలో నిర్ణీత ప్రమాణాలు లేవని సంబంధిత సంస్థ తేల్చి చెప్పింది.దీనితో. 84రకాల ఇతర మందులు కూడా ఉన్నవి. జీవితకాలం వాడాల్సిన మందు కారణం ఏదైనా నాణ్యత లేనిది వాడకం జరిగితే ,ఉన్న రోగం తీవ్రత తగ్గక కొత్తరోగం రావొచ్చు.

-బి. మేఘనాథం, విశాఖపట్నం

## ఉగ్ర దాడి అమానుషం

పర్యాటకుల స్వర్గధామం మినీస్విర్జర్లాండ్‌గా పిలిచే జమ్ము కాశ్మీర్‌లోఉగ్రవాదుల కాల్పుల్లో 27 మంది పర్యాటకులు మృతి చెందిన ఘటన అమానుషం. ఈ ఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఈదుశ్చర్యను తీవ్రంగాఖండించాలి. ఉగ్రవాదులు దొంగ దెబ్బలతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కూడా మరణించడం బాధాకరం. ఉగ్రవాద మూకల విషయంలో కేంద్రం కఠినంగా వ్యవహరించాలి. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలి. ఉగ్రవాదాన్ని కేంద్రం ఉక్కుపాదంతో అణచి వెయాలి. మరో మారు ఇలాంటి ఘటనలు జరగకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలి. అందరూ ఈ ఉగ్ర చర్యను ఖండించాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్‌పల్లి జిల్లా

## సామాన్యులకు పసిడి ఎంతో దూరం

అమెరికాలో రెండోసారి అధికారం దక్కించుకున్నడొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రభుత్వ విధానాలు, సుంకాల ప్రకటన, అమెరికాతో చైనాకు జరుగుతున్న వాణిజ్య యుద్ధం, డాలర్ విలువ బలహీనంగా ఉండటం వంటి కారణాలతో సురక్షిత పెట్టుబడి సాధనంగా బంగారంపై ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తుండటంతో ప్రస్తుతం బంగారం ధర హిస్టరీ క్రియేట్ చేస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. లక్ష నమోదైంది. దీనిమీద 3 శాతం గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ కలిపితే మొత్తంధర రూ. 1,02,160కి చేరుకుంది. మన దేశంలోనే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లోనూ పసిడిధరలు భగ్గుమంటున్నాయి. ధరలు ఇంతలా పెరగడం చరిత్రలో ఇదే తొలిసారి అని నిపుణులు చెబుతున్నారు.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## చౌక డిపోలలో రాగులను పంపిణీ చేయాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా కిలో రాగులను రెండురూపాయలకే పంపిణీ చేయటం హర్షణీయం. చిరుధాన్యాలలో రాగులు ఎంతో ముఖ్యమైనవి. మన ఆరోగ్యానికి ఉపయోగకరం. రాగులతో రాగి ముద్దలు, రాగి జావ తదితరాలుగా వాడుకోవచ్చు.రాగులలో అనేక పోషకాలు ఉన్నాయి. రాగులలో బి1, బి2, బి3, బి6 విటమిన్లతోపాటు సి విటమిన్ కూడా కొంతఉంటుంది. రక్తహీనతను తగ్గించటంలో ఉపయోగపడుతుంది. వైద్యులు సైతం రాగులను సిఫార్సు చేస్తున్నారు.

-కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# డీలిమిటేషన్ ప్రజాస్వామ్య మనుగడకు అడ్డం కారాదు!

**రాజకీయాలు శాశ్వతం కావు కానీ దేశాలూ ప్రజలూ శాశ్వతం! ప్రజల కోసం వుండే వ్యవస్థల్లోని లోటుపాట్లని కాలానుగుణంగా సవరించుకోవటం అధికారంలో వున్న పార్టీ చేయాల్సిన బాధ్యత వుంది. అవసరమైతే రాజనీతిజ్ఞతను ప్రదర్శిస్తూ అధికార దర్పాన్ని, అహంనూ ప్రక్కనపెట్టి విపక్షాలనూ, న్యాయ నిపుణులనూ, మేధావులనూ, ప్రజా సంఘాలనూ విశ్వాసంలోకి తీసుకొని అవసరమైతే ఒకటి కాదు రెండు కాదు అవసరమైనన్ని సమావేశాలు జరిపి చర్చల ద్వారా సమయోచిత నిర్ణయాలు ప్రభుత్వాలు తీసుకుంటే అందరూ సంతోషించటమే కాదు ఆమోదయోగ్యమైన నిర్ణయాలకు కట్టుబడి వుంటారు! అదే ప్రజాస్వామ్యం పునాది మనుగడ!**



రావులపాటి సీతారాంరావు

ఓటర్లు సార్వత్రిక ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకొని తమ ప్రతినిధులను చట్టసభల్లో ప్రవేశింపచేయటానికి లోక్‌సభకైనా, శాసనసభకైనా నియోజకవర్గాలు వుండక తప్పదు. రాజ్యాంగంలోనిఆర్టికల్ 82,170 ప్రకారం సభలలోనిసభ్యుల సంఖ్య జనాభాను అనుసరించి జరపబడాలి! జనాభా ముఖ్య ప్రాతిపదికగా గుర్తించబడినప్పుడు దేశంలోని రాష్ట్రాలలోని సభలోని సీట్ల ఓటర్ల విషయంలో హెచ్చుతగ్గులు వుండక తప్పదు.ఇదే ఇప్పుడు డీలిమిటేషన్ విషయంలో పెద్ద సమస్యగా మారింది. ఉత్తరాదిన కొన్ని రాష్ట్రాలలో ముఖ్యంగా ఉత్తరప్రదేశ్లో జనాభా ఆధారంగా తీసుకోవాల్సిన ఓటర్లసంఖ్య ప్రతి జనాభా లెక్కింపులోనూ దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే విపరీతంగా పెరిగిపోతున్నది. దానివల్ల విధాన సభలో శాసన సభలలో వుండాల్సిన సీట్ల సంఖ్య ప్రతిసారీ ఎక్కువవుతున్నది. అందుచేత ప్రజాస్వామ్య మూలసూత్రాలు బీటలు వారుతున్నాయని దక్షణాది వారు ఆరోపిస్తున్నారు. దక్షణాదిలో ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం పాపులేషన్ కంట్రోల్ (జనాభా నియంత్రణ) ముఖ్యంగా ఎమర్జెన్సీ లో ఎక్కువగా జరగటంతో అటు విధాన సభకూ ఇటు శాసన సభకూ సీట్ల సంఖ్య తగ్గుతూ వచ్చింది. కుటుంబ నియంత్రణ దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వాల నిర్ణయానుసారం అమలు చేయటంవల్ల లోక్ సభలోనూ శాసనసభల్లోనూ సీట్లు తగ్గుతూ వచ్చాయి! మంచి చేసినందుకుగాను మాకు నష్టం వాటిల్లే రీతిలో డీలిమిటేషన్ నిర్ణయాలు జరిగాయని,జరగబోతున్నాయని దక్షిణాది ప్రజలు వాపోతున్నారు. కోపరేటివ్ ఫెడరలిజమ్ సూత్రానికి భిన్నంగా ఈ డీలిమిటేషన్ వ్యవహారం నడుస్తున్నదని అందువల్ల ప్రజా ప్రతినిధుల సభలలో తమ తప్పేమీ లేకుండానే తమ ప్రాతినిధ్యం తగ్గటంవల్ల దేశ నిర్ణయాలలో తమపాత్ర, జోక్యం క్రమేపీ తగ్గిపోతున్నాయని, ఈ ప్రాతిపదిక మూలాలను ప్రశ్నిస్తున్నారు! ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా ఇచ్చిన డాటా ప్రకారం మొదట జరిగిన సార్వత్రిక ఎన్నికలలో (1951-52) 489 (లోక్‌సభ) సీట్లు ఉన్నాయి. 1957లో 494, 520-1967 ( డీలిమిటేషన్ కమిషన్ మార్చి 21, 1963 నాడు 1961 జనాభా లెక్కల ఆధారంగా ఏర్పరిచినవి) 31 సీట్లు పెంచటం, 5 సీట్లు తగ్గించటం (అంతకు పూర్వం జరిగిన ఎన్నికలతో పోలుస్తే) జరిగింది! విభజన పూర్వం వున్న ఎపిలో 43 నుంచి 41, చెన్నై 41 నుంచి 39, యుపి 86 నుంచి 85, అస్సాం, మహారాష్ట్ర, గుజరాత్, కేరళ, కర్ణాటక, రాజస్థాన్, వెస్ట్ బెంగాల్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశాల్లో కొన్ని సీట్లు పెరిగాయి. కొత్త రాష్ట్రాలైన హర్యానా, జమ్మూకాశ్మీర్, నాగాలాండ్, అండమాన్ నికోబార్, చండీఘడ్, డాద్రానగర్ హవేలీ, గోవా, డమన్ అండ్ డైయూ, లక్షద్వీప్, పాండిచ్చేరిల్లో గూడా కొత్తగా సీట్లు చేర్చబడ్డాయి! లోక్‌సభ సీట్లు ప్రస్తుతం 543 (1971 సెన్సస్ ప్రకారం). 1951 నుంచి 2004లో జరిగిన పెంపుకు (డీలిమిటేషన్ కమీషన్ నిర్ణయానుసారం) ప్రత్యేక ఫార్ములాగా ఐడియల్ జనాభా సంఖ్య అంటూ అనుసరించినట్లు లేదు. జనాభా ప్రాతిపదికన నిర్ణయాలు చేసినప్పుడు రాజకీయ సరిహద్దులు, భౌగోళిక పరిస్థితులు పరిగణనలోకి తీసుకున్న దాఖలాలు లేనట్లు ఒక అభిప్రాయం వుంది. కానిస్టిట్యూయన్సీ కి ఏవిధమైన రిప్రజెంటేషన్ ముఖ్యాంశంగా వుండాలి అన్నది గూడా లెక్కల్లో వుండక తప్పదు. ప్రాంతీయతకు అన్యాయం జరగకూడదు.మతపరంగా, విద్యాపరంగా నియోజక వర్గాల సంఖ్యను పరిగణనలోకి తీసుకోవటం అవసరమా? ఇవ్వన్నీ గూడా ముఖ్యమైన అంశాలే కానీ, దక్షిణాదివారి విన్నపం గూడా



త్రోసివేయగూడదు. కుటుంబ నియంత్రణ తు.చ. తప్పకుండా దేశ శ్రేయస్సుకోరి పాటించటం వల్ల ఇప్పుడు ఈ ప్రాంతాలకు నియోజక వర్గాలు తగ్గుతున్నాయి. ఈ డీలిమిటేషన్ వల్ల అన్న అభిప్రాయం ఫెడరల్ వ్యవస్థలో మంచిది కాదు. ఇదే విధంగా డీలిమిటేషన్‌ను సంస్థీకరించటం జరుగుతే శాశ్వతంగా దక్షిణాది ప్రాంతాలవారికి గణనీయమైన నాయకత్వం, రాజకీయ పలుకుబడి ప్రాముఖ్యత కేంద్రంలో వుండకపోవచ్చనే వాదనను గూడా సహేతుకంగా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాధాకృష్ణన్, నీలం సంజీవ రెడ్డి, వి.వి.గిరి. నారాయణన్ లాంటి వారు రాష్ట్రపతులుగా, పివి నర్సింహారావు, దేవెగౌడ లాంటి వారు ప్రధానమంత్రులయ్యారు. ఇప్పుడు అలాంటి ఎంపిక డీలిమిటేషన్ జనాభా ప్రాతిపదిక మీదనే కొనసాగుతే సాధ్యం కాకపోవచ్చు! రాజ్యాధికారం దక్కటానికి జనాభా ప్రాతిపదికను పరిగణనలోకి తీసుకుంటున్న ఈ ప్రజాస్వామ్య యుగంలో ఆ జనాభా లెక్కలు అనుసరించి ఎందుకు కొన్ని ప్రాంతాలలో జనాభా తగ్గుముఖం, కొన్ని సంవత్సరాలలో పట్టింది అన్నది లెక్కలోకి తీసుకోకుండా సంఖ్యా బలాన్ని బట్టి కేంద్రం నిర్ణయాలు అమలుచేస్తే మౌలిక సిద్ధాంతాలను దెబ్బతీసి కృత్రిమ పరిస్థితులు ఆసరాతో రాజకీయాధికారం కొన్ని ప్రాంతాల వారే అనుభవించే అవకాశాలు పొందటం ఎంతమాత్రం తగదు. పార్టీలు వేరయినంత మాత్రాన కొన్ని రాష్ట్రాలల్లో న్యాయం జరిగేందుకు చేస్తున్న డిమాండ్లలో ఎంతవరకు నిజం వుందన్న ఆలోచన గూడా జాతీయ స్థాయిలో చేయక తప్పదు. నిజంగానే డీలిమిటేషన్ ఒక ప్రణాళికననుసరించి, రాజ్యాంగం ఒప్పుకొనే విధంగా చేస్తున్నాం అని కేంద్రం అనుకుంటే రాష్ట్రాలలోని అధికార పార్టీలు తమ పార్టీకిగానీ, కూటమికిగానీ వేరైనా, సహేతుకమైన ఆలోచనలు సమిష్టిగా చేసి ఒప్పించగలగాలి! అదే ప్రజాస్వామ్యంలోని ముఖ్య సూత్రం!ప్రస్తుతం ఎక్కువ జనాభా, డీలిమిటేషన్ ప్రకారం కొన్ని రాష్ట్రాలలో వుంటే దానిని ఇతర తక్కువ జనాభా కలిగిన రాష్ట్రాలతో సమంగా ఎవరికీ నష్టం కలగని విధంగా, సమాన లాభం కలిగే రీతిలో నిర్ణయాలు సమిష్టిగానో, కమీషన్ల ద్వారానో, చర్చల ద్వారానో, ఆమోదయోగ్యంగా జరుపగలిగితే కేంద్రం అన్ని ప్రాంతాల వారికి ఈ విషయంలో న్యాయంచేసినట్లు అవుతుంది! అది కేంద్రం గురుతర బాధ్యత కూడా! నిజమైన గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జి.డి.పి) ఏవిధంగానైతే ద్రవ్యోల్బణం ఆధారంగా (ఇన్ఫ్లేషన్) నిర్ణయించి, అన్ని రాష్ట్రాలకు బెనిఫిట్ కలిగిస్తారో, అదేవిధమైన రీతిలో ఎక్కువ జనాభా వున్నప్పటికినీ, అన్ని రాష్ట్రాలకు సంఖ్యాపరంగా లోక్‌సభ, విధాన సభలలో న్యాయం చేసే అవకాశాన్ని గూడా లోతుగా సమీక్షించి తీసుకోవాలి! 1977లో లోక్‌సభ సీట్లు 10.10 లక్షల సరాసరి జనాభాను పరిగణనలోకి తీసుకొని 543సీట్లు ఏవిధంగా నిర్ణయించారో 2024 ఆ సూత్రాన్నే అనుసరిస్తే 680 సీట్ల వరకు పెరిగే అవకాశం వుందని నిపుణుల అంచనా! టోటల్ ఫర్టిలిటీరేట్ రాష్ట్రాల పరంగా కూడా అందుబాటులో వుంటుంది కాబట్టి ఇతర హెచ్చుసంఖ్యలో జనాభా ఆధారంగా వచ్చే సంఖ్యను ఈ సూత్రాన్ని అనుసరించి కొంతవరకు తగురీతిలో అన్ని రాష్ట్రాలకూ న్యాయం చేయొచ్చు! ఇంకా ఇంతకంటే మంచి ఫార్ములాలు వుంటే నిర్ణయాలు అందరికీ సంతృప్తి కలిగించే విధంగా తీసుకొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే ఎవర్నీ చిన్నచూపు చూడటం లేదన్న విశ్వాసం ప్రజల్లో కలుగుతుంది! పార్లమెంటులో రాజ్యాంగ సవరణల నిమిత్తం అనేక చర్చలు జరిపి ఎలక్షన్లు ఏవిధంగా నిర్వహిస్తే ప్రజలందరికీ సంతృప్తి కలుగజేయాలని భావిస్తారో అదేవిధంగా రాజ్యాంగ సవరణ ద్వారా కూడా రాజకీయ సమతుల్యతను ఈ ముఖ్యమైన విషయంలో సాధించవచ్చు! రాజకీయాలు శాశ్వతం కావు కానీ దేశాలూ ప్రజలూ శాశ్వతం! ప్రజల కోసం వుండే వ్యవస్థల్లోని లోటుపాట్లని కాలానుగుణంగా సవరించుకోవటం అధికారంలో వున్న పార్టీ చేయాల్సిన బాధ్యత వుంది. అవసరమైతే రాజనీతిజ్ఞతను ప్రదర్శిస్తూ అధికార దర్పాన్ని, అహంనూ ప్రక్కనపెట్టి విపక్షాలనూ, న్యాయ నిపుణులనూ, మేధావులనూ, ప్రజా సంఘాలనూ విశ్వాసంలోకి తీసుకొని అవసరమైతే ఒకటి కాదు రెండు కాదు అవసరమైనన్ని సమావేశాలు జరిపి చర్చల ద్వారా సమయోచిత నిర్ణయాలు ప్రభుత్వాలు తీసుకుంటే అందరూ సంతోషించటమే కాదు ఆమోదయోగ్యమైన నిర్ణయాలకు కట్టుబడి వుంటారు! అదేప్రజాస్వామ్యం పునాదీమనుగడ! •

# స్థానిక స్వపరిపాలనే పంచాయితీరాజ్ లక్ష్యం

రామ కిష్టయ్య సంగన భట్ల

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం ఏప్రిల్ 24న భారతదేశంలో ప్రతి ఏటా నిర్వహిస్తారు. పంచాయితీ రాజ్ వ్యవస్థను పటిష్టం చేయడం కోసం కేంద్ర పంచాయతీ రాజ్‌శాఖ అధ్వర్యంతో ఈదినోత్సవం నిర్వహించ బడుతుంది. భారత దేశంలోని అతి ప్రాచీన వ్యవస్థ పంచాయతీరాజ్ వ్యవస్థ. గ్రామస్థాయిలో అమల్లోఉండే అతి ప్రాచీన పాలనా వ్యవస్థే పంచాయతీ. ఇదే స్థానిక స్వపరిపాలనా సంస్థల వ్యవస్థ. ప్రాచీనకాలంలో పనిచేస్తున్న గ్రామ పాలనావ్యవస్థ నాటి సాంఘిక పరిస్థితుల కనుగుణంగా గ్రామ వృత్తి పనివారల ప్రతినిధులతో పనిచేయగా, బ్రిటిష్ పాలన కాలంలో గవర్నర్ జనరల్ రిప్పన్ ప్రోత్సాహంతో స్థానిక స్వపరిపాలనా సంస్థలు రూపుదిద్దుకున్నాయి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలు కొంత వీటికి బలం చేకూర్చాయి. భారత దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్‌వ్యవస్థను ప్రారంభించిన తొలి రాష్ట్రం రాజస్థాన్ కాగా, 1959 నవంబరు 1న, ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే రెండవదిగా, మహబూబ్‌నగర్ జిల్లా, షాద్‌నగర్లో ప్రారంభమైంది. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ, బ్లాకు స్థాయిలో పంచాయతీ సమితి, జిల్లా స్థాయిలో జిల్లాపరిషత్ ఏర్పడింది. 1986లో బ్లాకు స్థాయి వ్యవస్థని మండల పరిషత్‌గా మార్చారు. కేంద్ర ప్రభుత్వ చొరవతో ప్రయోగాత్మక ప్రాతిపదికగా, సమాజ వికాసాభివృద్ధి కార్యక్రమం (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) 1952లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలో బాగా వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యాలు, కుటీర పరిశ్రమలు అనే ఐదు రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. 1953లో ఈ పథకాన్నే జాతీయ విస్తరణ సేవా పథకం (నేషనల్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ స్కీమ్) గా దేశ మంతటా అమలు చేశారు. ఈ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయడానికి బల్వంత రాయ్ మెహతా అధ్యక్షతన నిపుణుల కమిటీ ని 1956లో నియమించారు. ఈకమిటీ తన నివేదికను 1957లో సమర్పించింది. ఈ కమిటీ సిఫారసులే పంచాయతీరాజ్ వ్యవస్థ (ప్రజాస్వామ్య వికేంద్రీకరణ) ఏర్పాటుకు మూలాధారం అయినాయి ఈ కమిటీ 1953, అక్టోబరు 2న ప్రవేశపెట్టిన జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం పథకాలు ఎంతవరకు విజయవంతం అయినాయో సమీక్షించి, గ్రామపరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడానికి అవసరమయ్యేసంస్థాగత ఏర్పాటును సిఫార్సు చేసింది. బల్వంతరాయ్ మెహతా కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రజల భాగస్వామ్యం అనే అంశాలతో 3అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫారసు చేస్తూ, తన నివేదికను 1957, నవంబరు 24న జాతీయాభివృద్ధి మండలికి సమర్పించింది. కమిటీనివేదికను జాతీయాభివృద్ధి మండలి 1958, జనవరిలోఆమోదించింది. ఈ నివేదికలోని అంశాల అమలు వివిధరాష్ట్రాలు పంచాయతీరాజ్ సంస్థఏర్పాటుకు ప్రయత్నించాయి. భారత దేశంలో 1959 అక్టోబరు 2న రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థను లాంచనంగా ప్రారంభించారు. రాజస్థాన్ రాష్ట్రంలో, నాగోర్‌జిల్లాలోని, సికార్‌అనే ప్రాంతంలో ఈ విధానాన్ని ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభిస్తూ చేసిన వ్యాఖ్యానం."నేడు ప్రారంభమవుతున్న స్థానిక స్వపరిపాలనా సంస్థలు భారత ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా పనిచేస్తూ జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ, భవిష్యత్ నాయకత్వానికి పాఠశాలలుగా తోడ్పడ తాయి". మూడు అంచెల విధానాన్ని ప్రారంభించిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. కల్పించడానికి పంచాయతీరాజ్ వ్యవస్థను నెలకొల్పాలి. గ్రామపంచాయతీవ్యవస్థకు ప్రత్యక్ష ఎన్నికలను నిర్వహించాలి. ఈ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన కాకుండా, స్వతంత్ర ప్రాతిపదికపై జరపాలి. స్థానిక సంస్థలకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నియమబద్ధంగా ఎన్నికలుజరపాలి. స్థానిక సంస్థలకు తగిన అధికారాలను, ఆర్థిక వనరులను సమకూర్చాలి. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పథకాలన్నీ స్థానికసంస్థల ద్వారానే నిర్వహించాలి.స్థానిక స్వపరిపాలనలో జిల్లా కలెక్టరు కీలకపాత్ర పోషించాలి. కింది స్థాయి లో మినహాయించి, మాధ్యమిక, ఉన్నత స్థాయుల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించాలి. అధికారాల, పరి పాలనా, వనరుల,ప్రణాళికా, ప్రజాస్వామ్య వికేంద్రీకరణలు జరగాలి. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్లు మంజూరుచేయాలని బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సూచించింది. స్థానిక సమస్యలను స్థానికంగాపరిష్కరించడం,ప్రజలను రాజకీయంగా చైతన్యం చేయడం పంచాయతీ రాజ్‌వ్యవస్థ లక్ష్యం. •

# నయా వలస పాలనతో రంగాలన్నీ కుదేలు

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

ప్రపంచ బ్యాంకు చేపట్టిన నివేదిక ప్రకారం గత 20 సంవత్సరాల కాలంలో ఉన్నత ఆదాయ వర్గాల ఒక శాతం జనాభా ఆదాయాలు 60 శాతం పెరగగా అల్పాదాయ వర్గాల క్రింది భాగాన ఉన్న ఐదుశాతం జనాభా ఆదాయాలు ఒక పైసా కూడా పెరగలేదు.ఈ 20 సంవత్సరాల కాలంలో వివిధ దేశాలలోని పెట్టుబడిదారులు ఆఫ్సోర్సింగ్ చేపట్టి అంటే పరిశ్రమలను, సేవలను ఇతర దేశాలకు తరలించి అక్కడ తక్కువ వేతనాలకు దొరికే కార్మికులను చౌక ధరలకు లభించే ముడిసరుకులను ఉపయోగించి వారు గణనీయంగా తమ ఆదాయాలను పెంపొందించుకోగలిగినారు. ఇది కొన్ని దేశాలకు మాత్రమే పరిమితమైనవి. నేడు ప్రపంచంలో మూడు దేశాల దగ్గర మాత్రమే ఉన్న సంపద మొత్తం బిలియనీర్ల సంపదలో 50 శాతంగా ఉంది. ప్రపంచంలో మొత్తం బిలియనీర్లు 3000 మంది. వీరి సంపద విలువ 16.1 ట్రిలియన్ డాలర్లు. ఎక్కువ మంది బిలియనీర్లు ఉన్న దేశంలో మొదటిది అమెరికా కాగా రెండవది చైనా, మూడవది మన దేశం. ఇలా బిలియనీర్లు కొన్నిదేశాలకే పరిమితంకావడం వలన ప్రపంచ ప్రజల ఆదాయాలు అవకాశాలలో అసమా నతలు పెరిగాయి. పరస్పర ఆధారిత ప్రపంచంలో బిలియ నీర్లు మనస్తత్వంతో లాభాల కోసంపాలకుల దుర్నీతితో ప్రపంచ ఆధిపత్యంకోసం జరుగుతున్న సుంకాల యుద్ధంలో ప్రపంచ ప్రజలు అల్లాడిపోతున్నారు. భారత్ లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాల వలన ప్రపంచమంతా వసుధైక కుటుంబంగా పెట్టుబడులతో ఉద్యోగ కల్పనతో వస్తుఉత్పత్తులతో గణనీయంగా పెరిగి మానవ శ్రేయస్సుతో ప్రపంచ దేశాలన్నీ అభివృద్ధి చెందిపోతాయని ముఖ్యంగావెనుకబడిన దేశాలు అభివృద్ధిలో పెట్టుబడిదారుల దేశాల సరసన సమానంగా అభివృద్ధి చెందుతాయని భావించారు. అయితే ఈవిధానాల వలన వెనుకబడిన దేశాలు అభివృద్ధి చెందిన దేశాల కనుసన్నల్లో తమ ఆర్థికవిధానాలను పెట్టుబడి విధానాలను రూపొందించుకోవాల్సి వస్తుందని ఇది నయా సామ్రాజ్యం వైపు దారితీస్తుందని గమనించ లేకపోయారు. మన పాలకులు అయితే ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు పనిచేయడం లేదనినష్టాలలో ఉన్నాయని ఎల్పిజి విధానాలకు పోయారు. ఇప్పుడు ఏమైంది? ఉత్పత్తి రంగం కుదేలైంది. అనేక వస్తువులు అమెరికా నుంచి చైనానుంచి దిగుమతి చేసుకుంటున్నాం.దేశంలో నిరుద్యోగిత, మానవ వనరులవిధ్వంసం, సహజ వనరులు పెట్టుబడిదారుల వశం, వృద్ధిప్రక్రియ



అంతా పెట్టుబడిదారుల కనసన్నల్లోకిపోయింది. మన దేశం 191దేశాలలో 132వదిగా విద్యావైద్య జీవనప్రమాణాల రీత్యాఉన్నది. 193దేశాలలోఆయుష్ ప్రమాణం రీత్యా మన దేశంస్థానం 134గా ఉన్నది. ఆకలి ఎక్కువగా ఉన్న జనాభా గల దేశాలలో 125దేశాలలో 111వ దేశం మనది. ఎల్పిజి ఫలితాలవలన ఏర్పడిన దుష్పరిమాణం ఇది. తొందరలో మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మన దేశంఅభివృద్ధి చెందుతున్నదని పాలకులు ఎలాచెబుతున్నారో అర్థంకావడం లేదు? ఎల్పిజి ప్రారంభించిన తొలి రోజుల్లో ఇద్దరే ఇద్దరు బిలియనీర్లు ఉన్న దేశంలో నేడు 332బిలియనీర్లు పెరిగినందున దేశం మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థఅవుతున్నదా? ప్రజల ఆదాయాలు గాని ఉద్యోగితను గాని పరిగణనలోకి తీసుకొనే అవసరం లేదా?అంతేకాకుండా నేడుప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం కింద 81.35 కోట్ల మందికి ఐదు కిలోల బియ్యం ఉచితంగా ఇవ్వవలసిన పరిస్థితిఏర్పడింది.పేదలకు ఉద్యోగితను కల్పించకుండా ఆదాయ కల్పన చేయకుండా పాలకులు ఉచిత పథకాలు ప్రవేశపెట్టి పాలనసాగిస్తున్నారు. పేదలజీవనం సాగాలంటే ఉచితాలే గతి అయ్యాయి. ఈవిధంగా దేశ ఆర్థికాభివృద్ధి తిరోగమనంలో ఉన్న కార్పొరేట్ వర్గాలకు చెందిన పైస్థాయి బిలియనీర్ల సంఖ్య ప్రతి ఏడాది దేశంలో పెరుగుతున్నది. వీరి సంపదలోని పెరుగుదల ఏవిధమైన ఉత్పత్తి క్రమం నుంచివచ్చింది కాదు. దేశ సహజ వనరులను దేశ సంపద ప్రభుత్వమే కార్పొరేట ర్లకు తాయిలాలుగా ఇస్తున్నది. దేశంలో బడా కార్పొరేట్ సంస్థల చేతుల్లో దేశంలోని పోర్టులు 25శాతం సిమెంట్ ఉత్పత్తులో 45శాతం స్టీల్ పరిశ్రమల, 33శాతం టెలికాము ల 60శాతం బొగ్గు ఎగుమతులు 65శాతం కేంద్రీకృతమై ఉన్నాయి. దేశం సంపద ప్రైవేట్ గుత్తాధిపత్య సంస్థల చేతుల్లో కేంద్రీకృతం కారాదని ప్రభుత్వం అలా కాకుండా చర్యలు తీసుకోవాలని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు 39వ అధికరణలో స్పష్టంగా పొందుపరిచినారు. వారిసంపద కేంద్రీకృతం అవుతుండడం రాజ్యాంగం ఉల్లంఘనకాదా? ఒకపక్క ద్రవ్యలోటు పేరుతోప్రభుత్వ సంస్థలను కారు చౌకగా అమ్మేస్తున్నారు. మరోపక్క బడాబాబులు బ్యాంకులకు బకాయిపడ్డ లక్షల కోట్ల బకాయిలను మాఫీ చేస్తున్నారు.గత తొమ్మిదేళ్లలో పెద్దలబ్యాంకులలో బకాయి పడిన 14.5 లక్షలకోట్ల రుణాలను మాఫీచేసి కేవలం 15శాతం మాత్రమే వసూలు చేయగలిగినారు. మూడేళ్లలో ప్రభుత్వరంగబ్యాంకు లను 12కి కుదించారు. ప్రజలకు ఉపయోగపడే వ్యవస్థల న్నిటిని చిన్నాభిన్నం చేశారు. ప్రజాస్వామ్య ముసుగులో లాభాలేముఖ్యమై ఆర్థిక సంపాదన కోసం అగ్రరాజ్యాల పాలకులు ప్రజానాయ కులమని చెప్పుకుంటూనే ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాదం వైపు పరుగులు తీస్తున్నారు. గ్లోబలైజేషన్‌వలన ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగిత ఆదాయ అసమానతలు పెరగడం బిలీయనీర్ల సంఖ్య పెరగడం జరిగిందిగాని ప్రజాశ్రేయస్సు శూన్యం. •

## టెన్త్ పరీక్షల్లో సుబ్బయ్య హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ



**సంతనూతలపాడు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలోని బీవీ సుబ్బయ్య హైస్కూల్ విద్యార్థులు ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో విశేష ప్రతిభను కనపరిచారు. టి.అనిల్ కుమార్, కే.బ్రహ్మ చరణ్‌లు 600మార్కులకు గాను 586 మార్కులను సాధించి పాఠశాలలో ప్రథమ స్థానాలను సాధించారు. ఏ.బ్రహ్మారెడ్డి 583 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు. ఇ.పూర్ణ వంశీ 582 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. 63 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారు. పాఠశాల సగటు మార్కు 483.31 శాతాన్ని సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం సాయంత్రం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయా ఉత్తమ విద్యార్థులను ఇందుకు విశేష కృషి చేసిన ఉపాధ్యాయులను బీవీ సుబ్బయ్య హైస్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ బొడ్డు కోటిలింగం, ప్రధానోపాధ్యాయులు వై.వేణుగోపాల్‌రెడ్డి అభినందించారు.

## ఎస్ఎస్‌సి ఫలితాలలో గుంటూరు ఆక్స్ఫర్డ్ స్కూల్ విద్యార్థుల విజయ ప్రభంజనం

**ఒంగోలు టౌన్, ప్రభాతవార్త**



ఎస్ఎస్‌సి ఫలితాలలో స్థానిక అన్నవరప్పాడులోని గుంటూరు ఆక్స్ఫర్డ్ విద్యార్థులు గగనశ్రీ 597, వసంతసిరి 593, కె మనస్విని 591 అత్యధిక మార్కులు సాధించారు. 500కు పైగా మార్కులు 50 మంది విద్యార్థులు సాధించారు. ఈ ఘనవిజయం సాధించిన విద్యార్థిని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు గుంటూరు ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఫ్రాన్సిస్‌రెడ్డి, డైరెక్టర్ విజయ భాస్కర్‌రెడ్డి, జోసఫ్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఇంతటి ఘన విజయానికి కృషిచేసిన ప్రిన్సిపల్ పద్మావతి, ఆర్ఐ వేణుగోపాల్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు అభినందించారు.

## పెంపకందారులకు సూచనలు, సలహాలు

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



జిల్లా పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ బేబి రాణి కొత్తమామిడిపాలెంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆపరేషన్ అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను పెంపకందారులకు వివరించారు. పోషకాహారం ఇవ్వాలని, షెడ్స్ శుభ్రంగా వుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సుధీర్,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాధమిక తరగతుల విలీనం విరమించుకోవాలి - ఎపిటిఎఫ్ డిమాండ్

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

రాష్ట్రంలోని 900 ఉన్నత పాఠశాలల్లో 1,2 తరగతుల విలీనం విరమించుకోవాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటరావు, ఎన్.లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ నెంబర్ 117 రద్దు చేసి ప్రాధమిక పాఠశాలలకు పూర్వ వైభవం తేవాలని కోరుతుంటే అందుకు విరుద్ధంగా ప్రభుత్వ చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. చిన్నారుల భవితవ్యం దృష్టిలో వుంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని సంఘ పక్షాన కోరుతున్నామన్నారు.

## సత్తాచాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 23,ప్రభాతవార్త**



పదవ తరగతి పరీక్షా ఫలితాలలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. అత్యధిక మార్కులు సాధించిన మోక్షజ్ఞ(596), ధనుష్(595), దీక్షిత, సాత్విక్(594), ఐశ్వర్య(593), లక్ష్మీశృతి(592), ప్రణీత్(591), రేవంత్(590)లను ఆర్ఐ అనిల్‌కుమార్, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ జోసెఫ్ తంబి అభినందించారు.

## భారత రాజ్యాంగం-కనీస అవగాహనపై వక్తృత్వ పోటీలు

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక, ఓపిడిఆర్, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జులై మాసంలో భారత రాజ్యాంగం-కనీస అవగాహనపై వక్తృత్వ పోటీలు జరుగును. ఈ క్రమంలో సమాచర హక్కు ప్రచార ఐక్యవేదిక ప్రచురించిన రాజ్యాంగ సభలో అంబేద్కర్ ఉపన్యాసాలు, రాజ్యాంగ పీఠిక పుస్తకాలను పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేశారు. హైస్కూల్, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వేర్వేరుగా వక్తృత్వపోటీలు నిర్వహించి విజేతలకు జాతీయ సమాచార హక్కు కమిషన్ మాజీ కమీషనర్ మాడభూషి శ్రీధర్ చేతుల మీదుగా నగదు బహుమానం, సర్టిఫికేట్స్ ప్రదానం చేస్తారు.

## ప్రపంచ పుస్తక దినోత్సవం

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంధాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి మాట్లాడుతూ పుస్తక పఠనం, ప్రచురణ, కాపీ రైట్స్ ప్రోత్సహించేందుకు, షేక్స్పియర్ వంటి సాహితీ దిగ్గజాలను స్మరించుకునేందుకు ప్రపంచ పుస్తక దినోత్సవం జరుపుకుంటున్నామని, వేసవి శెలవులలో విద్యార్థులు గ్రంధాలయానికి వెళ్లేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపగ్రంథ పాలకులు బొమ్మల కోటేశ్వరి, గ్రంధాలయ సిబ్బందితో పాటు పాఠకులు పాల్గొన్నారు.

## నాణెంపై బాబా బొమ్మ ముద్రించడమా

**- హేతువాద సంఘం ఆగ్రహం**

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

వంద రూపాయల నాణెంపై పుట్టపర్తి సాయిబాబా బొమ్మ ముద్రించడం విడ్డూరంగా వుందని ఎపి హేతువాద సంఘం రాష్ట్ర అధక్షులు నార్నె వెంకట సుబ్బయ్య అన్నారు. స్థానికంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వివాదాస్పద పుట్టపర్తి బాబా శత జయంతి సాకుతో నాణెంపై బొమ్మ ముద్రించడం శోచనీయమని, అజ్ఞానాన్ని ప్రోత్సహించే విధంగా కేంద్రం చర్యలు ఉన్నాయన్నారు. శాస్త్రీయత ప్రబోధించిన త్రిపురనేని రామస్వామి చౌదరి బొమ్మను నాణెం, కరెన్సీ నోట్‌పై ముద్రించిన భావితరాలు విజ్ఞాన వంతులు అవుతారన్నారు.

## హత్య కేసులో వైసీపీ నేతపై అనుమానాలు..!

**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో వైసీపీ నేతపై పోలీసులు పలు కోణాల్లో విచారణ సాగిస్తున్నారు. ఇప్పటికే వ్యాపార లావాదేవీలు ఆర్థిక వ్యవహారాలు భూ లావాదేవీలు రాజకీయ కోణాలలో బృందాలుగా ఏర్పడిన పోలీసులు విచారణ వేగవంతం చేశారు. పోలీసులు అందుతున్న సమాచారం మేరకు.. నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన వైసీపీ నేత రాజాపై తెలుగుదేశం నాయకులు ఎమ్మెల్యే కొంత మంది వారికున్న సమాచారాన్ని గోప్యంగా పోలీసులకు అందిస్తున్నట్లు వినికిడి. దీంతో పోలీసులు రాజాపై ఉన్న కేసులతో పాటు వ్యాపారలావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వైసీపీ నేత పీడీఎఫ్ బియ్యం వ్యాపారిగా మారిన వైనాన్ని ఆయన వెనుక ఉన్న పెద్దలను వారి ఫోన్ కాల్స్ ఆధారంగా గుర్తించే క్రమంలో పోలీసులు నిమగ్నంగా ఉన్నట్టు తెలుస్తుంది.

# ప్రకాశం వార్త



తెలుగు జాతీయ దినపత్రిక

## ఉగ్రవాదుల దాడికి నిరసనగా వైకాపా కొవ్వొత్తుల ర్యాలీ

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**




కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ఒంగోలులో వైకాపా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తు ర్యాలీలో పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దర్శి ఎమ్మెల్యే, డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ప్రకాశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఇంఛార్జి చుండూరు రవి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, పట్టణ అధ్యక్షులు కటారి శంకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# నేరస్తులు భూమిపై ఉండరాదు

- ముఖ్యమంత్రి చంద్రబాబు
- ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబం నా కుటుంబమే
- యువనేతను కోల్పోయాము
- చౌదరి కుటుంబాన్ని ఓదార్చి నివాళులర్పించిన చంద్రబాబు









**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

నేరచరిత్ర కలిగిన వారు భూమిపై ఉండరాదని వారితో ప్రమాదం ఎప్పుడైనా పొంచి ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉద్ఘాటించారు. బుధవారం నాడు నాగులుప్పలపాడు మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో ముప్పవరపు వీరయ్యచౌదరి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి నివాళులర్పించారు. తొలుత చదలవాడ రవిశంకర్ హెలిప్యాడ్ నుండి రోడ్డు మార్గంలో వీరయ్య చౌదరి స్వగ్రామమైన అమ్మనబ్రోలు చేరుకున్నారు. అప్పటికే వేలాది మంది ప్రజలు చౌదరి నివాసంతో పాటు గ్రామమంతా రహదారుల వెంట చంద్రబాబు రాక కోసం ఎదురుచూస్తున్న ప్రజలు ఆయన వస్తున్నట్లు సంకేతం తెలుపగానే ఒక్కసారిగా ముప్పవరపు వీరయ్య చౌదరి అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. చంద్రబాబు నాయుడు చౌదరి సతీమణి సుచరిత కుమారుడు చంద్ర సిద్దార్థను ఓదార్చి ఇక నుండి మీ కుటుంబం నా కుటుంబంతో కలిసి ఉంటుందని భరోసా ఇచ్చారు. నేరస్తులు ఎక్కడ ఉన్నా వెతికి శిక్షింపచేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో నేర ప్రవృత్తి పెరిగిపోయిందని నేరస్తులు ఎంతకైనా భరితెగిస్తున్నారని ఎంతో మంది తెలుగుదేశం కార్యకర్తలను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

**పార్టీలో ముప్పవరపు గుర్తింపుః**

హత్యకు గురైన ముప్పవరపు వీరయ్య చౌదరి తెలుగుదేశం పార్టీలో మంచి గుర్తింపు ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంతో పాటు చీరాల నియోజకవర్గం బాధ్యతలను ఆయనకు అప్పగించడంతో అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఘనత వీరయ్య చౌదరికి దక్కిందన్నారు. పార్టీలో క్రమశిక్షణ కలిగిన యువ నేతగా ఎదుగుతున్న తరుణంలో ఇలా జరగడం బాధాకరమన్నారు. యువగళం పాదయాత్ర వంద రోజులు చేపట్టిన నారా లోకేష్‌కి వెంట ఉండి ఆయన సంకల్పాన్ని నెరవేర్చిన వారిలో వీరయ్య చౌదరి ఒకరన్నారు. అమరావతి రైతుల పాదయాత్రకు మద్దతు పలికిన ఆయన ఏంటో మరోసారి నిరూపించుకున్నారని చౌదరి ఘనత ఆమోఘం అన్నారు.

**మంత్రులు, ఎమ్మెల్యేలు రాకః**

అమ్మనబ్రోలులో నేత వీరయ్య చౌదరి భౌతికకాయానికి సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి అనిత, ఇతర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవి కుమార్, మంత్రి బాల వీరాంజనేయస్వామి, అనగాని సత్యప్రసాద్, చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య, పర్చూరు ఎమ్మెల్యే సాంబ శివరావు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, మారిటైం బోర్డు చైర్మన్ సత్య, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతాపం తెలియజేశారు.

**హత్య చేసిన వారి గురించి ఆచూకి తెలిస్తే సమాచారం ఇవ్వొచ్చుః చంద్రబాబు**

వీరయ్య చౌదరిని హత్య చేసిన వారి గురించి ఆచూకీ తెలిస్తే ఎవరైనా సమాచారం ఇవ్వొచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. వీరయ్య చౌదరిని హత్య చేసిన వాళ్ళ గురించి గోప్యంగా తెలియజేయాలంటే టోల్ ఫ్రీ నెంబరు 9121104784 కు ఫోన్ చేసి చెప్పండన్నారు. మీ వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు.

## పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిని ఖండించిన జనసేన

**ఒంగోలు, ప్రభాతవార్త**




జమ్ముకాశ్మీర్‌లోని బైసరన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 28మందిని హతమార్చడాన్ని జనసేన పార్టీ తీవ్రంగా ఖండించింది. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఒంగోలులో జనసేన పార్టీ పక్షాన మృతులకు సంతాపం తెలియచేస్తూ బస్టాండ్ నుండి అద్దంకి బస్టాండ్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రంలో జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్, రవిశంకర్ గ్రూప్ అధినేత, ప్రకాశం జిల్లా జనసేన నాయకులు కంది రవిశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా షేక్ రియాజ్ మాట్లాడుతూ మృతుల మీద జరిగిన దాడి మనం అందరం భారత్ దేశం మీద జరిగినట్టు మనం భావించాలని ముందుగా మనమందరం భారతీయులం అని, అలానే జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మూడు రోజులు సంతాప దినాలు ప్రకటించారని ఈరోజు కొవ్వొత్తుల ర్యాలీ, రేపు పార్టీ ఆఫీసులో మోన దీక్ష, ఎల్లుండి చర్చి సెంటర్లో మానవహారం నిర్వహిస్తామన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలని జనసేన పార్టీ డిమాండ్ చేస్తుందని అన్నారు. అలానే కంది రవిశంకర్ మాట్లాడుతూ ఈ దాడి భారతమాత మీద జరిగినట్టు మనం భావించాలని ముక్కుపచ్చలారని నవ దంపతులను కూడా చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని, కచ్చితంగా ఎన్డీఏ ప్రభుత్వం ఈ దాడికి దీటైన సమాధానం తప్పకుండా తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్, ప్రకాశం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శులు చనపతి రాంబాబు, కళ్యాణ్ ముత్యాల, రాయని రమేష్, కృష్ణ పెన్నా ప్రాంతీయ కమిటీ సభ్యురాలు బొందిల శ్రీదేవి, ఒంగోలు నగర జనసేన పార్టీ ఉపాధ్యక్షులు పిల్లి రాజేష్, ఒంగోలు నగర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శులు పల్ల ప్రమీల, దండే అనిల్, ఒంగోలు నగర జనసేన పార్టీ కార్యదర్శులు గోవింద్ కోమలి, ఆకుపాటి ఉష, ఉంగరాల వాసు, తోట శబరి, మాల్యాద్రి నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.

## బండ్లమిట్ట ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాలకు ఉత్తమ ఫలితాలు

**ఒంగోలు టౌన్, ప్రభాతవార్త**



పదవ తరగతి పరీక్షాఫలితాలలో ఒంగోలు బండ్లమిట్లలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఒంగోలుకు చెందిన విద్యార్థినులు అత్యధిక మార్కులు సాధించి మండల పరిధిలో మొదటి, రెండవ స్థానాలు సాధించారు. ఈ ఫలితాల్లో కోవూరి అక్షర (591), కౌసరున్నరీసా(590) మార్కులు సాధించారు. ఈ విద్యార్థినిలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.క్రిష్ణకుమారి, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు అభినందించారు.

## రోస్టర్ పాయింట్ల వలన మాదిగలకు తీవ్ర అన్యాయం

**- లోపాలతో కూడిన ఆర్డినెన్స్ సరిచేసి అన్ని వర్గాల ఎస్సీలకు సమన్యాయం చేయాలి**

**- ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్**

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్ మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరు పోగు వెంకటేశ్వరరావు మాదిగ పేర్కొన్నారు. స్థానిక అంబేద్కర్ భవనంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ లోపాలతో కూడిన ఆర్డినెన్స్ సరిచేసి వెళ్లి ఉపకరాలకు ఒకటి, మాదిగలకు ఏడు, మాలలకు ఏడు శాతం రిజర్వేషన్ కల్పించి సమన్యాయం చేసి చట్టం చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కథ చంద్రబాబు పాలనలో ఎస్సీ వర్గీకరణ పై తెచ్చిన ఆర్డినెన్స్ వల్ల మాదిగ ఉప కులాలకు 22,500 ఉద్యోగాలు వచ్చి మేలు జరిగిందని, ఇప్పటి ప్రభుత్వంలో తెచ్చిన ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ వల్ల అన్యాయం జరగబోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏబిసిడి నాలుగు గ్రూపులుగా విభజించడం జరిగిందని, ఇప్పుడు ఈ గ్రూపులో ఉన్న ఆది, ఆంధ్ర మాదిగలను తీసి సి గ్రూపులో కలిపి మాలాల్ని ఎక్కువ జనాభాగా చూపించడం, రోస్టర్ లో 200 పాయింట్లు ఉద్యోగాలకు గాను మొదటి వరుసలో 100 ఉద్యోగాలలో 8 శాతం మాలలకు, ఆరు శాతం మాదిగలకు, ఒక్క శాతం ఉపకులాలకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పటం మాదిగలకు తీరని అన్యాయమే జరుగుతుందని ఆయన ప్రభుత్వాన్ని విమర్శించారు. 2026 జనాభా లెక్కలను తీసుకొని, జిల్లాలను యూనిట్గా తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటన చేయటం వలన మాదిగలలో తీవ్ర ఆందోళన పెరిగిందని పేర్కొన్నారు. మాదిగ కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి చైర్మన్ ను నియమించి, సంక్షేమ రంగాలలో వర్గీకరణ జీవో నెంబర్ 25 లేకుండానే ఉమ్మడిగా సంక్షేమ పథకాల లోన్లు విడుదల చేయటం వల్ల మాదిగ యువతకు తీరని అన్యాయమే జరుగుతుందన్నారు. ఇన్ని లోపాలతో కూడిన ఆర్డినెన్స్ వల్ల మాదిగల నష్టం జరుగుతుంటే చంద్రబాబును లోపాలు సరి చేసి చట్టం చేయమని అడగాల్సిన మందకృష్ణ ఎందుకు మౌనంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణలో లోపాలను సరిచేసి, సమన్యాయం చేసేలా అసెంబ్లీలో చట్టం చేసేంతవరకు పోరాటం ఆపేది లేదని, మాదిగ జాతి హక్కుల సాధనకై ఈనెల 23వ తేదీన ఒంగోలు, 26న నెల్లూరు, 30న కడప, మే 10న రాజమండ్రి, మే 20న విశాఖపట్నం, మే 30న అమరావతిలో మాదిగ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని, అప్పటికి ప్రభుత్వ స్పందించకపోతే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించి, తాడోపేడో తేల్చుకుంటామని వెంకటేశ్వరరావు మాదిగ తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ ఎంఆర్పిఎస్ నాయకులు చెరుకూరి కిరణ్, దొనకొండ మోషే తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ప్రకాశం జిల్లాపై జనసేన ఫోకస్

**- వైసీపీ నుంచి మాజీ మంత్రి అవుట్..?**

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఏపీలో రాజకీయాలు మారుతున్నాయి. కూటమి ఒక వైపు పాలన సాగిస్తూనే, మరో వైపు రాజకీయంగా పట్టు బిగిస్తుంది. కూటమిలో మూడు పార్టీలు ఎవరికి వారుగా బలోపేతం కావాలని చూస్తున్నారు. ముఖ్యంగా జనసేన క్షేత్ర స్థాయిలో పట్టు పెంచుకోవాలని చూస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేయాలన్న ఆలోచనతో ముందుకు సాగుతుంది. అందులో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తులను టార్గెట్ చేస్తుంది. వారిని తమ వైపు తిప్పుకుని జనసేన బలపడటమే కాకుండా వైఎస్సార్‌సీపీని దెబ్బతీయవచ్చుని భావిస్తుంది. అందులో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాపై ఫుల్ ఫోకస్ పెట్టింటి మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ద్వారా ఈ తతంగం అంత నడుపుతుంది. ఓ మాజీ మంత్రి జనసేనలో చేరే అవకాశం ఉందని ప్రచారం నడుస్తుంది. 2024 ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కనీసం ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా రాలేదు. కేవలం 11 స్థానాలకే పరిమితం అయింది. ఈ తరుణంలో పార్టీకి భవిష్యత్తు లేదని భావిస్తున్న చాలా మంది నేతలు ఒక్కొక్కరు చొప్పున బయటకు వెళ్ళిపోతున్నారు. ఉన్నవారు సైతం స్తబ్ధతగా ఉండిపోయారు. ఒక ఎన్నికల్లో చాలా ప్రయోగాలు చేశారు జగన్‌మోహన్‌రెడ్డి. అప్పట్లో చాలా మంది సీనియర్ నేతలను పక్కన పెట్టారు. ఫలితాల తరువాత ఆ నేతలు పార్టీలో ఉన్నామా లేమా అన్న రీతిలో ఉన్నారు. అటువంటి వారంతా ప్రస్తుతం జనసేన వైపు చూస్తున్నారు. జనంలోనే కొద్దిపాటి క్రేజీ ఉన్న నేతలను తీసుకోవాలని జనసేన భావిస్తుంది. అందులో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మాజీ మంత్రి మహీధర్‌రెడ్డిని పార్టీలో చేర్చుకోవాలని భావిస్తుంది. ఇప్పటికే ఈ విషయంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మానుగుంట మహీధర్‌రెడ్డి ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే సీనియర్ లీడరు. 1989లో తాను రాజకీయ ప్రస్తానాన్ని ప్రారంభించారు. 2019 వరకు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా కందుకూరు నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2024లో మాత్రం ఆయనకు టిక్కెట్ ఇవ్వలేదు. దీంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న మహీధర్‌రెడ్డి వైఎస్సార్ సీపీని వీడటం మేలని ఒక నిర్ణయానికి వచ్చారు. జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డితో జరిగిన చర్చలు ఫలప్రదమైనట్లు సమా చారం. ఆయన త్వరలోనే జనసేనలో చేరడం ఖాయమని ప్రచారం జరుగుతుంది. వచ్చే ఎన్నికల్లో నాటికి నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. అదే జరిగితే జనసేనకు లభించే సీట్లు కూడా పెరుగు తాయి. అటు పవన్ సైతం అన్ని జిల్లాల్లో జనసేన ప్రాతినిద్యం కోరుకుంటున్నారు. రాజకీయంగా చైతన్యవంతమైన జిల్లాగా పేరు పొందిన ప్రకాశం జిల్లాలో కీలక నేతలు ఉండాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగానే మహీధర్‌రెడ్డిని చేర్చుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. మరో వైపు చీరాల మాజీ ఎమ్మెల్యే కృష్ణమోహన్ సైతం జనసేనలో చేరే అకవాశం ఉంది. మొత్తానికి అయితే ఉమ్మడి ప్రకాశం జిల్లాపై జనసేన ఫుల్ ఫోకస్ పెట్టిందని తెలుస్తోంది.

## మండల స్థాయిలో 82.3 శాతం ఫలితాలు సాధించిన విద్యార్థులు

### - ఎంఈఓ గిరిధర్ శర్మ



**రాచర్ల, ఏప్రిల్ 23 ప్రభాతవార్త**

గత మార్చి నెలలో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో తమ మండలం నుండి పరీక్షలు రాసిన విద్యార్థులు మండల స్థాయిలో 82.3శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాశాఖ అధికారి గిరిధర్ శర్మ అన్నారు. మండల స్థాయిలో 423మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 348మంది ఉత్తీర్ణులయ్యారని, ఈ లెక్కన 82.3ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. ఆకవీడు, చోళ్ళవీడు పాఠశాలల విద్యార్థులు నూటికి నూరుశాతం ఫలితాలు సాధించారని, జేపిచెరువు పాఠశాలలో విద్యార్థులు 97శాతం, రాచర్ల పాఠశాల విద్యార్థులు 67శాతం, అనుములవీడు పాఠశాల విద్యార్థులు 65శాతం, ఎడవల్లి పాఠశాల విద్యార్థులు 90శాతం, ఒద్దులవాగు పల్లె ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు 53శాతం, ఆదర్శ పాఠశాల విద్యార్థులు 84శాతం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినీలు 60శాతం, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులపాఠశాల విద్యార్థినీలు 84శాతం, స్పందన ప్రైవేటు ఉన్నత పాఠశాల విద్యార్థులు 87శాతం, విద్వాన్ ప్రైవేటు ఉన్నత పాఠశాల విద్యార్థులు 75శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. మండల స్థాయిలో దాదాపు ఉత్తీర్ణత శాతం బాగానే ఉందని, ఫలితాలు బాగా సాధించారని, ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మండల స్థాయిలో 75మంది విద్యార్థులు పరీక్షలో తప్పారని, వారి గురించి ఉపాధ్యాయుల ప్రత్యేక దృష్టిసారించి పరీక్షలకు వారిని సిద్ధమయ్యే విధంగా చూడాలని ఆయన అన్నారు. మంచి ఫలితాలు సాధించిన పాఠశాలల యాజమాన్యాలను, విద్యార్థులను ఆయన అభినందించారు.

## పదిపరీక్షల్లో మండల టాపర్‌గా లక్ష్మీప్రియకు అభినందనలు

### - ఎంఈఓ గిరిధర్ శర్మ



**రాచర్ల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

పది పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి మంచి మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థినీ బి లక్ష్మీప్రియకు మండల విద్యాశాఖ అధికారి వి గిరిధర్ శర్మ శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఆకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న లక్ష్మీప్రియ గత మార్చిలో 10వ తరగతి పరీక్షలు రాసింది. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో ఆ విద్యార్థినీ 593/600మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థిని లక్ష్మీప్రియ మంచి ఫలితాలు సాధించి రాచర్ల మండల పేరును జిల్లా స్థాయిలో వినిపించేలా చేసిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఇంత గొప్ప ఘనత సాధించడం హర్షించదగ్గ విషయం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినప్పటికీ లక్ష్మీప్రియ ఫలితం ప్రభుత్వ పాఠశాలల విద్యా విధానాన్ని తెలియజేసిందన్నారు. అదేవిధంగా స్పందన ఉన్నత పాఠశాలలో జివి లయ అనే విద్యార్థిని 586మార్కులు, కె ధరణి అనే విద్యార్థినీ 578మార్కులు, షేక్ మహమ్మద్ ఆరీఫ్ అనేవిద్యార్థి 578మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారని, వారితోపాటు ప్రతి పాఠశాలలో ఫలితాలు సాధించిన విద్యార్థులు అందరినీ ఆయన అభినందించారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుత సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని అన్నారు.

## బంగారు బాల్యంతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

### - నోడల్ అధికారి గిరిధర్ శర్మ



**రాచర్ల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

బంగారు బాల్యం కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేద్దామని బంగారు బాల్యం జిల్లా నోడల్‌అధికారి వి.గిరిధర్ శర్మ అన్నారు. గత మంగళవారం ఈ కార్యక్రమంపై ఆయన సంబంధిత అధికారులకు సమావేశం నిర్వహించి ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. అందులో భాగంగా బుధవారం మహిళా పోలీస్ ప్రమీల, రాచర్ల, పేట ఎంపిపిఎస్, ఏబిఎం, ఎంపిపిఎస్ పాఠశాలలోని 26మంది విద్యార్థుల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారందరూ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా పిల్లలందరితో కలిసి స్నేహపూర్వకంగా ప్రేమపూర్వకంగా వారి వివరాలు, వారి స్థితిగతులు అన్నీ తెలుసుకొని వారికి అర్థమయ్యే రీతిలో నచ్చజెప్పి పాఠశాలకు వచ్చే విధంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి వారుగా ప్రతిఒక్కరు చిత్తశుద్ధితో కృషిచేస్తే ఈ కార్యక్రమం నూరు శాతం విజయవంతం అవుతుందని ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని అన్నారు. ప్రస్తుతం బంగారు బాల్యం ఫలితాలు ఆశించిన స్థాయిలో వెలువడుతున్నాయని గట్టిగా కృషిచేసి పూర్తి స్థాయిలో ఫలితాలు రాబట్టేందుకు ప్రయత్నిద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు బిఎల్ రామానాయక్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనసేన ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



**రాచర్ల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన రాచర్ల బస్టాండ్‌లో జనసేనపార్టీ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ను ప్రారంభించారు. గిద్దలూరు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బెల్లంకొండ సాయిబాబా ఆదేశాల మేరకుమండల జనసేన యువ నాయకులు ఉలాపు శంకర్‌నాయుడు ఆధ్వర్యంలో సీనియర్ జనసేన సభ్యులు ఏలెం పుల్లారావు చలివేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జనసైనికులు మాట్లాడుతూ వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటుచేశామని ఈ వేసవిలో చలివేంద్రం ప్రజలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జనసేన సభ్యులు ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటారని, ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అలిశెట్టి వెంకటేశ్వర్లు, చెల్లా రమణ, చిన్న విజయ్, తిరుమల శెట్టి, చాంద్ బాషు, రవితేజ, వెంకటేష్, పుల్లయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ పాఠశాలలో 10 వ తరగతి విద్యార్థుల ఉత్తమ ఫలితాలు

**దొనకొండ,ఏప్రిల్ 23,ప్రభాతవార్త**

పదవ తరగతి ఫలితాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఉత్తమ ఫలితాలు దొనకొండ మండలంలోని గంగదేవిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాలలో విద్యార్థుల ప్రభంజనం. పల్లె రాజు మల్లేశ్వరి s/o మల్లికార్జున్ రెడ్డి.600569 సాధించగాకాపూరి అభిజిత్ రాజు s/o కోటేశ్వరరావు 600/558శకోక్ s/o శివారెడ్డి 600/550500 మార్కులు పైన సాధించిన విద్యార్థులు 9 మంది ఉన్నారు

## వివేకానంద నెక్స్ట్ జనరేషన్ విద్యార్థులకు అభినందన



**మార్కాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

బుధవారం విడుదలైన పదో తరగతి పరీక్షల్లో స్థానిక వివేకానంద నెక్స్ట్ జనరేషన్ పాఠశాల విద్యార్థులు కుమారి పి.తేజస్విత 595/600సాధించింది.కామేపల్లిఅమృతచౌదరి 591/600 మార్కులు సాధించింది.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, మార్కాపురం రోటరీ క్లబ్ సభ్యులు వేమూరి కృష్ణమూర్తి విద్యార్థులను అభినందించారు. మొదటి, ద్వితీయ స్థానాలుసాధించిన వారికి దీక్షవరిలను బహుమతి ప్రధానం చేశారు. ఈ సమావేశంలో అధ్యక్షులు ఎం.కోటేశ్వరరావు, కోశాధికారి జి.శ్రీనివాసరావు, మాజీ అసిస్టెంట్ గవర్నర్ ఆంజనేయులు, ఎలక్ట్ అసిస్టెంట్ గవర్నర్ అంకమ్మచౌదరి, ఖాజా హుస్సేన్, జి.రవి కుమార్, ఎం.అంకయ్య, కే.భాస్కరావు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షల్లో గంగవరం హనుమంతరావు హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ






**సంతనూతలపాడు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

పదో తరగతి పరీక్షల్లో సంతనూతలపాడు మండలం గంగవరం హనుమంతరావు హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభను కనపరిచారు. పాఠశాలలో 40 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎం.ప్రసన్నలక్ష్మి 600 మార్కులకు గాను 592 మార్కులను సాధించి మండలంలో మొదటిస్థానంలో నిలిచారు. ఎన్ని చంద్రలేఖ 589 మార్కులను, ఎం.త్రివేణి 581 మార్కులను, పి.కార్తీక్ 580 మార్కులను సాధించారు. ఆయా విద్యార్థులను పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ బొడ్డు హనుమంతరావు, హెచ్‌ఎం వై.నరేంద్రలను అభినందించారు. ఆయా ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ప్రశంసించారు.

## సేవా సంకల్ప ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు 48వ వారం అన్నదాన కార్యక్రమం



**సంతనూతలపాడు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం నాడు 48వ వారం అన్నదాన వేడుకలను పేద వర్గాలకు నిర్వహించారు. సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు లక్ష్మణ్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగాఈ అన్నదాన వేడుకలను నిర్వహించారు. సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ఎన్నారై పాతూరి సంపత్, ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ పర్యవేక్షణలో విదేశాల నుండి సహకారంతో సేవలు అన్నదాన వేడుకలను గత 48 వారాల నుండి నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, సభ్యులు వేమా కవిత, శిఖాకొల్లి ధనలక్ష్మి, శీలం మల్లారెడ్డి, కొప్పోలు శ్రీనివాసరావు, రాంకూరి జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శాంతియుత ర్యాలీ



**సింగరాయకొండ, ఏప్రిల్ 23,ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వక్ఫు సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని వెంటనే రద్దు చేయాలని పలువురు ముస్లిం పెద్దలు డిమాండ్ చేశారు. బుధవారం ముస్లిం మైనారిటీ సంఘాలు ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల వద్ద నుండి కందుకూరు రోడ్ సెంటర్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం 2025ను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు దేశంలో బీజేపీ సర్కార్ ముస్లింలపై కక్ష సాధింపు చర్యలు చేపడుతుందని, అందులో భాగంగా బిల్లులు తీసుకువచ్చారని ఆరోపించారు.దేశంలోని ముస్లింల ఆస్తులు పరిరక్షణకు, సామాజిక సంక్షేమానికి వక్ఫ్ బోర్డు ఎంతో కీలకమని, దాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను తక్షణమే విరమించాలని డిమాండ్ చేశారు. మైనారిటీ సంఘాలు,ప్రజ సంఘాలు, ప్రజలు పాల్గొన్నారు.

## టెన్త్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ చాటిన శ్రీ విద్యానికేతన్ విద్యార్థులు





**సింగరాయకొండ, ఏప్రిల్ 23,ప్రభాతవార్త**

పట్టణంలోని మూలగుంటపాడు శ్రీ విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటారు.మండల స్థాయిలో మొదటి స్థానం తూపిరి వైష్ణవి 595 మార్కులు,ద్వితీయ స్థానం పి. రేవంత్ రెడ్డి 594 లు మార్కులు తో సత్తాచాటారు.మండల స్థాయిలో మార్కులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ సైకం వెంకటేశ్వరరావు అభినందించారు.ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ సైకం శ్రీవిద్య, ఉపాధ్యాయ, ఉపాధ్యాయనిలు అభినందించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యను, నైతిక విలువలతో కూడిన విద్యను అందించడమే విద్యానికేతన్ స్కూల్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు ఎంఈఓ కత్తి శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పదవ తరగతి ఫలితాల్లో 'బాలాజీహైస్కూల్' విజయదుందుభి

### - మండలంలో అగ్రశ్రేణి మార్కుల సాధన - 99 శాతం ఉత్తీర్ణత

### - విజయోత్సవాలు జరుపుకున్న విద్యార్థులు,ఉపాధ్యాయులు









**సంతమాగులూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పదవతరగతి ఫలితాల్లో మండల కేంద్రమైన సంతమాగులూరులోని బాలాజీహైస్కూల్ విజయ దుందుబి మోగించింది. మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల విద్యార్థులెవ్వరూ బాలాజీ స్కూల్ విద్యార్థ స్థాయి ఫలితాలు సాదించలేకపోయారు. బాలాజీ హైస్కూల్ నుండి పదవ తరగతి పరీక్షలకు 181 మంది విద్యార్థులు హాజరవగా వీరిలో 179 మంది ఉత్తీర్ణత సాదించారు. వారిలో పాతమాగులూరు గ్రామానికి చెందిన శీలం హైమావతి 586/600చ సాదించగా పత్తేపురం గ్రామానికి చెందిన కంచుమర్తి సిరి అమూల్య 586/600 కాగా , పల్నాడు జిలా రొంపిచర్ల మండలం అన్నవరప్పాడు గ్రామానికి చెందిన శనగల వాసవి 584/600 కొమ్మాలపాడు గ్రామానికి చెందిన షేక్ జాన్ నస్రీన్ 584/600 మార్కులు సాదించారు. మూడవ స్థానంలో ముగ్గురు విద్యార్థులు 582/600, ఇద్దరు విద్యార్థులు 581/600, ఒక్క విద్యార్థికి 580 /600, సాదించగా 550/600 మార్కులకు పైగా మార్కులు సాదించిన వారు 49మంది 500/600 మార్కులకు పైగా సాదించిన విద్యార్థులు 102 మంది విద్యార్థులు మార్కులు సాదించి పాఠశాల స్థాయిన మండలంలో అగ్రశ్రేణిలో నిలిపారని పాఠశాల డైరెక్టర షేక్ కరిమూన్ తెలిపారు.



**విజయోత్సవాలు జరుపుకున్న విద్యార్థులు,ఉపాధ్యాయులు**

పదవతరగతి ఫలితాల్లో సంతమాగులూరు మండలంలో అగ్రస్థానంలో నిలచిన బాలాజీ హైస్కూల్ బుధవారం విజయోత్స వాలతో తుల తూగింది. ఫలితాలు తెలుసుకునేందుకు పాఠశాల వద్దకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు,యాజమాన్యం అందరూ కలసి చరిత్ర సృష్టించిన ఫలితాలతో ఆనంద డోలికల్లో తేలిపాయారు. పాఠశాల కరస్పాండెంట్ కొండారెడ్డి అంజిరెడ్డి, డైరెక్టర్ షేక్ కరిమూన్ లు విజయం సాదించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచుకుని మతాబులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.

## పదవతరగతి ఫలితాల్లో బాలభారతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్

**సంతమాగులూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

పదవతరగతి ఫలితాల్లో సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం పంచాయితీ పరిధిలోని మన బాలబారతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు తమ పట్టు నిల్పుకున్నారు. ఈ పాఠశాల నుండి పదవతరగతి పరీక్షలకు 58 మంది రాయగా 98 శాతం విద్యార్థులు ఉత్తర్ణులయ్యారు. వీరిలో కె.కుసుమాంజలి 584/600 సాదించగా బి.జాహ్నవి 581/600, ఎం.అభిరాం 577/600 మార్కులు సాదించగా 500 మార్కులకు పైగా 23 మంది విద్యార్థులు మార్కులు సాదించి పాఠశాల పదవతరగతి ఉత్తీర్ణతలో తమ పట్టు నిలుపుకున్నారు. ఉత్తమ మార్కులు సాదించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను పాఠశాల అకడమిక్ డైరెక్టర్ ఒంటెద్దు అంజిరెడ్డి, కరస్పాండెంట్ ముప్పాళ్ళ వెంకటేవ్వర్లు,(మిన్నుకల్లు ఎస్సై మాస్టారు), పాఠశాల నిర్వహణ బాద్యులు దుగ్గెంపూడి పవన్ కుమార్‌లు అబినందనలు తెలిపారు.

## పోషణ్ పక్వాడాతో ఆరోగ్యకర సమాజ నిర్మాణం - ఇన్‌చార్జి సీడీపీఓ సుష్మారాణి

### - ఘనంగా కార్యక్రమం ముగింపు వేడుక - గర్భవతులకు సామూహిక శ్రీమంతాలు



**సంతమాగులూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రాల ద్వారా చేపట్టిన పోషన్ పక్వాడా కార్యక్రమంలో సంపూర్ణ ఆరోగ్యకర సమాజ నిర్మాణం జరుగుతుందని ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్ట్ ఇన్‌చార్జి సీడీపీఓ సుష్మారాణి తెలిపారు. సంతమాగులూరు ప్రాజెక్ట్ కార్యాయలంలో ఇన్‌చార్జి సీడీపీఓ సుష్మారాణి అధ్యక్షతన పోషన్ పక్వాడా ముగింపు వేడుక జరిగింది. ఈ సందర్భంగా పోషన్ పక్వాడా ప్రాముఖ్యత గురించి వక్తలు వివరించారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో క్షేత్రస్థాయి నుండి అంగన్‌వాడీ కే ంద్రాలదే కీలక భూమిక అని కొనియాడారు. మాతా శిశు మరణాల నివారణ, బాల్య వివాహల నివారణ పౌష్టికాహారంపై , బాల్యవివాహల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం నిరోధించడంలో అంగన్వాడీల పాత్ర వెలకట్టలేని అమూత్యమని సంతమాగులూరు మండల వ్యవసాయ మార్కెట్ కమిటి అద్యక్షులు తేలప్రోలు రమేష్ అన్నారు. మండల టీడీపీ నాయకులు చేవూరి వాసురెడ్డి మాట్లాడుతూ రాజకీయాల కతీతంగా అంగన్వాడీల ను చూడాలి వారి సేవలను మరింత మెరుగు పరచాలిన రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రి ఆకాంక్షించారన్నారు. ప్రాజెక్ట్ పరిధిలో ఎక్కడా రాజకీయ విభేదాలతో కార్యకర్తలను, ఆయాలను ఇబ్బంది పెట్టవద్దని రవికుమార్ తమను ఆదేశించారన్నారు. సమాజ హతం .సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా సేవలందించే అంగన్వాడీ కేంద్రాలు మరింత మెరుగైన సేవలు అందించేలా అంకిత భావంతో పనిచేయాలని వాసురెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్ ను అధికారులు , ప్రజా ప్రతినిదులు సందర్శించి రుచి చూసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణీ స్త్రీలను సామూహిత సీమంతాలు జరిపారు. ఈ కార్యక్రమంలో సంతమాగులూరు సర్పంచ్ పుచ్చకాయల నాగేశ్వరరావు అట్లా పెద్ద వెంకటరెడ్డి, బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ తెలుగు మహిళా అద్యక్షురాలు నాగబోతు సుజాత, మండల విద్యాశాఖ అధికారి దినేష్ కుమార్, ప్రాదమిక వైద్యశాల వైద్యాధికారి జ్యోత్స్న, వెలుగు ఏపీఎం హనుమంతరావు, ఐసీడీఎస్ సూప్ వైజర్లు మీరాబి, ప్రమీల, సలోమి, విజయనిర్మల, కార్యాలయ సిబ్బంది ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు,ఆయాలు పాల్గొన్నారు.

## ప్రమాదానికి గురైన మద్యం తరలించే వాహనం



**కొనకనమిట్ల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

పొదిలి మండలం సలకనూతల గ్రామం వద్ద మార్కాపురం నుంచి దర్శికి మద్యం లోడ్‌తో వెళ్తున్న వాహనం బుధవారం రాత్రి ప్రమాదానికి గురై రోడ్డుపై బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవ్వరికి ప్రాణహాని జరగలేదు. మద్యం బాటిళ్ల రోడ్డు మీద చిందరవందరగా పడటంతో మద్యం ప్రియులకు ఆశ కలిగింది. మద్యం సీసాల కోసం ఎగబడ్డారు. వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సంఘటన విషయంపై సంబంధిత అధికారులకు సమాచారం తెలిపారు.

## అనుములపల్లిలో మాజీ ఎమ్మెల్యే అన్నా



**రాచర్ల, ఏప్రిల్ 23 ప్రభాతవార్త**

గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అన్నా వెంకట రాంబాబు బుధవారం మండలంలోని అనుములపల్లెలో ప్రత్యక్షమయ్యారు. ఒక కార్యక్రమంపై వెళ్ళి వస్తూ అనుకోని విధంగా అనుములపల్లి జంక్షన్‌లో కొద్దిసేపు ఆగి స్థానిక వైసిపి నాయకులతో కలిసి కొద్ది సమయం చర్చించుకున్నారు. టీటైమ్ అనంతరం స్థానిక సమస్యలు, రాజకీయ పరిణామాలు వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో అనుములపల్లి సర్పంచ్ శిరిగిరి రమేష్, వైసిపి శ్రేణులు యేలెం గోవిందయ్య, దూదిపల్లి నరసింహులు, శిరిగిరి బాలయ్య, శిరిగిరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## శింగరకొండ ఆలయానికి లక్ష విరాళం



**అద్దంకి , ఏప్రిల్ 23,ప్రభాతవార్త**

జె.పంగులూరు మండలం కశ్యాపురం వాస్తవ్యులు కీర్తిశేషులు చల్లగుండ్ల రాఘవయ్య చౌదరి వారి జ్ఞాపార్థం వారి భార్య విజయ్‌కుమారి మరియు వీరి కుమారులు నరేంద్రకుమార్, కిషోర్ కుమార్‌లు శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారికి రాతి ముఖ మండపం నిర్మాణమునకు రు.1,01,116లు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎసి ఎం. తిమ్మనాయుడు, తదిరులు వున్నారు.

**రాతి ముఖమండపం నిర్మాణమునకు లక్ష విరాళం**



విజయవాడ వాస్తవ్యులు మాలంపాటి రామకృష్ణ వారి ధర్మపత్ని సీతాలక్ష్మి, శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారికి రాతి ముఖమండపం నిర్మాణమునకు రు.1,01,116లు విరాళంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎసి ఎం.తిమ్మనాయుడు, తదిరులు వున్నారు.

## టుబాకో సమస్యపై ఈడిని కలిసిన వైసిపి నేతలు



**అద్దంకి , ఏప్రిల్ 23 ,ప్రభాతవార్త**

రాష్ట్రంలో పొగాకు రైతులు ఎదుర్కొంటున్న వంటి సమస్యలపై రైతులతో కలిసి గుంటూరు పట్టణంలోని టొబాకో బోర్డ్ కార్యాలయం నందు మాజీ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ మేరుగ నాగార్జున ఈడికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు మారెడ్డి సుబ్బారెడ్డి, బాపట్ల జిల్లా వైఎస్ఆర్ సిపి రైతు విభాగం అధ్యక్షులు ఈదా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## వర్జీనియా బర్లీ అనే తేడా లేకుండా పొగాకు పంటను కొనుగోలు చేయాలి

### - రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కెవి ప్రసాద్



**కొరిశపాడు , ఎఫ్రిల్ 23, ప్రభాతవార్త**

వర్జినీయా వైట్ బర్లీ ,బ్లాక్ బర్లీ అనే తేడాలు లేకుండా రైతులు పండించిన పొగాకు పంటలను కొనుగోలు చేసి రైతులు నష్టపోకుండా చేయాలని పొగాకు బోర్డు అధికారులను వ్యాపారస్తులను రాష్ట్ర రైతు ప్రధాన కార్యదర్శి కెవి ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం మేదరమెట్లలోని సంజీవని రెసిడెన్సీ నందు రైతు సంఘం నాయకులతో కలిసి పొగాకు ధరల సమస్యలపై ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరముల నుంచి రైతులు పండించిన పొగాకు ధరలు మంచి ధర పలికి అశాజనకంగా ఉండటంతో రైతులు ఈ సంవత్సరం పొగాకును ఎక్కువగా సాగు చేశారన్నారు. అధికారులు గత సంవత్సరం 142 మిలియన్ కేజిలకు ఇండెంట్ ఇవ్వగా 25 మిలియన్ కేజిలు దిగుబడి వచ్చిందన్నారు. ఈ సంవత్సరం పొగాకు పంట వద్దు అంటూనే గత సంవత్సరం కంటే ఎక్కువగా 167 కేజీలకు అనుమతులు ఇవ్వటం పొగాకు బోర్డు వారి ద్వంద ప్రమాణాలకు నిదర్శనం అన్నారు. రైతులు పండించిన పంటలలో ఒక్క మొక్కజొన్న పంటకు మాత్రమే ధరలు ఆశాజనకంగా వున్నాయన్నారు. టొబాకో సమస్యపై ఈనెల 30వ తేదిన ఎంపిలను, ఎంఎల్ఏలను కలిసి రైతుల సమస్యలను తెలియజేస్తామన్నారు. ఈసమావేశంలో కెవి ప్రసాద్ తోపాటు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు హనుమారెడ్డి, చెరుకూరి వాసు, తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటిన చిన్నారులు





**కురిచేడు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

బుధవారం నాడు వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కురిచేడు విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించి తమ సత్తాను చాటారు. మొత్తం ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు కలిపి 15 పాఠశాలలు ఉండగా వాటి నుండి 574 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అందులో 443 మంది ఉత్తీర్ణులై 77.18 శాతాన్ని చాటారు. వీరిలో కురిచేడులో గల సెయింట్ జోసఫ్ పాఠశాలకు చెందిన విద్యార్థి వెలితుర్ల కార్తీక్ రెడ్డి 594 మార్కులు సాధించి ప్రథమ సాథనంలో నిలవగా,ఎన్నెస్పీ అగ్రహారంలో గల తిరుమల హైస్కూల్ విద్యార్థి వంగవీటి పవన్ 584 మార్కులతో ద్వితీయ స్థానాన్ని సాధించారు. వీరిని ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు మనోజ్, కేవీ రత్నాచారి, సురేష్‌బాబులు అభినందించారు.



## మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి నాగరాజు

### - అభినందించిన ఎంఈఓ గుర్రం పెద్దిరాజు, పాఠశాల సిబ్బంది





**హనుమంతునిపాడు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

మండల పరిధిలోని మహమ్మదాపురం జడ్పీ హైస్కూల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాతం శ్రీనివాసరావు అధ్యక్షతన విద్యార్థినీ, విద్యార్థులకు కౌట్స్ యండ్ గైడ్స్ విభాగాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి గుర్రం పెద్దిరాజు పాల్గొని బుధవారం విడుదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్త ఫలితాల్లో 582 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థి పీవీ నాగరాజుని, 577 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచిన ఎం.చరితారెడ్డిని ,అలాగే 571 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచిన ఎస్.వీరశంకర్‌ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే బూచేపల్లి



**తాళ్లూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

మండలంలోని తురకపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త యాతం సుబ్బారెడ్డి ఇటీవల గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి హాస్పిటల్లో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు తూము వెంకట సుబ్బారెడ్డి, నాయకులు కుమ్మిత జయరామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతిలో మెరుగైన ఫలితాలు



**వెలిగండ్ల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

బుధవారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాలలో మండలానికి చెందిన పలువురు విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించడంలో తమ సత్తా చాటారు. మండలంలోని కేఎన్‌పురం గ్రామంలో గల కేవీఎన్ అండ్ ఎల్ పాఠశాలకు చెందిన సుంకరశెట్టి సృజన్ 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించి మండలంలో టాపర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, సుంకరశెట్టి సృజన్‌ను అభినందించారు.

## ఘనంగా కొనకనమిట్ల, ఏప పాఠశాల వార్షికోత్సవం



**కొనకనమిట్ల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

మండల కేంద్రం కొనకనమిట్ల ఏప ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవం బుధవారం ప్రధానోపాధ్యాయులు గాయం కాశిరెడ్డి, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా హెచ్‌ఎం కాశిరెడ్డి మాట్లాడుతూ సెలవుల్లో ఈతకు వెళ్లకుండా ఎండలకు బయట తిరగకుండా పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఇళ్ల వద్ద పిల్లలను చదివించాలని వివిధ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌జీకే మస్తాన్,రహిమ్, ఎస్ఎంసీ చైర్మన్ రూతు, సీఆర్పీలు కిరణ్, సురేష్, చెన్నయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విజయకేతనం





**బల్లికురవ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
పదో తరగతి పరీక్ష ఫలితాలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు విశేష ప్రతిభ కనపరిచి కార్పొరేట్ పాఠశాలల కంటే ఫలితాలు ధీటైన ఫలితాలను సాధించారు. మండలంలోని వి.కొప్పెరపాడు పాఠశాలకు చెందిన నాగసాయి చరణ్ తేజ 590 మార్కులు, అదే పాఠశాలకు చెందిన హేమ స్రవంతి 586 మార్కులు, వైదన పాఠశాలకు చెందిన గంజి శేష సంజన ప్రియ 583 మార్కులు సాధించి మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సొంతం చేసుకున్నారు. మండలంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సాధించిన ఉత్తీర్ణత శాతాలు ఈ విధంగా ఉన్నాయి. బల్లికురవలో 64 మంది విద్యార్థులు హాజరుకాగా 47 మంది ఉత్తీర్ణత సాధించి 73 శాతం, కొమ్మినేనివారిపాలెంలో 24 మంది హాజరు కాగా 23 మంది ఉత్తీర్ణత సాధించి 96 శాతం, కొనిదెనల 48 మంది హాజరు కాగా 35 మంది ఉత్తీర్ణులై 73శాతం, కొప్పెరపాడులో 67 మంది హాజరు కాగా 62 మంది ఉత్తీర్ణలై 93శాతం, అంబడిపూడిలో 34 మంది హాజరు కాగా 29 మంది ఉత్తీర్ణులై 85 శాతం, ఉప్పుమాగులూరులో 53 మంది హాజరుకాగా 54 మంది ఉత్తీర్ణులై 98శాతం, కూకట్లపల్లిలో 23 మంది హాజరు కాగా 19 మంది ఉత్తీర్ణులై 83శాతం, కస్తూరిభా గాంధీ గురుకుల పాఠశాలలో 34 మంది హాజరు కాగా 32 మంది ఉత్తీర్ణులై 94 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ స్థానం పొందిన నాగసాయి చరణ్ తేజను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు వస్త్రాం నాయక్, రమేష్‌బాబులు అభినందించారు.



## స్థలం విషయమై ఘర్షణ.. ఇరు వర్గాలపై కేసు నమోదు

**బల్లికురవ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
మండలంలోని రామాంజనేయపురం గ్రామంలో స్థలం విషయమై ఇరు వర్గాల వారు ఘర్షణ పడటం, పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇరు వర్గాలకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. కుటుంబ పరమైన వివాదాలతో పాటు, స్థలం విషయంలో చెలరేగిన గొడవలు దాడి చేసుకునే వరకు వెళ్లాయి. ఈ దాడుల్లో ఒక వర్గానికి చెందిన గోరంట్ల వెంకటాద్రి, లింగారావు, వెంకటాద్రి భార్య గాయపడగా, మరో వర్గానికి చెందిన అంకశాల అశోక్, కమతం కొండయ్య, శ్రీనులు గాయపడ్డారు. వైద్య చికిత్స నిమిత్తం క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలియజేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి



**హనుమంతునిపాడు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
హనుమంతునిపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గంట పెద్దిరెడ్డి కుమార్తె యక్కంటి శ్రీనివాసులురెడ్డి(లేట్) కుమారుడు నారాయణరెడ్డి వివాహ వేడుకలలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, మురహరి నరసయ్య, కత్తి తిరుపాలు, చీకటి వెంకట సుబ్బయ్య, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకుపాలెం గ్రామంలో పశువుల నీటి తొట్టెను ప్రారంభించిన ఏపీడీ భాస్కరరావు



**పొన్నలూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
మండలంలోని వెంకుపాలెం గ్రామంలో బుధవారం టీడీపీ మండల ఉపాధ్యక్షుడు తానికొండ మహేంద్ర అధ్యక్షతన పశువుల నీటి తొట్టెను ప్రారంభించారు. దీనిలో భాగంగా ఏపీడీ భాస్కరరావు మాట్లాడుతూ వేసవి కాలంలో పశువుల దాహం తీర్చడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు, పశువులకు నీటిని సులభంగా అందుబాటులో ఉంచడానికి ఉపయోగపడతాయి. ఈ తొట్టెలు పశువులకు నీరు లేక వడదెబ్బ ఇతర ఆరోగ్య సమస్యలు రాకుండా కాపాడుతాయి. నీరు అందుబాటులో ఉంచటం వలన వేసవిలో నీరు తక్కువగా ఉన్నప్పుడు ఈ తొట్టెలు పశువులకు తాగడానికి నీటిని సులభంగా అందిస్తాయి. పశువులకు నీరు అందించడం ద్వారా పాల ఉత్పత్తి పెరుగుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుధాకర్, టీఏ అనిల్, ఈసీ కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ మల్లిఖార్జునరావు, నాయకులు మాదాల ప్రసాద్, నరసింహ, నరేష్, సుబ్బరామయ్య, నరేంద్ర, గ్రామంలోని పాడి రైతులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో మొదటి స్థానంలో శ్రీ విద్యానికేతన్ స్కూల్ విద్యార్థి బాలధనుష్



**పొన్నలూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
మండలంలోని బుధవారం వెలువడిన ఫలితాలలో శ్రీ విద్యానికేతన్ స్కూల్ విద్యార్థి కే.బాలధనుష్ 600 మార్కులకు గాను 589 మార్కులు సాధించి మండలంలోని మొదటి స్థానంలో నిలిచారు. 42మంది విద్యార్థులకు గాను 42మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అలాగే శుభోదయం స్కూల్ విద్యార్థి బీవీ యశ్వంత్ కుమార్‌రెడ్డి 586 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. 47 మంది విద్యార్థులకు 46 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ముండ్లమూరివారి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 30 మంది విద్యార్థులకు గాను 27 మంది ఉత్తీర్ణులయ్యారు. తస్నీరు గాయత్రి 582 మార్కులు సాధించి మొదటి స్థానం నిలిచారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 43 మంది విద్యార్థులకు గాను 39 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పి.వెంకట రమ్య 577 మార్కులు పొందారు. కేజీబీవీ పాఠశాల 37 మంది విద్యార్థినీలకు గాను 36 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎస్.మల్లిక 576మార్కులు పొందారు. చెన్నుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 31 మంది విద్యార్థులకు గాను 29 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పాలా బత్తిన వినయ్ 565 మార్కులు పొందారు. ఇప్పగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 56 మంది విద్యార్థులకు 56 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. డీపీఎం లక్ష్మి 561 మార్కులు సాధించారు. చెరుకుకొమ్ముపాలెం 48 మంది విద్యార్థులకు గాను 38 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బత్తుల గణేష్ 548 మార్కులు పొందారు. స్థానిక ఆత్మ పాఠశాల నందు 10 మంది విద్యార్థులకు గాను 10 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. డి.గణేష్ కు 541 మార్కులు పొందారు. ముప్పాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 24 మంది విద్యార్థులకు గాను 20 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పి.స్మైలీ 509 మార్కులు పొందారు. మండలంలో 368 విద్యార్థులకు గాను 343 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

## రైతులకు సబ్సిడీ పరికరాలు సరఫరా



**దొనకొండ,ఏప్రిల్ 23,ప్రభాతవార్త**
దొనకొండ మండలంలోని రైతులకి వ్యవసాయ యాంత్రీకరణ పథకం క్రింద సబ్సిడీపై పరికరాలని అందజేసినట్లు మండల వ్యవసాయాధికారి వి. శ్రీ నారాయణ తెలిపారు. బాటరీ స్ప్రేయర్ 1,డ్రైవన్ స్ప్రేయర్లు 5,రోటావేటర్ 1,విత్తనం గొర్రు 1, ట్రాక్టర్ గొర్రులు 15, మొత్తం గా 23 మంది రైతులు సుమారు 4.5 లక్షల రూపాయల సబ్సిడీని పొందినట్లు తెలిపారు.ఈ పరికరాలని సద్వినియోగం చేసుకొని మంచి దిగుబడులు పొందాలని కోరారు.గ్రామ వ్యవసాయ సహాయకులు రవి తేజ, కమల, విన్ని బాబు, అరుణ, రాధిక, రమేష్, సురేంద్ర మరియు లబ్ధి పొందిన రైతులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులు చేతిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆత్మశాంతి చేకూరాలి



**దొనకొండ,ఏప్రిల్ 23,ప్రభాతవార్త**
జమ్మూకాశ్మీర్ అనంతనాగ్ జిల్లా పెహల్గామ్ ప్రాంతంలో టూరిస్టుల మీద పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు చేతిలో ప్రాణాలు కోల్పోయినవారికి ఆత్మశాంతి చేకూరాలని ఆదేవిధంగా వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను ఇటువంటి పిరికి పంద చర్యలకు ఆఖంఢ భారతావని ఎప్పుడు బయపడదు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు ఖచ్చితం గా బుద్ది చెబుతారు ప్రపంచంలో భారత్ స్థాయిని ఎవరు తగ్గించలేరు రొడ్డ వెంకట్రావు దొనకొండ మండల బిజెపి పార్టీ మాజీ అధ్యక్షులు

## పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు

**మార్టూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
బుధవారం ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాలలో మార్టూరులోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల కలిపి మొత్తం 904 మంది విద్యార్థులకు గాను, 840 మంది ఉత్తీర్ణత పొంది మండలంలో 93 శాతం ఉత్తీర్ణత సాధించారు, వీరిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 591 మార్కులతో ద్రోణాదుల ఉన్నత పాఠశాల నుండి ఎల్.భార్గవి ప్రథమ స్థానం, 590 మార్కులతో వలపర్ల ఉన్నత పాఠశాల నుండి ఎస్.కే.ఫౌజియా తబ్సుమ్ ద్వితీయ స్థానం, 579 మార్కులతో కోలలపూడి ఉన్నత పాఠశాల నుండి జి.శ్రీనాగతేజ తృతీయ స్థానంలో నిలిచారు. అదే విధంగా మండలంలోని ప్రైవేటు యాజమాన్యాలలో 595 మార్కులతో వివేకానంద నెక్స్ట్ జెన్ పాఠశాల నుంచి పి.తేజస్విత ప్రథమ స్థానం లోను, వివేకానంద(హార్లిక్), నుండి 592 మార్కులతో జే.భాను ద్వితీయ స్థానంలోను, 590 మార్కులతో రాయల్ విద్యాసంస్థ నుండి పి.సాయి రేష్మిత తృతీయ స్థానంలోను నిలిచారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాల
## పదో తరగతి పరీక్షల్లో విద్యార్థుల విజయ దుందుభి

**- పాఠశాల టాపర్ బషీర్‌ను, ఆయన తండ్రిని సన్మానించిన ఉపాధ్యాయులు**





**పెద్దదోర్నాల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల ప్రభుత్వం ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో విజయ దుందుభి మోగించాఉ. 190 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో షేక్ బషీర్ 588 మార్కులు సాధించి మండల స్థాయిలో, పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచాడు. షేక్ మొహమ్మద్ మాజ్ 576 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచారు. షేక్ చాందిని 574, షేక్ అస్మత్ 574 మార్కులు సాదించి మూడో స్థానంలో నిలిచారు. 40 మంది విద్యార్థులలో 500పైగా మార్కులు లభించాయి. మండల స్థాయి స్థానంలో నిలిచిన షేక్ బషీర్, విద్యార్థి తండ్రిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. 500కు పైగా మార్కులు సాధించిని విద్యార్థిని విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసుకొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.అనసూయదేవి మాట్లాడుతూ కృషి, పట్టుదల, నిరంతర అభ్యాసన ఫలితంగా మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావడం అభినందనీయమని అన్నారు. ఇది ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, పాఠశాలకు గర్వకారణం అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.విజయ మానిక్యం, వి.నాగమూర్తి, కే.కిరణ్ కుమార్, డి.పోలయ్య హెచ్ రామానాయక్, మిటే నాయక్, కే.ఆవులయ్య, టి.వెంకట శివ శిరీష రాణి, పి.రామానాయక్, పి.చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.



## 588 లతో ప్రథమ స్థానం సాధించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ బషీర్

**- రెండో స్థానం నిలిచిన రవీంద్ర హైస్కూల్ విద్యార్థి సంజయ్ (583)**

**- మూడో స్థానం రవీంద్ర హైస్కూల్ విద్యార్థి త్రివేణి (582)**

**పెద్దదోర్నాల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలంలో పదో తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ బషీర్ 588 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. రవీంద్ర హైస్కూల్ విద్యార్థి ఎన్.సంజయ్ 583 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచాడు. అదే రవీంద్ర హైస్కూల్ పాఠశాల విద్యార్థి ఎస్.సంజయ్ 583 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచాడు. అదే రవీంద్ర హైస్కూల్ పాఠశాల విద్యార్థిని సీహెచ్ త్రివేణి 582 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచినట్లు పెద్దదోర్నాల మండల విద్యాశాఖ అధికారి బి.మస్తాన్ నాయక్ తెలిపారు. పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 190 మంది పరీక్షలు రాయగా 157 మంది పాసయ్యారు. 33 మంది ఫెయిల్ అయ్యారు. షేక్ బషీర్ 588 మార్కులతో స్కూల్ మొదటి స్థానం, షేక్ మహమ్మద్ మాజ్ 576 మార్కులు సాధించి రెండో స్థానం నిలిచాడు. మూడో స్థానంలో షేక్ చాందిని, అస్మిత్ 574 మార్కులతో నిలిచారు. పెద్దబొమ్మలాపురం జడ్పీ హైస్కూల్లో 37 మంది పరీక్షలు రాయగా 29 మంది పాసయ్యారు. 8 మంది ఫెలయ్యారు. కే.కావేరి 523మార్కులతో స్కూల్ ఫస్ట్, డి.అక్షయ్ కుమారి 496 మార్కులతో సెకండ్ స్థానం, వై.చంద్రకళ 486 మార్కులతో మూడో స్థానం నిలిచింది. కస్తూర్బా పాఠశాలలో 32 మంది పరీక్షలు రాయగా 31 మంది పాసయ్యారు. 554 మార్కులతో వి.ఉమామహేశ్వరి ప్రథమ స్థానంలో నిలిచింది. వి.విష్ణు ప్రియ 530 మార్కులతో ద్వితీయ స్థానం , 525 మార్కులతో సరిత మూడో స్థానం. ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో 38 మంది పరీక్షలు రాయగా 24 మంది పాసయ్యారు. 13 మంది ఫెలయ్యారు. 504 మార్కులతో ఆర్.గౌరీ భాయ్ స్కూల్ ఫస్ట్, 503 మార్కులతో పి.ఎస్తేరు రాణి భాయ్ రెండో స్థానం, 491 మార్కులతో తేజశ్రీ మూడో స్థానంలో నిలిచింది. ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాలుర పాఠశాల నుండి 35 మంది పరీక్షలు రాయగా 31 మంది పాసయ్యారు. 4గురు ఫెలయ్యారు. 569 మార్కులతో రామ్ చరణ్ మొదటి స్థానం, 563 మార్కులతో తిరుపతినాయక్ రెండో స్థానం, 555 మార్కులతో ధర్మనాయక్ మూడో స్థానం నిలిచాడు. వై.చెర్లోపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల నుండి 17 మంది పరీక్షలు రాయగా 11 మంది పాసయ్యారు. ఐదు మంది ఫెలయ్యారు. మొదటి స్థానంలో కే.భవ్యశ్రీ 562 మార్కులతో నిలిచింది. 490 మార్కులతో నాగేశ్వరి రెండో స్థానం కాగా మూడో స్థానంలో జి.స్వప్న 458 మార్కులతో నిలిచింది. రామచంద్ర కోట జడ్పీ హైస్కూల్ నుండి 59 గాను 53 మంది పాసయ్యారు. 6గురు ఫెయిల్ అయ్యారు. 572 మార్కులతో పెద్ద కాశమ్మ మొదటి స్థానం, 571మార్కులతో రుక్సాన, 569 మార్కులతో సీహెచ్ శ్రావణి మూడో స్థానం సాధించింది. ఏపీ మోడల్ స్కూల్ నుండి 76 మంది పరీక్షలు రాయగా 71 మంది పాసయ్యారు. ఐదుగురు ఫెలయ్యారు. భార్గవి 572 మార్కులతో ఫస్ట్ రాగా దేవదాసు 553 మార్కులతో సెకండ్, నందకిషోర్ 551 మార్కులతో థర్డ్ ర్యాంకు సాధించారు. చింతల హైస్కూల్ నుండి 9 మంది పరీక్షలు రాయగా ఆరుగురు పాసయ్యారు. ముగ్గురు ఫెయిలయ్యారు. 386 మార్కులతో కే.బయన్న స్కూల్ ఫస్ట్, 383 మార్కులతో హనుమయ్య సెకండ్, 375 మార్కులతో లక్ష్మీ మూడో స్థానంలో నిలిచింది. రవీంద్ర హైస్కూల్ నుండి 60 మంది పరీక్షలు రాయగా 59మంది పాసయ్యారు. 582 మార్కులతో సెకండ్ ర్యాంకు సాధించింది. 581 మార్కులతో పి.వైష్ణవి మూడో ర్యాంకు సాధించింది. ఇండియన్ హైస్కూల్ నుండి 31 మంది పరీక్షలు రాయగా 31మంది పాసై నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. పి.శివ ఇందు 577 మార్కులతో స్కూల్ ఫస్ట్ నిలిచింది. 556 మార్కులతో ఇఫ్రాన్ స్కూల్ సెకండ్, 562 మార్కులతో ఆఫ్రిన్ థర్డ్ ర్యాంకుతో నిలిచాడు.

# అన్నదాతల అభ్యున్నతే లక్ష్యం

**- రైతులకు అందుబాటులోకి ఎత్తిపోతల పథకాలు**

**- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**



**మార్టూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
అన్నదాతల అభ్యున్నతిలక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటు మాజీ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఐడీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోనే పత్తి ఎత్తిపోతల పథకాన్ని రైతులకు వినియోగంలోకి తీసుకురావడమే తన ఉద్దేశం అన్నారు. ప్రతి రైతుకు సరైన సమయానికి నీరు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతి ఎత్తి పోతల పథకాన్ని రైతులు వినియోగించుకునే రైతుల సమన్వయంతో భాగస్వామ్యం కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మూలన పడ్డ ఎత్తిపోతల పథకాలన్నీ రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఎత్తిపోతల పథకాల నిర్వహణ ప్రస్తుతం వివరించానని సీఎం సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. గ్రామాలలోని రైతులకు సాగునీటి సమస్యలు పరిష్కరించేలా ఎత్తిపోతల పథకాలను మరమ్మతులు చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నామన్నారు. సాగర్ టైల్యాండ్ ఆయకట్టకు నాలుగు నూతన పథకాలకు రూపకల్పన చేశామన్నారు. అలాగే ఈ పథకాలను పరిశీలించి కావాల్సిన నివేదికలు వాటి అంచనాలు త్వరితగతిన ఇవ్వాలని ఇంజనీరింగ్ అదికారులను ఆదేశించారు. ఆయా ఎత్తిపోతల పథకాలు ద్వారా ఆయకట్టుకు ఆనుకుని ఉన్న చెరువులకు, కుంటలకు నీటి సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాని ఎమ్మెల్యే ఏలూరి ఆదేశించారు. రైతుల అవసరాలు అనుగుణంగా నియోజకవర్గంలో ఉన్న ఎత్తిపోతల పథకాలను పూర్తి స్థాయిలో అందుబాటులో తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు నీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఐడీసీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ భాగ్యలక్ష్మీ, విశ్రాంత ఇరిగేషన్ ఇంజనీర్ ఎంవై సత్యనారాయణ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ గోపినాథ్‌లు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో సత్తా చాటిన చైతన్యహైస్కూల్ విద్యార్థులు





**యర్రగొండపాలెం,ఏప్రిల్23,ప్రభాతవార్త**
పదవతరగతి పరీక్ష ఫలితాల్లో య ర్రగొండపాలెం పట్టణంలోని చైతన్యహైస్కూల్ విద్యార్థులుతమసత్తాను చాటారు.సిహెచ్.ఎన్.ఎస్.వి. హాసిని 600 మార్కులకు గాను 582 మార్కులు,ఎస్.పల్లవి 600 గాను, 578మార్కులు,జడ్.లక్ష్మిభువన 600గాను 577 మార్కులు సాధించడం జరిగిందని కరస్పాండెంట్ తెలిపారు.తమహైస్కూల్‌లో 28 మంది విద్యార్థులకు 28 మంది విద్యార్థులు నూటికి నూరుశాతం విజయాన్ని సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు, తల్లిదండ్రులకుపాఠశాలప్రిన్సిపాల్ కరస్పాండెంట్ అభినందించారు.

## 10 ఫలితాల్లో శ్రీ గౌతమ్ విద్యార్థుల ప్రభంజనం



**కంభం రూరల్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
కంభం పట్టణంలోని శ్రీ గౌతమి హైస్కూల్ విద్యార్థులు బుధవారం ప్రకటించిన పదవ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించారు. కె లక్ష్మీకావ్య (595) మార్కులు సాధించి మొదటి స్థానం, సిహెచ్ చందన భార్గవి (593) మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారని గౌతమ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సిహెచ్ రామభూపాల్ రెడ్డి, ఛైర్మన్ శ్వేతలు ప్రకటించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరచి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థినీలను బుధవారం పాఠశాల యాజమాన్యం, సిబ్బంది శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్‌వి సుబ్బారెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఇంతటి ఘన విజయానికి సహకరించిన విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు, ఉపాధ్యాయ బృందానికి సిహెచ్ రాంభూపాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటిన మండల విద్యార్థులు

**మద్దిపాడు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బుధవారం ఉదయం 10గంటలకు ప్రకటించిన పదో తరగతి ఫలితాలలో మండల విద్యార్థులు ప్రతిభ చాటారు. 10వ తరగతి పరీక్షలకు 516 మంది విద్యార్థులు హాజరు కాగా 395 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలలో ఇనమనమెల్లూరు నేతాజీ స్కూల్‌కు చెందిన మోరమోయిన అజయ్ కుమార్ 584 మార్కులతో ప్రథమ స్థానం సాధించాడు. పెద్దకొత్తపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినీ కే.దీప్తి 582 మార్కులు సాధించి ద్వితీయ స్థానాన్ని సాధించింది. మూడో స్థానంలో నేతాజీ స్కూల్‌కి చెందిన నైనాల చంద్రకాంత్ 581 మార్కులు సాధించాడు. లింగంగుంట ప్రభుత్వ పాఠశాలకు చెందిన సీహెచ్ సుశాంత్ కుమార్ 575 మార్కులు, మండల కేంద్రం నారాయణస్కూల్‌కు చెందిన జి.గాయత్రి రత్నమాల 575 మార్కులు, ఇనమనమెల్లూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన జి.శ్రీభవ్య 562 ఆర్కులు సాధించి తమ ప్రతిభచాటుకున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి ఎంవీఆర్ ఆంజనేయులు, ఎంఈఓ -2 మెడబలిమి శ్రీనివాసరావు విద్యార్థులను అభినందించారు. నాగార్జున హైస్కూల్ విద్యార్థికి 572 మార్కులు వచ్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారావు మాధవి తెలిపారు. మద్దిపాడు కడియాల యానాదయ్య ఉన్నత పాఠశాల విద్యార్థుల 51 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల హెచ్ఎం పెద్దిరెడ్డి కోటిరెడ్డి తెలిపారు.

## పదో తరగతిలో ప్రథమ స్థానంలో పెద్దారికట్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి

**- వెలుగొండ గురుకులంలో 97 శాతం ఉత్తీర్ణత**



**కొనకనమిట్ల ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండల స్థాయిలో పెద్దారికట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మహేంద్ర 584 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని ఎంఈఓలు ఎస్‌కే డాంగే షరీఫ్, బి.నరసింహారావులు తెలిపారు. గొట్లగట్టు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కే.పద్మ 583, వై.జ్యోతి 579 మార్కులు సాధించి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వెలుగొండ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 97 శాతం ఉత్తీర్ణత సాధించారు. పెద్దారికట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు 44 మంది రాయగా, 39 మంది ఉత్తీర్ణులయ్యారు. 89శాతం ఉత్తీర్ణత సాధించారు. గొట్లగట్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో 123 మంది పరీక్షలు రాయగా 105 మంది పాస్ అయ్యారు. 85 శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం మార్కులు కే.పద్మ 583, వై.జ్యోతి 579, ఎం.నాగ పూజిత 578 లు సాధించారు. చిన్నారికట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 17 మంది విద్యార్థులకు గాను 15 మందిపాస్ అయ్యారు. కే.హరిత 567 మార్కులు, కే.శృతికి 517 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. చిన్నారికట్ల సరస్వతీ విద్యామందిరంలో 24 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 22 మంది పాసయ్యారు. అత్యధికంగా డి.ధరణికి 569, ఎన్.విశాలాక్షీ 567 మార్కులు వచ్చాయి. కొనకనమిట్ల ఉన్నత పాఠశాలలో 46 మంది పరీక్షలు రాయగా 38మంది పాస్ అయ్యారు. అత్యధిక మార్కులు కే.వీరనారాయణ 536, వి.రమ్య 527,కడెం చైతన్య 503లు సాధించారు. మగ్రిపాలెం ఉన్నత పాఠశాలలో 60 మంది విద్యార్థులకు గాను 45 మంది పాస్ అయ్యారు. 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యధిక మార్కులు కే.సాయి ప్రియ 550, ఎన్.దీప్తి 528, కే.శ్వేత 518లు సాధించారు. రేగడిపల్లె ఉన్నత పాఠశాలలో 20 మంది విద్యార్థులకు గాను 18 మంది పాస్ అయ్యారు. 90 శాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యధిక మార్కులు జి.మిక్సిత 522, వి.చైతన్య 511, టి.మౌనిక 495 మార్కులు సాధించారు. గొట్లగట్టు కేజీబీవీలో 39 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 37 మందిపాస్ అయ్యారు.95శాతం ఉత్తీర్ణత సాధించారు.అత్యధిక మార్కులు టీవీసుధా 562 సాధించారు.

## యంపిపిఎస్ స్కూల్‌కి జారుడుబల్ల బహుకరణ



**యర్రగొండపాలెం,ఏప్రిల్23,ప్రభాతవార్త**
య ర్రగొండపాలెం మండంలోని కొలుకుల యంపిపిఎస్ పాఠశాలకు 40వేల విలువగల జారుడుబల్లను గ్రామస్తుడైన గర్రెవెంకటసుబ్బయ్య కుమారుడు గర్రె బ్రహ్మయ్య సోమవారం యంఇవో అంజనేయుల చేతులమీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా యంఇవో మాట్లాడుతూ పుట్టి పెరిగిన గ్రామాలకు స్వచ్ఛందంగా సేవ చేయడం ఒక మహాభాగ్యం అన్నారు.ప్రతి ఒక్కరూ సమాజంలో మన పిల్లలు చదువుకునే పాఠశాలకు మనవంతు ఎద్దైన సహాయం చేయడం అనేది ఒక మంచి ఆవకాశం అన్నారు.విద్యార్దుల పట్ల గర్రెబ్రహ్మయ్య దంపతులు చూపిన ప్రేమానురాగాలు వెలకట్టలేనివనీ అయన అన్నారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ,విద్యాకమిటి చైర్మన్ బలిజేపల్లి ప్రసాద్,యంఇవో ఆంజనేయులు పూలదండాలు,శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఇందిర,సిఆర్‌యంటి హనుమానాయక్,మూర్తి,బ్రహ్మయ్య గారి కుమారుడు గర్రెశ్రీనివాసరావు,భార్గవి,తదితరులు పాల్గొన్నారు.

## పెద్దారికట్ల జాతీయ రహదారి పక్కన చలివేంద్రం ప్రారంభం

**కొనకనమిట్ల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
మండలంలోని పెద్దారికట్ల ఎన్‌హెచ్ 565 రహదారి పక్కన మజ్జిగ,మంచినీళ్ల చలివేంద్రాన్ని సీపీఎం నాయకులు చెన్నమోయిన వెంకటేశ్వర్లు, సాయి నర్సమ్మ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ దివంగత పుచ్చలపల్లి సుందరయ్య సేవా స్ఫూర్తితో ప్రజలకు దాహార్తితీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయ మన్నారు. ఒక పక్క హోటల్ నడుపుకుంటూ వేసవిలో మజ్జిగ, మంచినీరు అందించేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసిన చెన్నమోయిన వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఎంనాయకులు పి.బాలనర్సయ్య,ఎన్.వెంకటేశ్వరరెడ్డి, ఏ.శ్రీను, రామకోటేశ్వరరావులు పాల్గొన్నారు.

## 10 ఫలితాల్లో ప్రభంజనం సృష్టించిన సూర్య విద్యానికేతన్ విద్యార్థులు




**గిద్దలూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
గిద్దలూరు నగర పంచాయితీలోని స్థానిక సూర్య విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు బుధవారం విడుదలైన 10వ తరగతి ఫలితాలలో ప్రభంజనం సృష్టించారు. సూర్యా విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎం లక్ష్మీలహరి (593) మార్కులతో మొదటి స్థానం, పి లారా రోజ్ (592), ఎం హాసిని (592)మార్కులతో రెండవ స్థానం, కె రామ్ చరణ్ (590) మార్కులతో తృతీయ స్థానాన్ని సాధించి సూర్యా విద్యార్థులు మరోసారి ముందంజలో నిలిచారు. పాఠశాల నుండి 10వ తరగతి పరీక్షలకు 140మంది విద్యార్థులు హాజరు కాగా 138మంది విద్యార్థులు ఫస్ట్‌క్లాస్, ఒక విద్యార్థి ద్వితీయ స్థానాన్ని సాధించారు. 590మార్కులకు పైగా నలుగురు, 580మార్కులకు పైగా 22మంది, 550మార్కులకు పైగా 71మంది, 500లకు పైగా 121మంది ఫలితాలను సాధించారని కరస్పాండెంట్ డిజి బ్రహ్మానందరెడ్డి, డైరెక్టర్ డి.పద్మావతిలు తెలిపారు. పాఠశాలలో విద్యతోపాటు ఉత్తమ క్రమశిక్షణతోపాటు సర్వతోముఖాభివృద్ధి చెందే విధంగా ప్రతి విద్యార్థిని తయారు చేయడమే సూర్య విద్యానికేతన్ పాఠశాల నినాదం అన్నారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్,డిజిబ్రహ్మానందరెడ్డి, డిపద్మావతి, పాఠశాలఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందించారు.

**ఎస్ఎస్‌సి ఫలితాల్లో నారాయణ గిద్దలూరు విద్యార్థుల ప్రతిభ :**
గిద్దలూరు పట్టణంలోని నారాయణ పాఠశాలకు చెందిన విద్యార్థులు బుధవారం విడుదలైన ఎస్ఎస్‌సి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగురవేశారు. పాఠశాలకు చెందిన కె హాసిని (594, పి భువనేష్ (594)మార్కులు సాధించి గిద్దలూరులోనే మొదటి స్థానంలో నిలిచారు. ఎస్‌కె సనా(593),బి.చరణ్ తేజేశ్వరరరెడ్డి(592), ఎస్.అమృత (591),వైనితీశ్వర్‌రెడ్డి (591)మార్కులతో ఘన విజయం సాధించారు. ఇందుకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థినీ విద్యార్థులకు నారాయణ పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు. ఇంతటి ఘన విజయానికి కారణమైన అధ్యాపక బృందానికినారాయణ పాఠశాలయాజమాన్యం హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.


## ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు

**- దూపాడు ప్రభుత్వ పాఠశాలలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత**



**త్రిపురాంతకం, ఏప్రిల్ 23 ,ప్రభాతవార్త**
గణపవరం గురుకుల పాఠశాలలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 592మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవడం విశేషం. త్రిపురాంతకం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి మంచి ఫలితాలు సాధించారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతంతోపాటు అత్యధిక మార్కులు సాధించారు. దూపాడు మహిళా గురుకుల పాఠశాలలో నూరుశాతం సాధించగా గణపవరం గురుకుల పాఠశాలలో మండలంలోనే 592మార్కులతో బేతం వెంకటేష్ ప్రథమ స్థానంలో నిలిచాడు. పుచ్చకాయల నవీన్ 590మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలవగా, పులిమి హర్షవర్ధన్ 589మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. మండలంలోని పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 78.52శాతం పాఠశాలలో ఉతీర్ణత సాధించిన విద్యార్థిని విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

## అక్రమ రేషన్ బియ్యం పట్టివేత



**దొనకొండ,ఏప్రిల్ 23,ప్రభాతవార్త**
మండల కేంద్రమైన దొనకొండ బాదాపురం రోడ్డులోని మాదాల రాము ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం ఒంగోలు విజిలెన్‌న సిఐ రవిబాబు ,ఎస్సై నాగేశ్వరరావు 50 కిలోల బస్తాలు సుమారు 170 బస్తాలను పట్టుకున్నారు. మాదాల రాము తల్లి సుశీలను విజిలెన్స్ అధికారులు విచారించగా ఈ బియ్యం దొనకొండకు చెందిన మాడిశెట్టి నారాయణ మా ఇంట్లో పెట్టుకోవడం జరిగిందని తెలపగా నారాయణను విచారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామనేఇ అధికారులు తెలిపారు. అక్రమంగా దొరికిన బియ్యంను స్వాధీనం చేసుకొని స్థానిక గవర్నమెంట్ గోడౌనుకు తరలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రవిబాబు,ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు.

## వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

### - యూనివర్సిటీ టౌన్ ర్యాంకుల పంట

**కనిగిరి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



కనిగిరి టౌన్‌కు చెందిన వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో ఘన విజయం సాధించారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాల్లో కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ ర్యాకులంతో పాటు టౌన్ ఫస్ట్ ర్యాంకులను సొంతం చేసుకున్నారు. ఎల్లూరి రంజిత ఒకేషనల్ అగ్రికల్చర్ విభాగంలో 400లకు 319 మార్కులు సాధించి యూనివర్సిటీ మూడో ర్యాంకు కైవసం చేసుకుంది. తుపాకుల కృష్ణవేణి బీఎస్సీ కంప్యూటర్స్‌లో 400లకు 375 మార్కులు టౌన్ ఫస్ట్ సాధించింది. కామిరెడ్డి కళ్యాణి బీకాం కంప్యూటర్స్‌లో 400లకు 343 మార్కులతో టౌన్ ఫస్ట్ సాధించింది. ఇండ్ల నందిని గోపాల్ బీసీఏ విభాగంలో 400లకు 333 మార్కులు సాధించి మంచి ప్రతిభ కనపరిచింది. మాసిపోగు ప్రిన్సెస్ డైమండ్ బీఎస్సీ జూయాలజీ విభాగంలో 350లకు 309 మార్కులు సాధించి టౌన్ ర్యాంకు కైవసం చేసుకుంది. ఈ ఘన విజయాన్ని పురస్కరించుకుని కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, అధ్యాపక వర్గం విద్యార్థులను అభినందించి బహుమతులు ప్రధానం చేశారు.

## మే 4న ఉచిత సున్తీ కార్యక్రమానికి ఆహ్వానం

**కనిగిరి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

కనిగిరిలోని కేఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత సున్తీ కార్యక్రమం మే 4న ఆదివారం పామూరు రోడ్డులో గల ఎన్జీవో హోమ్ ప్రాంగణంలో జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫూర్ తెలిపారు. సున్తీ చేయించుకోదలచిన చిన్నారుల పేర్లను మే 2వ తేదీలోపు ఆయా ప్రాంతాల మసీదుల్లో గానీ లేదా క్రింది ఫోన్ నంబర్లలో గానీ నమోదు చేసుకోవచ్చన్నారు. 9441786390, 9441744050, 6305032388, 9666614889, 9160220061 సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా కనిగిరి మున్సిపల్ చైర్మన్, ఎస్ఎంఎం ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పట్టణంలోని పెద్దలు, మత నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ పాలుపంచుకుని చిన్నారులను ఆశీర్వదించాలన్నారు.

## నారాయణ ఈటెక్నో స్కూల్ విద్యార్థుల అద్భుత విజయం

**కనిగిరి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కనిగిరి నారాయణ ఈటెక్నో స్కూల్ విద్యార్థులు అసాధారణ విజయాన్ని సాధించారు. మొత్తం600 మార్కులకు గాను ఇద్దరు విద్యార్థులనులు 593 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ ర్యాంకు సాధించిన విద్యార్థినీ బత్తుల అమూల్య 593/600, పాపాబత్తిన తేజస్విని 593/600 ఇంకా 591 మార్కులతో షేక్ అస్మా కౌసర్ అత్యుత్తమ ప్రతిభను చూపింది. 580కి పైగా మార్కులు సాధించినవారు 5 మంది కాగా, 550కి పైగా మార్కులు సాధించినవారు 25 మంది ఉన్నారు. మొత్తం పరీక్షకు హాజరైన 36 మందిలో 500కి పైగా మార్కులు సాధించినవారు 32 మంది కావడం గర్వకారక విషయం. ప్రతి సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తూ విద్యాపరంగా ఉన్నత స్థాయికి ఎదుగుతున్న ఏకైక పాఠశాలగా నారాయణ ఈ టెక్నో స్కూల్ నిలిచింది.

## పది పరీక్షల్లో హనీ స్కూల్ విజయం

**కనిగిరి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని హనీ ఐఐటీ అండ్ మెడికల్ ఫౌండేషన్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో అద్భుత విజయం సాధించారు. విద్యార్థిని కంభం వెంకటశ్రావ్య 592/600 మార్కులతో టౌన్ టాపర్‌గా నిలిచింది. పరీక్షకు హాజరైన 27 మంది విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించి 100 శాతం ఫలితాలు నమోదయ్యాయి. వారిలో 13 మంది 500కు పైగా మార్కులు సాధించారు. కరస్పాండెంట్ ఎం.కృష్ణారెడ్డి విద్యార్థులను అభినందించారు. హనీ స్కూల్లో విద్యార్థుల మానసిక స్థాయికి అనుగుణంగా మెరుగైన సౌకర్యాలతో బోధన జరుగుతుందన్నారు.

## పది ఫలితాల్లో మెరిసిన జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినీలు

### - పట్టణంలోని పాఠశాల ఉత్తీర్ణత శాతం 81శాతం

**కనిగిరి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినీలు ఉత్తమ ఫలితాలతో వెలుగులోకి వచ్చారు. 134 మంది విద్యార్థినీలు పరీక్షలకు హాజరైనప్పటికి అందులో 108 మంది ఉత్తీర్ణత సాధించి, పాఠశాల మొత్తం ఉత్తీర్ణత శాతం 81 శాతంగా నమోదైంది. ప్రత్యేకంగా షేక్ ఆయేషా అనే విద్యార్థిని 600లో 580 మార్కులు సాధించగా, ఎం.అసిల్ శ్రావ్య 579, కొండ లిఖిత 572 మార్కులతో మెరిశారు. అంతే కాక 500కి పైగా మార్కులు సాధించిన విద్యార్థినీల సంఖ్య 31గా ఉండటం గర్వకారణంగా మారింది. ఈ గొప్ప విషయాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మీ, అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీల తల్లిదండ్రులు విద్యార్థినీలను అభినందించారు. విద్యార్థినీల శ్రమ, అధ్యాపకుల మార్గనిర్దేశం, తల్లిదండ్రుల ప్రోత్సాహమే ఈ విజయానికి కారణమని ప్రధానోపాధ్యాయురాలు పేర్కొన్నారు.

## భోజనం ప్యాకెట్లు అందజేత

**టంగుటూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



టంగుటూరు మండలం జమ్ములపాలెం గ్రామానికి చెందిన తాటితోటి కోటేశ్వరరావు 29వ వర్ధంతిని పురస్కరించుకుని టంగుటూరు గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఉండే అనాథలకు, యాచకులకు, వృద్ధులకు, పేద కుటుంబాలకు భోజనం ప్యాకెట్స్, వాటర్ బాటిల్స్ ఇచ్చి వర్ధంతిని జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు దేవరపల్లి చంద్రశేఖర్, వీరమల్లి అజయ్, గరికముక్కల మూర్థ, ఇత్తడి వినయ్, కుటుంబ సభ్యులు విక్టోరియా రాణి, కోమల కిరణన, స్రవంతి, ఉదయ్ జీవన్ లు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య విజయ కేతనం

**టంగుటూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



బుధవారం వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో టంగుటూరుకు చెందిన శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. 592 మార్కులతో బాపతు ప్రీతి, 591 మార్కులతో వీఎస్ఐ భవాని, 589 మార్కులతో బిల్లా అనూష్, బడుగు రమ్యలు మొదటి, రెండు, మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు మొత్తం 46 మంది, 50 (90శాతం)కు పైగా విద్యార్థులు 30 మంది సాధించారు. అద్భుత ఫలితాలను సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను ఉపాధ్యాయులను పాఠశాల కరస్పాండెంట్ వివి రమణ, ప్రధానోపాధ్యాయులు ఎన్.వెంకాయమ్మ, డైరక్టర్ వివి రాజసింహ అభినందించారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**టంగుటూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తూర్పునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. మొత్తం22 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 21 మంది పాసై 96శాతం ఉత్తీర్ణులయ్యారని ప్రధానోపాధ్యాయులు ఎన్‌వి సుధారాణి తెలిపారు. 600మార్కులకు గాను కొట్టే



తేజశ్రీ 567, పావలా భ్రమరాంబిక 565, చల్ల తేజశ్రీ 550, బొమ్మల శిరీష 535, బుర్ర సింధు 532, గాదే సుప్రీత్ రెడ్డి 530, గౌతకట్ల రోహిత్ 527, దాసరి కావేరి 501 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

**బెల్లంకోటయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలః**

బెల్లం కోటయ్య ప్రభుత్వ పాఠశాలకు చెందిన సాయి చరణ్ తేజ 571 మార్కులు సాధించారు. విద్యార్థిని హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

## 26న విద్యుత్ లోక్ అదాలత్ జయప్రదం చేయండి

**కనిగిరి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గం ఆరు మండలాల విద్యుత్ వినియోగదారులకు ఈనెల 26న ఉదయం 10.30గంటలకు జరుగుతుందని విద్యుత్ ఏఈ పవన్ కుమార్ తెలిపారు. ఎన్ విక్టర్ సమక్షంలో కనిగిరి పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ప్రాంగణంలో విద్యుత్ అదాలత్ నిర్వహించబడును. కావున విద్యుత్ వినియోగదారులు అందరూ మీ యొక్క దీర్ఘకాలిక, అపరిష్కృత విద్యుత్ సమస్యలను ఈ వేదికను ఉపయోగించుకుని తక్షణ పరిష్కారం పొందాల్సిందిగా తెలిపారు.

## టెన్త్ ఫలితాలలో సంచనాలు నమోదు చేసిన పందిళ్ళపల్లి విద్యార్థులు

**చీరాల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



బుధవారం వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పందిళ్లపల్లి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. 600మార్కులకు గాను సజ్జా దివ్యశ్రీ 596 మార్కులు సాధించింది. ఉప్పాల నవ్య సుధ 591, పృధ్వి ధనుష్ 589, కే.శ్యామ్ సాయిశ్రీ 589, కోడూరి స్వేచ్ఛ మణి 589, పొగడ దండ శ్రావణి 588, గుత్తి మోహిత్ విజయ్ కుమార్ 587 మార్కులు సాధించారు. 550కు పైగా 20 మంది, 500లకుపైగా 27 మంది సాధించారు. 86శాతం ఉత్తీర్ణత శాతం నమోదైనట్లు తెలిపారు. విద్యార్థులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ చెరుకూరి రాంబాబు, బండ్ల భారతి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఊటుకూరు శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శి రొండా దశరధరామిరెడ్డి, జాయింట్ సెక్రటరీ కడెం రాముడు, గ్రామస్తులు అభినందించారు.

## పోలేరమ్మ తిరునాళ్లలో ప్రత్యేక పూజలు

### - పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

**చీరాల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**





చీరాల హరిప్రసాద్‌నగర్‌లోని 28వ వార్డులో మంగళవారం జరిగిన పోలేరమ్మ తిరునాళ్ల మహోత్సవ కార్యక్రమంలో చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ధర్మపత్ని బాలకొండమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పోలేరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ల వేడుకల్లో పోలేరమ్మ గుడి కమిటీ సభ్యులు, భక్తులు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. మహోత్సవం సందర్భంగా ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవారి ఆలయం విద్యుత్ కాంతులతో మెరిసిపోగా, భక్తులు పూజలతో పాటు హారతులందిస్తూ దేవీ కృపకు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలేరమ్మ తల్లిని పూజించడం ఆనందాన్ని శాంతిని అందిస్తుంది, ఇలాంటి పవిత్రమైన వేడుకల్లో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

## పదో తరగతి ఫలితాలు

**చిన్నగంజాం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



పదో తరగతి పరీక్షా ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈ పరీక్షల్లో తిరిగి విజయ ఢంకా మోగించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నగంజాం విద్యార్థులు. 17 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. చిన్నగంజాం జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో చదువుతున్న మాచవరపు సాహితీ 584 మార్కులతో మండలంలోని మొదటి స్థానాన్ని,బాల జ్ఞానేశ్వరి 582 మార్కులతో మండలంలో రెండో స్థానాన్ని సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నగంజాం విద్యార్థులకు అభినందనలు తెలియజేసిన ప్రధానోపాధ్యాయులు డి.రత్నకుమారి. అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ 115 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరవగా 103 ఉత్తీర్ణ సాధించారు. వీరిలో 500 పైగా మార్కులు 17 విద్యార్థులు సాధించారు. కార్యక్రమంలో మొదటి రెండు స్థానాలు సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నగంజాంకు పేరు ప్రతిష్ఠలు సంపాదించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## ప్రైవేటు స్కూల్స్‌కు ధీటుగా గవర్నమెంట్ స్కూల్ విద్యార్థులు

**వేటపాలెం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



బుధవారం వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వేటపాలెం బాలికోన్నత పాఠశాల విద్యార్థిని సత్రం నేహా 582 మార్కులు ఆధించి పాఠశాల టాపర్ కాగా బూదాటి విజయలక్ష్మీ 574, కంచర్ల జెరూష 569 వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. పాఠశాల హెచ్ మాస్టర్ ఫణి సత్యనారాయణ అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల నుండి మొత్తం 164 మంది పరీక్షలు రాయగా 115 మంది ఉత్తీర్ణులు అయ్యారని, 26 మంది 500 మార్కులు పైన సాధించారని, ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని మంచి ఫలితాలను సాధించే దిశగా పయనించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫలితాలను సాధించిన విద్యార్థులకు పాఠశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

## కూలీల ఆటో అదుపు బోల్తా

### - ఒకరు మృతి, పది మందికి గాయాలు

**ముండ్లమూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



మండలంలోని ఉల్లగల్లు గ్రామం దగ్గర బుధవారం మిర్చి కోతకు కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా పడి బండి సారమ్మ మృతి చెందగా మరో 10 మందికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. దర్శి మండలంలోని లంకోజనపల్లి గ్రామానికి చెందిన కూలీలు రోజు వారిమిర్చి కోతలకు ముండ్లమూరు మండలంలోని ఉమామహేశ్వరపురం అగ్రహారం గ్రామానికి వెళ్తుండగా ఉల్లగల్లు సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం ఎదురు వస్తున్న కారుని తప్పించబోయి ఆటోబోల్తా పడింది. బోల్తా పడిన ఆటోలో 11 మంది ప్రయాణం చేస్తుండగా సారమ్మ అనే మహిళకి బలమైన దెబ్బ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మిగతా గాయాలైన కూలీలను దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి 108 సాయంతో తీసుకెళ్లారు. దర్శి



ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న డాక్టర్ సుమన్ దెబ్బ తగిలిన కూలీలకు చికిత్స అందజేశారు. వీరిలో నలుగురు నరసరావుపేటకి వెళ్లి అక్కడ వైద్యం చేయించుకుంటున్నారు. మిగతా వారు దర్శి ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్న చిన్న గాయాలు అవడంతో అక్కడే వైద్యం చేయించుకుంటున్నారు. దీంతో మృతి చెందిన సారమ్మ బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని బోరున విలపించారు. అదేవిధంగా గాయాలైన కూలీల బంధువులు కూడా విచారణ వ్యక్తం చేశారు.

## వక్ఫ్ చట్టానికి నిరసనగా ముస్లింలు ర్యాలీ

**దర్శి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



దర్శిలో ముస్లింలు కొత్తగా అమల్లోకి వచ్చిన వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గంలోని ఐదు మండలంలోని ముస్లింలు ప్రవాహంగా మారి దర్శిని జనసంద్రంగా మార్చారు. వక్ఫ్ వ్యతిరేక విధానాలతో దర్శి దద్దరిల్లింది. పార్టీలకు అతీతంగా వారి ఉనికి కోసం ముస్లింలు చేస్తున్న ఈ ర్యాలీతో దర్శి గడియారస్తంభం గడగడలాడిపోయింది. గంగవరం రోడ్డులోని మర్కస్ మస్జిద్ నుండి గడియారస్తంభం మీదుగా కురిచేడు రోడ్డులోని అక్సా మజీద్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో ముస్లిం మహిళలు సోదరులు ప్లకార్డులతో నల్లజెండాలతో నల్ల రిబ్బన్లతో ఈ చట్టం రాజ్యాంగ





విరుద్ధమని దీనిని మేమంతా వ్యతిరేకిస్తున్నామని శాంతియుతంగా నిరసన తెలుపుతూ 150 అడుగుల జాతీయ జెండాతో భారతదేశం జిందాబాద్ భారతీయులంతా ఒక్కటే హిందూ ముస్లిం భాయ్ భాయ్ అంటూ భారతదేశంపై తమకున్న ప్రేమను జాతీయ జెండాలతో ప్రదర్శించి నిరూపించుకున్నారు. దేశ వ్యాప్తంగా శాంతియుత పోరాటాలు చేస్తూనే ఉంటామని నినాదాలు చేశారు.

## ప్రజల పక్షానే వార్త జాతీయ దిన పత్రిక

### - 28 ఏళ్లగా ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర - గార్లపాటి

**అద్దంకి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



వార్త జాతీయ దిన పత్రిక 28ఏళ్ళుగా ప్రజల పక్షాన నిలబడి ప్రజల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రముఖ వ్యాపారి, భాస్కర్ సప్లైయిర్స్ అధినేత గార్లపాటి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం వార్త జాతీయ దినపత్రిక ఎండి గౌరవ సంఘీ పుట్టిన రోజు సందర్భంగా అద్దంకిలోని శ్రీ చైతన్య బదిరుల ఆశ్రమ పాఠశాలలో కేక్ కటింగ్ నిర్వహించి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బదిర విద్యార్థినీ విద్యార్థులకు స్వీట్లు, పండ్లు



పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గార్లపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్ని ఒడుదుడుకులు ఎదురైన వార్త జాతీయ దినపత్రిక ప్రజా స్వామ్యంలో ప్రజల పక్షాన మూలస్తంభంలా నిలబడి వారి మన్ననలను, వారి ఆదరణను పొందుతుందని ఆయన కొనియాడారు. అద్దంకి ఆర్‌సి పరిధిలో ఎండి గౌరవ సంఘీ పుట్టిన రోజు వేడుకలను బదిరుల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమారెడ్డి, శ్రీహరి, పాఠశాల చైర్మన్ పూనూరి ఆరోగ్యం, సురేంద్ర, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంకమ్మ తల్లి విగ్రహ ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న బూచేపల్లి

### - పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న బూచేపల్లి

**ముండ్లమూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**





మండలంలోని కెల్లంపల్లి గ్రామంలో బుధవారం అంకాలమ్మ తల్లి విగ్రహ ధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో దర్శి ఎమ్మెల్యే వైసీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు పాల్గొని దేవుని ఆశీర్వాదాలు అందుకున్నారు. అనంతరం ముండ్లమూరు మండలంలోని మారెళ్ళ గ్రామంలో పోలేరమ్మ తల్లివిగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని దేవుని ఆశీర్వాదాలు అందుకున్న దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ. ఈ సందర్భంగా దేవుని ఆశీర్వాదాలు అందుకున్నారు. ముందుగా బూచేపల్లికి కెల్లంపల్లి మారెళ్ళ గ్రామంలో వైసీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి, వైస్ ఎంపీపీ బంక నాగిరెడ్డి, వైసీపీ జిల్లా కార్యదర్శి సూర్యదేవర



అంజయ్య, వైసీపీ మండల కన్వీనర్ చింత శ్రీనివాస్‌రెడ్డి, వైసీపీ నాయకులు మోద్దుల సుబ్బారెడ్డి, నిడమానూరి చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

### - సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు

**దర్శి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



ఉల్లగల్లు వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయి, గాయాలు పాలైన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు.దర్శి మండలం లంకోజనపల్లికి చెందిన 17 మంది వ్యవసాయ కూలీలు ఆటోలో మండలం అగ్రహారం గ్రామానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆటో తిరగబడి బండి శారమ్మ అనే మహిళ మృతి చెందడంతో పాటు పది మందికి తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. బాధితులను వారి కుటుంబ సభ్యులను దర్శి ప్రభుత్వ వైద్యశాల వద్ద సీపీఎం బృందం పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా మృతి చెందిన శారమ్మ కుటుంబ పరిస్థితి కడదయనీయంగా ఉందని అన్నారు. భర్తకు 3 సంవత్సరాల క్రితం యాక్సిడెంట్ అయి కదలలేని పరిస్థితుల్లో ఉంటే కుటుంబ భారం అంతా నెత్తిన వేసుకుని ఆమె సంసారాన్ని సాగిస్తుందని అన్నారు. ఇప్పుడు తనని ఎవరు ఆదుకుంటారని భర్త పడుతున్న ఆవేదన వర్ణణాతీతంగా ఉందని అన్నారు. తీవ్ర గాయాలు అయిన వారిని నరసరావుపేట వినుకొండ లాంటి ప్రాంతాలకు పంపించారని తెలిపారు. బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలని, పని ప్రదేశాలకు కూలీలకు తగిన ఆర్టీసీ బస్సు సౌకర్యాలను ప్రభుత్వం పెంచాలని, ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బాధితుల కుటుంబాలను పరామర్శించిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తాండవ రంగారావు,మండల కన్వీనర్ సందు వెంకటేశ్వరరావు,నాయకులు కేవీ పిచ్చయ్య పాల్గొన్నారు.

## ఆరోగ్య సిబ్బందికి సీవైటీబీ పరీక్ష తప్పనిసరి

### - డాక్టర్ సీహెచ్ ప్రవీణ్ కుమార్

**ముండ్లమూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



మండలంలోని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్యులు సీహెచ్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బందికి ముందస్తు చర్యలుగా టీబీ వ్యాధి రాకుండా టీబీ వ్యాధి నిర్ధారణ కోసం సీవైటీబీ అనే అధునాతన నిర్ధారణ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్ష ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులోకి వచ్చినట్లుగా వారు తెలిపారు. క్షయ వ్యాధి గ్రస్తులు ఉన్న ఇంటిలో 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ కూడా ఈ పరీక్ష చేయించుకోవాలని వారు కోరారు. అదే విధంగా టీబీ వ్యాధి అనూనితులు ఆ లక్షణాలు ఎవరైనా 15 రోజులుగా దగ్గు, బరువు తగ్గడం షుగర్ వ్యాధిగ్రస్తులు అయితే వారం రోజులు పాటు దగ్గు ఉంటే, ఇంకా ఏమైనా క్షయ వ్యాధి లక్షణాలు దగ్గినప్పుడు కళ్లెలో రక్తం పడటం, ఇంకా అనుమానిత లక్షణాలు ఉన్నవారు, ఈ సీవైటీబీ వ్యాధి నిర్ధారణ పరీక్ష మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కంప్రదంలో చేయించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ డి.వెంకటరావు, హెల్త్ సూపర్‌వైజర్ సీహెచ్ నాగేశ్వరరావు, ఏ.అంజమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ కే.రాజు, పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

24-4Pg5exHNWMJQE.qxd:24-4Pg5exHNWMJQE.qxd 01/01/01 9:01 AM Page 1



# విదేశీ అతిథుల పర్యటనల్లోనే ఉగ్రదాడులు



**పహల్గాంవ్, ఏప్రిల్ 23:** భారత్‌లో విదేశీ అతిథులు, అగ్రనేతలు పర్యటిస్తున్న సమయంలోనే ఉగ్రదాడులు జరుగుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇది పాకిస్థాన్ కుట్రబుద్ధికి ఓ తార్కాణంలా కనిపిస్తోంది. ఎందుకంటే ఇప్పటి పహల్గాం ఉగ్రదాడికి, 2000 సంవత్సరంలో జరిగిన అనంత్‌నాగ్ ఛత్తీసింగ్‌పోరా నరమేధానికి చాలా పోలికలు కనిపిస్తున్నాయి. జమ్మూకశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడానికి పాక్ ఈ విధమైన నక్కజిత్తులు వేషాలు వేస్తోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రధాని మోదీ విదేశీ పర్యటనలో ఉండడం, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్ పర్యటనలో ఉండడాన్ని అవకాశంగా తీసుకుని పాకిస్థాన్ పహల్గాం ఉగ్రదాడికి పాల్పడి ఉండవచ్చనే అనుమానాలు బలపడుతున్నాయి. 2000 సంవత్సరంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత్ పర్యటనకు వచ్చారు. సరిగ్గా అదే సమయంలో, అంటే 2000 మార్చి 20న అనంత్‌నాగ్ జిల్లాలో ఛత్తీసింగ్‌పోరాలో ఉగ్రవాదులు ఆకస్మిక దాడులు చేసి 36 మందిని బలి తీసుకున్నారు. నాడు సిక్కులే ముష్కర మూకలకు లక్ష్యంగా మారారు. జమ్మూకశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయాలనే ఉద్దేశంతోనే పాక్ కుట్ర చేసింది. ఆనాడు ఉగ్రవాదులు రెండు సైనిక వాహనాల్లో, భారీ స్థాయిలో తుపాకులు తీసుకుని ఛత్తీసింగ్‌పోర గ్రామంలోకి చొరబడ్డారు. భారత సైనికుల వేషంలో ఇంటింటికీ వెళ్లి, తనిఖీల నిమిత్తం పురుషులు బయటకు రావాలని బెదిరించారు. అలా వచ్చిన పురుషులను గురుద్వారా వద్దకు తీసుకెళ్లి చంపేశారు. భారత సైన్యమే అలా చేసిందని, అక్కడి వారిని నమ్మించేలా ఉగ్రవాదులు నినాదాలు చేశారు. చివరికి దర్యాప్తులో పాక్ ఉగ్రవాదులే ఈ దారుణానికి పాల్పడినట్లు గుర్తించారు. ఇప్పటి పహల్గాం ఉగ్రదాడికి, 2000లో జరిగిన ఛత్తీసింగ్‌పోరా నరమేధానికి చాలా దగ్గరి పోలికలు ఉన్నాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్, తన కుటుంబంతో సహా భారత పర్యటనకు వచ్చారు. మరోవైపు భారత ప్రధాని నరేంద్ర మోదీ సౌదీ అరేబియా పర్యటనలో ఉన్నారు. దీనితో జమ్మూకశ్మీర్ అంశాన్ని మరోసారి ప్రపంచానికి తెలియజేయాలని పాక్ కుట్రపన్నినట్లు తెలుస్తోంది. అందుకే భారత సైనికుల్లా వేషాలువేసుకున్న ఉగ్రవాదులు, కశ్మీర్‌లోని పర్యటకులను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడ్డారు. మరీ ముఖ్యంగా పురుషులనే లక్ష్యంగా చేసుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి వెనుక పాక్ ఆర్మీ చీఫ్ ఆసీమ్ మునీర్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆసీమ్ మునీర్ ఇటీవలే ఓవర్సీస్ పాకిస్థాన్ కన్వెన్షన్‌లో మాట్లాడుతూ, భారత్‌కు వ్యతిరేకంగా రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. మన లక్ష్యం స్పష్టంగా ఉంది. గతంలో కశ్మీర్ మన గొంతులోని రక్తనాళంలా ఉండేది. ఇక భవిష్యత్తులోనూ అలానే ఉంటుంది. కశ్మీర్‌ను మనం ఎప్పటికీ మరిచిపోలేం. మన కశ్మీరీ సోదరులు పోరాటం చేస్తున్నారు. వారిని మనం ఒంటరిగా వదిలేయం. మీరు మీ పిల్లలకు పాకిస్థాన్ కథను కచ్చితంగా చెప్పండి. మన జీవితంలోని ప్రతి అంశం హిందువుల కంటే చాలా భిన్నమని మన పూర్వీకులు భావించారు. ఆ విషయాన్నే పిల్లలకు చెప్పండి. అప్పుడే మన పూర్వీకుల ఆలోచనలను పిల్లలు గుర్తుంచుకుంటారు. ఈ రెండు మతాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షలు పూర్తిగా భిన్నమైనవి. అదే ఈ రెండు దేశాల సిద్ధాంతానికి పునాది. ఆసీమ్ మునీర్, పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ ఈ రెచ్చగొట్టే ప్రసంగం చేసిన తర్వాతే పహల్గాం దాడి జరిగింది. మరోవైపు ఇదే సమయంలో పాక్ వాయుసేనకు చెందిన రవాణా, నిఘా విమానాలను కరాచీనుంచి లాహోర్, రావల్పిండి బేస్‌లకు తరలించారు. ఇదంతా భారత్‌ను ఢీకొట్టాలని పాక్ చేస్తున్న ప్రయత్నమేనన్న అనుమానాలను బలపరుస్తోంది.




## కాశ్మీరీలు సిగ్గుపడుతున్నారు

## -మెహబూబా ముఫ్తీ

**శ్రీనగర్, ఏప్రిల్ 23:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 27 మంది పర్యాటకులు మరణించడంపై పిడిపి అధినేత్రి మెహబూబా ముఫ్తీ స్పందించారు. ఈ సంఘటనతో తమతోపాటు కశ్మీరీలు సిగ్గుపడుతున్నారని తెలిపారు. గత కొన్నేళ్లుగా కశ్మీర్‌లో పౌరులపై జరిగిన అత్యంత దారుణమైన దాడుల్లో ఇది ఒకటని అన్నారు. బుధవారం శ్రీనగర్‌లో పిడిపి కార్యకర్తలతో కలిసి మెహబూబా ముఫ్తీ నిరసన ర్యాలీ నిర్వహించారు. 'ఇది మనందరిపై దాడి, అమాయకులను చంపడం భయానక చర్య, అమాయకుల హత్యలను ఆపండి' అని రాసి ఉన్న ప్లకార్డులను కార్యకర్తలు ప్రదర్శించారు. కాగా, నిరసన ర్యాలీతర్వాత మెహబూబా ముఫ్తీ మీడియాతో మాట్లాడారు. ఉగ్రదాడి అమాయక పర్యాటకులపైనే కాదని, కశ్మీరియత్‌పై కూడా జరిగిందని తెలిపారు. 'ఇది మాపై జరిగిన దాడి. మేం దీనిని ఖండిస్తున్నాం. దీనిని సహించబోం. హోంమంత్రి ఇక్కడఉన్నారు. దాడిలో ప్రమేయం ఉన్న ఉగ్రవాదులను గుర్తించాలి. అప్పుడు వీలైనంత త్వరగా శిక్షించవచ్చు' అని అన్నారు. మరోవైపు సరదాగా గడిపేందుకు కశ్మీర్‌కు వచ్చే అమాయక పర్యాటకులపై ఉగ్రదాడి చేయడం అత్యంత పిరికి పని అని మెహబూబా ముఫ్తీ విమర్శించారు.

'మేం సిగ్గుపడుతున్నాం. కశ్మీరీలు సిగ్గుపడుతున్నారని దేశ ప్రజలకు నేను చెప్పాలనుకుంటున్నా. ఈ బాధాకరమైన సమయంలో మేం మీకు అండగా ఉంటాం. నేరస్తులను ప్రభుత్వం పట్టుకుని శిక్ష విధించాలని మేం కోరుతున్నాం' అని అన్నారు.

కాగా, ఉగ్రదాడి భద్రతా లోపమా అన్న ప్రశ్నకు, రాజకీయాలు ఆడటానికి ఇది సమయం కాదని మెహబూబా ముఫ్తీ తెలిపారు. 'మా హృదయాలు బాధలో ఉన్నాయి. ప్రజల హృదయాలు పగిలిపోయాయి. జమ్ముకశ్మీర్, దేశం మొత్తం శోకసంద్రంలో ఉన్నది. ప్రియమైన వారిని కోల్పోయిన వారి బాధను మేం పంచుకుంటున్నాం. దేశ ప్రజలకు నేను క్షమాపణలు చెప్పాలనుకుంటున్నా' అని అన్నారు.



## సిఎం, డిప్యూటీలను చంపేస్తామంటూ బెదరింపులు!

**బెంగళూరు, ఏప్రిల్ 23:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను, ఉప ముఖ్యమంత్రిడీకే శివకుమార్‌ను హతమారుస్తామని బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. సీఎం, డిప్యూటీ సీఎంలను దారుణంగా హత్య చేస్తామని ఓ దుండగుడు ఈ మెయిల్‌లో బెదిరింపు సందేశం పంపాడు. కర్ణాటక విధానసౌధ పోలీసులు ఈ విషయాన్ని వెల్లడించారు. రాంపురకు చెందిన ప్రభాకర్ అనే వ్యక్తికి తాను కోటి రూపాయలు అప్పుగా ఇచ్చానని, దానిని ఇంకా తిరిగి చెల్లించనందున అతడిని కూడా హత్య చేస్తానని మెయిల్‌లో ఆగంతకుడు పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. సింధార్ రాజపుత్ అనే వ్యక్తి పేరిట మెయిల్ వచ్చినట్లు గుర్తించామని, తదుపరి విచారణ కొనసాగుతోందని అన్నారు.

త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు. బెదిరింపు మెయిల్ నేపథ్యంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నివాసాల దగ్గర భద్రతను కట్టుదిట్టం చేశామని చెప్పారు.

## మృతులకు హోంమంత్రి అమిత్‌షా నివాళి

### మృతులకు జమ్ముకాశ్మీర్ ప్రభుత్వం రూ.10 లక్షలు చొప్పున పరిహారం

### శ్రీనగర్‌నుంచి ఢిల్లీ, ముంబయిలకు ప్రత్యేక విమానసర్వీసులు



**శ్రీనగర్, ఏప్రిల్ 23:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన భీకర ఉగ్రదాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రధాని నరేంద్ర మోదీ కేంద్రమంత్రులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అధికారులను భద్రతను కట్టుదిట్టం చేశారు. ఓవైపు ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు ముమ్మురంగా గాలింపు చర్యలు సాగుతున్నాయి. మరోవైపు కేంద్రమంత్రులు తదుపరి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తాజాగా కీలక ప్రకటన చేశారు. పర్యాటకుల భద్రత మేరకు వారి కోసం శ్రీనగర్ నుంచి ప్రత్యేక విమాన సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగు ప్రత్యేకవిమానాలు శ్రీనగర్ నుంచి ముంబయి, ఢిల్లీకి చేరుకుంటాయని చెప్పారు. ఆ విషయంపై మంగళవారం హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడానని తెలిపారు. అవసరమైతే మరిన్ని విమానాలు నడపడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులోభాగంగా మంత్రి అన్ని విమానయాన ఆపరేటర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇలాంటి సమయంలో ప్రయాణికులపై భారం పడకుండా సాధారణ స్థాయి ఛార్జీలను వసూలు చేయాలని విమానయాన సంస్థలను ఆదేశించారు. మరణించిన వ్యక్తుల మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించడానికి రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకొని పనిచేస్తూ పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు. శ్రీనగర్‌కు వెళ్లే విమానాలను పెంచాలని పలు విమానయాన సంస్థలను కేంద్రం కోరింది. అదే సమయంలో శ్రీనగర్ పర్యాటకులకు కొన్ని మినహాయింపులు ఇచ్చింది ఇండిగో సంస్థ. విమాన టికెట్లు రీషెడ్యూల్, కాన్సలేషన్ ఛార్జీలను రద్దు చేసింది. శ్రీనగర్‌కు ప్రత్యేక సర్వీసులు కూడా నడుపుతున్నామని బుధవారం వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడి మృతుల కుటుంబాలకు జమ్ముకశ్మీర్ ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు వెల్లడించింది. మరోవైపు పహల్గాంలో కాల్పులు జరిగిన ప్రదేశాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పరిశీలించారు. ప్రాణాలు కోల్పోయిన వారికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నివాళులు అర్పించారు. అందుకోసం బుధవారం ఉదయం శ్రీనగర్‌కు చేరుకున్నారు. అనంతరం పుష్పగుచ్ఛాలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఉగ్రవాద దాడిలో కర్ణాటకకుచెందిన ఇద్దరు వ్యక్తులు మరణించారని ఆ రాష్ట్ర ప్రభుత్వం ధ్రువీకరించింది. అక్కడి నుంచి పర్యటకులను తీసుకురావడానికి హెల్ప్‌లైన్ నంబర్‌లను ఏర్పాటు చేసింది.

రాష్ట్రంలోని టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెంట్ల ద్వారా పర్యటకుల వివరాలను రాబట్టేలా చర్యలు తీసుకుంది. మరణించిన వారి మృతదేహాలను కుటుంబ సభ్యులతో పాటు బుధవారం మధ్యాహ్నం తిరిగి తీసుకురావాలని నిర్ణయించింది. పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో గోవాకు చెందిన 50 మందికి పైగా పర్యాటకులు జమ్ముకశ్మీర్‌లో చిక్కుకున్నారు. వారంతా శ్రీనగర్‌లోని హోటళ్లలో చిక్కుకుపోయారని, వారిని తిరిగి తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సురక్షితంగా ఉన్నారని చెప్పారు.

## సైనికులను చూసి కూడా వణికిన పర్యాటకులు!

**శ్రీనగర్, ఏప్రిల్ 23:** పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో వచ్చి దాడులకు తెగబడ్డారు. మొత్తం ఐదుగురు ముష్కరులు మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా కాల్పులకు దిగారు. ఈ కాల్పుల్లో మొత్తం 28 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రదాడి నుంచి బయటపడిన పలువురు బాధితులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో రావడంతో.. దాడి అనంతరం బాధితులను రక్షించేందుకు వచ్చిన సైనికులను చూసి కూడా జనం గడగడ వణికిపోయారు. ఉగ్రవాదులు మళ్లీ వచ్చారనుకుని భీతిల్లారు. సైనికులను చూసిన ఓ మహిళ తన కొడుకును ఏమీ చేయవద్దని బోరున విలపించింది. చేతులు జోడించి వేడుకుంది. ఇతర పర్యటకులు భయంతో తమ పిల్లలను తమ వెనుక దాచుకున్నారు. దాంతో ఓ సైనికుడు వారికి ధైర్యం చెప్పారు. తాము భారత ఆర్మీ నుంచి మిమ్మల్ని రక్షించడానికే వచ్చామని భరోసా ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అదేవిధంగా ఉగ్రవాదుల దాడిలో తన భర్త మరణాన్ని చూసి షాక్‌కు గురైన ఓ మహిళ అందులో నుంచి బయటకు రాలేకపోతున్నారని, బాధతో రోదిస్తూనే ఉన్నారని భద్రతా బలగాలు తెలిపాయి. కాగా జమ్ముకశ్మీర్‌లో పౌరులే లక్ష్యంగా జరిగిన అత్యంత దారుణమైన ఉగ్రదాడుల్లో ఇది కూడా ఒకటి. పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత 'లష్కరే తోయిబా' అనుబంధ విభాగం 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' ఈ మారణహోమానికి తామే పాల్పడినట్లు ప్రకటించింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ ఉగ్రదాడి జరిగింది. దుండగులు అతి సమీపంనుంచి తూటాల వర్షం కురిపించారు. మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా దాడికి దిగారు. 28 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు విదేశీయులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.



## శాంతిచర్చలకు సిద్ధమే: పుతిన్

**మాస్కో, ఏప్రిల్ 23:** ఉక్రెయిన్‌తో శాంతి చర్చలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా ద్వైపాక్షిక చర్చలపై ఆశాభావం వ్యక్తం చేశారు. శాంతిని నెలకొల్పేందుకు అమెరికా తీవ్రంగా ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా దేశ అధికారిక వార్తాచానెల్‌లో మాట్లాడిన పుతిన్ ఈ మేరకు చెప్పారు. శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని, ఉక్రెయిన్ నుంచి కూడా ఇదే ఆశిస్తున్నా టమని తెలిపారు.

అయితే, పుతిన్ వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పరోక్షంగా స్పందించారు. కాల్పుల విరమణ ద్వారానే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. ఈ వివాదం ముగింపు లక్ష్యంగా అమెరికా, యూరప్ దేశాల ప్రతినిధులతో చర్చించడానికి ఉక్రెయిన్ ఉన్నత స్థాయి బృందం లండన్‌కు వెళ్తుందని తెలిపారు. ఒక వైపు శాంతి చర్చలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ మరోవైపు రష్యా ఉక్రెయిన్‌లు మాత్రం దాడులను చేసుకుంటూనే ఉన్నాయి. ఆదివారం కీవ్‌పై పదులకొద్దీ డ్రోన్, బాంబు దాడులకు పాల్పడినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. బదులుగా కీవ్ బలగాలూ దాడులు కొనసాగించాయని రష్యా అధికారులు ఆరోపించారు. మరోవైపు ఉక్రెయిన్, రష్యాలు యుద్ధం విరమణపై తొందరగా ఒక ఒప్పందానికి రాకపోతే శాంతి ఒప్పందం కుదిర్చే ప్రయత్నాల నుంచి విరమించుకుంటామని అమెరికా ఇప్పటికే ప్రకటించింది. ఇప్పుడు ఈవారంలోనే యుద్ధం ఆగే అవకాశాలున్నాయని చెబుతోంది. ఈ విషయాన్ని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. రష్యా, ఉక్రెయిన్‌లమధ్య శాంతిఒప్పందం ఈ వారంలోనే కుదిరే అవకాశం ఉందంటూ తన సామాజిక మాధ్యమం 'ట్రూత్'లో పోస్టు చేశారు. ఈ రెండు దేశాలు తమతో కలిసి భారీగా వ్యాపారం చేయబోతున్నాయని కూడా వెల్లడించారు.

## పర్యాటకులను రక్షించిన వ్యాపారి

**పహల్గాంవ్, ఏప్రిల్ 23:** మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాం పర్యటనకు వచ్చిన వారిపై ఉగ్రవాదులు చేసిన దాడిలో 26 మంది మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. అయితే, స్థానిక వ్యాపారులు చొరవ తీసుకుని పలువురు పర్యటకులను రక్షించారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి కాపాడినట్లు పర్యాటకులు చెబుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మహేంద్రగఢ్ చిర్‌మిరీ భరత్‌పుర్ ప్రాంతానికి చెందిన నాలుగు కుటుంబాలు పహల్గాం పర్యటనకు వెళ్లాయి. ఉగగ్రదాడి జరిగిన సమయంలో శివాన్‌షైన్, కుల్దీప్ స్తాపక్, అర్వీందర్ అగర్వాల్, హ్యాప్పీ బద్వాన్ కుటుంబాలకు చెందిన 11మంది అక్కడే ఉన్నాయి. వేసవి సెలవుల నేపథ్యంలో ఏప్రిల్ 18న వీరందరూ చిన్నారులతో సహా విహార యాత్రకు వెళ్లారు. ఏప్రిల్ 21న పహల్గాం చేరుకున్నట్లు కుల్దీప్ బంధువు రాకేశ్ తెలిపారు. అయితే, కొండచరియలు విరిగిపడడం వల్ల రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోయిందని, ఎక్కడి వారు అక్కడే ఆగిపోయారని వివరించారు. ఈ సమయంలోనే కాల్పులు జరిగాయని, దీంతో భయపడిన పర్యాటకులు పరుగులు తీసినట్లు వెల్లడించారు.



వీరిని గమనించిన స్థానిక కశ్మీరీ వ్యాపారి నజకత్ అలీ సమయస్ఫూర్తిని ప్రదర్శించి, పర్యాటకుల 11 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించి కాపాడినట్లు తెలిపారు. నజకత్ అలీ ప్రతి ఏడాది శీతల కాలంలో ఉన్ని దుస్తులు విక్రయించేందుకు చిర్‌మిరికి వస్తుంటాడని వారు పేర్కొన్నారు. పహల్గామ్ వెళ్లిన పర్యాటకులు కుల్దీప్ స్తాపక్, అతడి భార్యతో పాటు అనేక మంది పహల్గాం పర్యటనకు వెళ్లారు. వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఉగ్ర దాడి జరిగిన సమయంలో వీరంతా అక్కడే ఉన్నారు. దీంతో భయపడి లాడ్జ్ వైపు వచ్చినట్లు చెప్పారు. ఆ తర్వాత అక్కడి నుంచి సురక్షితంగా జమ్ముకు వచ్చారని చెప్పారు. కశ్మీర్ నుంచి చిర్‌మిరికి వచ్చి వ్యాపారాలు చేసుకునేవారు వీరిందరిని సురక్షితంగా పంపించడంలో సాయం చేశారు. రాకేశ్ పరాశర్, కుల్దీప్ బంధువు నా కొడుకు, కోడలు, మనవడు కలిసి పహల్గాం పర్యటనకు వెళ్లారు. వారితో పాటు ముగ్గురు స్నేహితుల కుటుంబాలు అక్కడికి వెళ్లాయి. ఉగ్రదాడి జరగడంతో భయపడ్డాం. వారికి ఫోన్ చేయగా తామంతా సురక్షితంగా ఉన్నట్లు చెప్పారు. శివాన్ష్ జైన్ తల్లి పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడికి పాల్పడింది. సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యటకులను చుట్టుముట్టి, అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఘటన అనంతరం అడవుల్లోకి పారిపోయిన ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు ముమ్మర గాలింపు చేపట్టాయి. ఘటన నేపథ్యంలో ఎన్ఐఏ రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టింది.

## పల్వామా 2 దాడిగా భావించాలి

### ముష్కరులను మట్టుపెట్టాల్సిందే..

### జమ్ముకాశ్మీర్ మాజీ డిజిపి శేష్‌పాల్ వైద్



**పహల్గాంవ్, ఏప్రిల్ 23:** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడి చేసిన విధానం, అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడి తరహాలో ఉందని జమ్ముకశ్మీర్ మాజీ డిజిపి శేష్ పాల్ వైద్ అన్నారు. భారత్‌పై జరిగిన ఈ దాడిని పుల్వామా 2గా భావించాలని తేల్చిచెప్పారు. రెండు రోజుల క్రితం పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ భారత్‌పై చాలా అనుచిత వ్యాఖ్యలు చేశారు. అవేవో యాదృచ్ఛికంగా అన్నమాటలు కావు. ఎందుకంటే ఉగ్రవాదులు పర్యాటకుల మతాన్ని అడిగి, ఎవరైతే ముస్లింలు కారో వారిని మాత్రమే చంపారు. హమాస్ దాడిని ఇజ్రాయెల్ ఎలా తిప్పికొట్టిందో, భారత్ కూడా అలానే చేయాలి. వాస్తవానికి ఈ ఉగ్రదాడిని పాకిస్థాన్ సైన్యం ప్రారంభించింది. ఎందుకంటే దాడి చేసింది ఉగ్రవాదులు కాదు. ఉగ్రవాదుల ముసుగులో పాకిస్థాన్ సైన్యంలోని ఎస్ఎస్‌జీ (స్పెషల్ సర్వీస్ గ్రూప్) కమాండోలు ఈ దాడులకు పాల్పడ్డారు. ఇది ఒక పక్కా ప్రణాళిక ప్రకారం జరిగిన దాడి. ఇక మనం చాలా అప్రమత్తంగా ఉండాల్సిందే. అని మాజీ డిజిపి అన్నారు. బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా, సింధ్, పీఓకే ప్రజలందరికీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను. పాకిస్థాన్ సైన్యం చేసిన ఈ ఉగ్రవాద చర్యలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, స్వాతంత్ర్యం ప్రకటించుకోండి. అంతేకాదు, పాకిస్థాన్ సైన్యం వెన్నువిరిచి, భారత్ దాన్ని నాలుగు ముక్కలుగా నరకాలి అని శేష్ పాల్ వైద్ అన్నారు. వాస్తవానికి ఉగ్రదాడి అంతా పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఆదేశాలతోనే జరుగుతోంది. పైగా ఈ తరహా దాడులను మరింత తీవ్రతరం చేయాలని ఆయన అనుకుంటున్నారు. అతను తనేంటో నిరూపించుకోవాలని ఆరాటపడుతున్నాడు అని మాజీ డిజిపి పేర్కొన్నారు.

## జమ్ముకాశ్మీర్‌లో వెల్లువెత్తిన నిరసన



**శ్రీనగర్, ఏప్రిల్ 23:** ఉగ్ర దాడితో జమ్ముకశ్మీర్ మరోసారి ఉలిక్కిపడింది. పహల్గాంవ్‌లో చోటుచేసుకున్న ఉగ్రదాడితో స్థానికుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం అయ్యాయి. శ్రీనగర్‌సహా స్థానికంగా అనేక ప్రాంతాల్లో స్వచ్ఛందంగా బంద్‌పాటించారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. పీపుల్స్ డెమొక్రటిక్‌పార్టీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ దేశప్రజలకు క్షమాపణలు చెప్పారు. ఈఘటనతో కాశ్మీరీలు సిగ్గుతో తలదించుకుంటున్నారని అన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ కూడా లాల్‌చౌక్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టింది. రాజకీయ పార్టీలు సహ అన్ని వర్గాలప్రజలు ఉగ్రచర్యలను ఖండిస్తూ నిరసన ప్రదర్శనలుచేసారు. కాశ్మీర్ ఆర్థికమూలాలను దెబ్బతీసారని ఉగ్రవాదులపై ఆగ్రహం వ్యక్తంచేసారు. ఇటీవలికాలంలో దుకాణాలు మూతపడటం ఇదే తొలిసారి. 370వ అధికరణం రద్దు తర్వాత గత ఆరేళ్లలో కాశ్మీర్‌లో బంద్ పాటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇలాంటివి మళ్లీ జరక్కూడదు. కాశ్మీర్‌పేరుతో ఏదైనా వర్గంపేరుతో ఇలాంటివి మళ్లీ కొనసాగనీయకూడదని, అమాయకుల ప్రాణాలు తీయడం అంటే మొత్తం మానవాళినే చంపడంతో సమానం అని హాజీ బాషిర్ అహ్మద్ అనే శ్రీనగర్ వాసి అన్నారు. వీలైనంత త్వరగా ఉగ్రవాద మూలాలు నిర్మూలించాలనికోరారు. కాశ్మీరీ సమాజాన్ని కించపరచడం స్థానిక ఆర్థికవ్యవస్థను దెబ్బతీసేందుకు కుట్రలుజరుగుతున్నాయని అన్నారు. ఉగ్రవాద నిర్మూలనకు ప్రభుత్వం ఏం చర్యతీసుకున్నా తాము మద్దతు ఇస్తామన్నారు. ఉత్తర కాశ్మీర్‌లోని కుప్వారా జిల్లా హంద్వారాలో భారీ నిరసనలు జరిగాయి. దక్షిణకాశ్మీర్‌లో కూడా నిరసనలు వెల్లువెత్తాయి. 2016లో హిజ్‌బుల్ ముహిదీన్ ఉగ్రవాది బుర్హాన్ వానీ హతమైన తర్వాత ఇలాగే స్థానికులు వీధుల్లోకి వచ్చారు. కాశ్మీరీలు ఉగ్రవాదంతో లేరని ప్రపంచానికి తెలిజెప్పేందుకే ఈ నిరసనలుచేస్తున్నామని పర్యాటకులపై దాడిని ఖండిస్తున్నామని ఆందోళనకారులు చెప్పారు. దాడికి పాల్పడిన వారు జమ్ముకాశ్మీర్‌ప్రజలు మేలు కోరేవారుకాదని నేషనల్ కాన్ఫరెన్స్ నేత శ్రీనగర్ ఎంపి ఆగా సయ్యద్ రుహుల్లా మెహ్‌దీ అన్నారు. రాంబన్ జిల్లాలోకూడా నిరసనలు జరిగాయి. ఆకస్మిక వరదలు కొండచరియలు విరిగిపడిన ఘటనలతో విలవిల్లాడుతున్నా ఉగ్రదాడికి నిరసనగా బంద్‌పాటించి శాంతియుత నిరసనలుచేసారు. ఈ పట్టణం చరిత్రలో తొలిసారిగా హిందూ ముస్లిం వర్గాలు కలిసి ఉగ్రచర్యకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమంచేపట్టడం గమనార్హం.

24-4Pg6exHMNWJQE.qxd:24-4Pg6exHMNWJQE.qxd 01/01/01 10:15 AM Page 1



# పాగాకు రైతు సమస్యలు సిఎం దృష్టికి తీసుకెళ్తా : కాకర్ల



**కలిగిరి (నెల్లూరు), ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** పొగాకు పండించినా రైతుకు గిట్టుబాటు ధర రాకపోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధృష్టికి తీసుకెళ్లి రైతులకుమంచి జరిగేవిదంగా కృషి చేస్తానని ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ తెలిపారు.బుదవారం కలిగిరి పొగాకు వేలం కేంద్రాన్ని రైతుల కోరిక మేరకు కాకర్ల సురేష్ సందర్శించారు.ఈసందర్భంగా కలిగిరి పొగాకు బోర్డులో రైతులు కొనుగోలుకు తెచ్చిన పొగాకు బేళ్లను పరిశీలించారు. అనంతరం కొనుగోలు దారుల ఆక్షన్‌లో రైతులతో కలసి పాల్గొన్నారు. పొగాకు ధరలు హెచ్చు తగ్గులు,పొగాకు నాణ్యతను బట్టి రకాలుగురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతుసంఘనాయకులు శ్రీకాంత్ పొగాకు పంట వేసిన దగ్గరనుండి పెట్టుబడి, అమ్మితే రాబడి వరకు యంఎల్ఏ దృష్టికి తీసుకువచ్చారు. తదనంతరం రైతులుకూడా ఈ సంవత్సరం అన్ని పెట్టుబడులు అధికమైనాయని కానీ ధర విషయానికి వస్తే గత సంవత్సరంకన్నా క్వింటాకు రు. 10వేలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఇలాఐతే రైతు బారీగా నష్టపోతారని ప్రభుత్వమైనా తమను ఆదుకోవాలని యంఎల్ఏ దృష్టికి తెచ్చారు.అనంతరం ఇదేవిషయం పొగాకు బోర్డుఆకషన్ అధికారితో సమావేశమై రైతులు పడుతున్న ఇబ్బందులు ధర విషయంలో జరుగుతున్న అన్యాయంపై వేలం నిర్వాహణాధికారితోయంఎల్ఏ చర్చించారు.ధరలవిషయంలో పొగాకు కొనుగోలు చేసే కంపెనీ ప్రతినిదులతో మాట్లాడి రైతులకు నష్టం వాటెల్లకుండా చూడాలన్నారు. అనంతరం విలేఖర్లతో మాట్లాడుతూఈ ప్రాతంలో రైతులు వర్జీనియా పొగాకు అధికంగా పండించడం జరుగుతుందన్నారు. పొగాకు పండించేందుకు ఎకరాకు రైతుకు ఈసంవత్సం లక్షాయాభైవేలనుండి లక్షా60వేలవరకు పెట్టుబడిఅవుతుందన్నారు. కానీ ఇక్కడ పొగాకు ధరలు చూస్తే గత సంవత్సరం పొగాకు ధర మేలురకం కింటాకురు.38వేలు పలికితే అదేపొగారు ఈసంవత్సరం క్వింటారు. 28వేలు పలుకుతుందన్నారు. ఇక రెండవరకంపొగాకు ధర గతసంవత్సరం కన్నా 10వేలరూపాయల తక్కువ ధరకు కొంటున్నారన్నారన్నారు. ఇది బోర్డు, బయ్యర్లు కలిసి రైతులను ఇబ్బందులు పెడుతున్నట్లు రైతులద్వారా తెలుస్తుందన్నారు.కలిగిరి పొగాకు బోర్డు పరిదిలో సుమారు 1500మందిపైగా రైతులు పొగాకు పండిస్తున్నారన్నారు.ఈపొగాకు పంటకాలంలో అధికపెట్టుబడులు పెట్టి అమ్మకాలకు పంటను తీసుకువస్తే కంపెనీలు ఈవిదంగా కొనుగోలు చేయడం అన్యాయమన్నారు. ఇదేవిషయం మే1న చంద్రబాబు పర్యటన ఆత్మకూరులో ఉందని ఆత్మకూరు నియోజకవర్గంపరిదిలోని డిసి పల్లెలోకూడా పొగాకు బోర్డులో అమ్మకాలు తెలుసుకొని ఆత్మకూరు శాసన సభ్యులుతో కలసి బాబుదృష్టికి తీసుకెళ్తామన్నారు. అదేవిదంగా కేంద్ర వ్యవసాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర వ్యవసాయమంత్రి అచ్చయ్యనాయుడు దృష్టికి తీసుకెళ్లి పొగాకు రైతులకు న్యాయం జరిగేవిదంగా కృషిచేస్తామని రైతులకు కాకర్ల సురేష్ మాటి ఇచ్చారు.ఈయన వెంట రైతుసంఘనాయకులు శ్రీకాంత్, టిడిపి రాష్ట్ర రైతుసంఘకార్యనిర్వాహక కార్యదర్శి బొల్లినేని వెంకట రామారావు,రావులకొల్లు సర్పంచి వ్రాసాలవెంగవనాయుడు, మల్నేని శ్రీనివాసులనాయుడు, గన్నమనేని శ్రీనివాసులు, చితంరెడ్డి సుబ్బారెడ్డి, సిహెచ్‌సుబ్బారెడ్డి, బుజ్జియ్య తదితరులు పాల్గొన్నారు.

# పదోతరగతిలో గురుకుల విద్యార్థుల ప్రతిభ:మంత్రి సవిత



**విజయవాడ,ఏప్రిల్23.ప్రభాతవార్తప్రతినిధి:** టెన్త్ ఫలితాల్లో ఎంజేపీ బీసీ స్కూళ్లు అత్యుత్తమ ఫలితాలు సాధించారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. కార్పొరేట్ సంస్థలకు ధీటుగా ఎంజేపీ బీసీ స్కూళ్ల ఫలితాలు సాధించాయన్నారు. 29 స్కూళ్లో వంద శాతం పలితాలు రావడంపై ఆమె ఆనందం వ్యక్తంచేశారు.బిసి హాస్టల్స్, ఎంజేపీ బీసీ స్కూళ్ల విద్యార్దులు సాధించిన ఫలితాలపై బుధవారం ఆమె ఒక ప్రకటన చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ విద్యార్థుల విద్యకు ఎంతో ప్రాధాన్యమిస్తోందని, సీఎం చంద్రబాబు ఆశయాలు నెరవేర్చేలా టెన్త్ లో ఫలితాలు రాబట్టినందుకు ఆమె విద్యార్థులను అభినందించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించడంలో విశేష కృషి చేసిన ఎంజేపీ బీసీ ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయేతర సిబ్బందికి కూడా మంత్రి సవిత అభినందనలు తెలిపారు. అధికారంలోకి రాగానే డైట్ బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీల బకాయిల చెల్లించామన్నారు. హాస్టళ్ల మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనకు నిధుల మంజూరు చేశామన్నారు. ఎస్ఆర్ శంకరన్ రిసోర్స్ సెంటర్లతో పాటు విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. హాస్టళ్లకు నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా ఇన్వర్టర్లు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లోనూ పట్టు సాధించేలా ఉపాధ్యాయులతో నిరంతర పర్యవేక్షణతో పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించామన్నారు. ఈ విజయం ముమ్మాటికీ సీఎం చంద్రబాబుదేనని మంత్రి సవిత స్పష్టంచేశారు. పదో తరగతి పరీక్షల్లోనూ మహాత్మా జ్యోతిరావు పూలే(ఎంజేపీ) బీసీ గురుకుల విద్యార్థులు టాప్ లేపారు. బుధవారం విడుదలైన టెన్త్ పరీక్షల్లో ఎంజేపీ బీసీ స్కూల్ విద్యార్థులు 95 శాతం మేర ఉత్తీర్ణతీ సాధించారు. ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షల్లోనూ ఎంజేపీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించిన విషయం విధితమే. ఎంజేపీ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రస్థాయి ఉత్తీర్ణత కంటే అధికంగా ఎంజేపీ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం అధికంగా ఉండడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల ఫలితాలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విడుదల చేశారు. రాష్ట్ర స్థాయి ఫలితాల్లో 81.14 శాతం మేర ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఈ ఫలితాల్లో బీసీ వెల్ఫేర్ కు చెందిన ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటారు. రాష్ట్ర వ్యాప్తంగా 102 ఎంజేపీ స్కూళ్లకు చెందిన 5,788 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 95 శాతం మంది పాసయ్యారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కు చెందిన 11,819 పాఠశాలలకు చెందిన 6,14,459 మంది విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 102 ఎంజేపీ స్కూళ్లకు చెందిన 5,788 మంది విద్యార్థులకు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. వారిలో 95 శాతం మంది పదో తరగతి పరీక్షల్లో పాసైయ్యారు. 29 ఎంజేపీ స్కూళ్లలో వంద శాతం మేర ఉత్తీర్ణత సాధించడం విశేషం. అదే సమయంలో ఎంజేపీ స్కూళ్లో జీరో ఉత్తీర్ణత శాతం నమోదుకాకపోవడం మరో విశేషం. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలల ఫలితాలు పరిశీలిస్తే... ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లతో సమానంగా ఎంజేపీ బీసీ స్కూళ్ల అత్యుత్తమ ఫలితాలు సాధించాయి.

# కుమార్తె ప్రేమ వివాహం చేసుకుందని హత్య చేసిన తండ్రి

## - తండ్రి, కుమారుడిని అరెస్టు చేసిన టుటౌన్ పోలీసులు - వీడిన యాస్మిన్ హత్య మిస్టరీ



తండ్రి, సోదరుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

**చిత్తూరుటౌన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** చిత్తూరు బాలాజీకాలనీలో మృతి చెందిన యాస్మిన్‌ను కన్న తండ్రి, ఆమె సోదరులు కలిసి పరువు హత్య చేశారని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసుల దర్యాప్తులో తేలడంతో బుధవారం యాస్మిన్‌ను హత్య చేసిన ఆమె తండ్రి షౌకత్‌ఆలీ(56), షౌకత్ ఆలీ భార్య అక్క కుమారుడు మహ్మద్‌భాష అలియాస్ అబ్దుల్(29)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో నిందితుడు అబుల్ కలాం పరారీలో వున్నాడు. బాలాజీకాలనీలో ఈ నెల 13వ తేదీన తన కుమార్తె ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఆమె తండ్రి షౌకత్‌ఆలీ టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలిసి అక్కడికి వెళ్ళిన పోలీసులకు నిజంగా ఆమె ఉరి వేసుకుని మృతి చెందినట్లుగా వుండటంతో పోలీసులు అనుమానస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చిత్తూరు బాలాజీ కాలనీలో ఎస్.ముంతాజ్, షౌకత్‌ఆలీ దంపతులు నివాసం వుంటున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. వీరిలో ఇద్దరు కుమార్తెలకు వివాహం అయ్యింది. యాస్మిన్ చిన్న కుమార్తె. ఈమె ఎస్వీసెట్ కళాశాలలో ఎంబిఎ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు చేసుకుంటూ ఇంట్లో వుండేది. ఈ క్రమంలో యాస్మిన్ తల్లిదండ్రులు చిన్న కుమార్తెకు వివాహం చేయాలని చిత్తూరు రామ్‌నగర్ కాలనీలో నివాసం వుంటున్న షరీఫ్ అనే వ్యక్తిని ఎంచుకుని పెళ్ళి ముహుర్తం నిర్ణయించారు. ఈ మేరకు ఫిబ్రవరి 9వ తేదీ వివాహం జరగాల్సి వుంది. అయితే యాస్మిన్ తాను చదివే కళాశాలలో పరిచయం అయిన పూతలపట్టు మండలం పోటుకనుమ గ్రామంకు చెందిన సాయితేజ్‌ను ప్రేమించడంతో ఇంట్లో ఎవ్వరికి తెలియకుండా ఫిబ్రవరి 6వ తేదీ పారిపోయింది. ఈ మేరకు వెళ్ళిన యాస్మిన్ సాయితేజను కలిసి పెళ్ళి చేసుకుంది. తన కుమార్తె ప్రేమ పెళ్ళి నచ్చని యాస్మిన్ తండ్రి షౌకత్‌ఆలీ కుమార్తెను చంపాలని పక్కాగా ప్లాన్ చేశాడు. తన భార్యకు సోదరి కుమారులైన మహ్మద్ భాషా అలియాస్ లాలు, అబ్దుల్‌తో కలిసి యాస్మిన్‌తో మాట్లాడాలి అని చెప్పి ఈ నెల 13వ తేదీన చిత్తూరుకు రప్పించారు. చిత్తూరు పిసిఆర్ జూనియర్ కళాశాల వద్ద అద్దెకు తీసుకున్న స్కార్పియో వాహనంలో యాస్మిన్‌ను ఎక్కించుకుని ఇంటికి వెళ్తున్నామని చెప్పి అక్కడికి వెళ్ళకుండా మాపాక్షి క్రాస్ వద్ద బాలాజీ హ్యాచరీస్ సమీపంలో వున్న బీడు పొలాల్లో వాహనంను నిలుపుదల చేసి ఆమెకు ముందుగానే తాము తెచ్చుకున్న నూలు తాడును ఆమె గొంతుకు బిగించి హత్య చేశారు. అనంతరం యాస్మిన్ మృతదేహంను తండ్రి షౌకత్‌ఆలీ తీసుకువచ్చి తన ఇంటి ముందర వరండాలో పడుకోబెట్టి అక్కడ నుండి షౌకత్ ఆలీ, మిగిలిన ఇద్దరు పరారీ అయ్యారు. ఈ మేరకు యాస్మిన్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో పోలీసులు నిందితులైన షౌకత్ ఆలీ, మహ్మద్ భాష అలియాస్ లాలులను అర్బన్ తహసిల్దారు ఎదుట ఎక్స్‌ట్రా జుడీషియల్ కన్ఫెక్షన్ కింద చిత్తూరు టుటౌన్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బుధవారం రిమాండ్‌కు తరించారు.

# సమాజాన్ని జాగృతపరిచే సాహిత్యం రావాలి - సాహితీవేత్తలు

## - ప్రభుత్వ ఉగాది కళారత్న, పురస్కార గ్రహీతలకు 'ఎక్స్' ఆధ్వర్యంలో ఘన సత్కారం



నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీని సన్మానిస్తున్న "ఎక్స్‌రే" సంస్థ ప్రతినిధులు

**విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:**సమకాలీన సమస్యలను ప్రతిబింబిస్తూ సమాజాన్ని జాగృత పరిచే సాహిత్యం రావాలని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు కె లక్ష్మయ్య ఆకాంక్షించారు. మాట్లాడుతూ నేటి తరానికి పఠనాశక్తి తగ్గి ఎలక్ట్రానిక్ పరికరాలపై ఆధార పడటం భాధాకరం అన్నారు. మంగళవారం సాయంత్రంఎక్స్ రే.. సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆద్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా కళారత్న, ఉగాది విశిష్ఠ పురస్కారాలు అందుకున్న పలువురు ప్రముఖులకు అభినందన సభ నిర్వహించారు.ఈ ససభలో ముఖ్యఅతిధిగా విచ్చేసిన కె లక్ష్మయ్య ప్రసంగం కొనసాగిస్తూ సమాజానికి ఉపయుక్తమైన సేవలు అందిస్తున్న కవులు, కళాకారులను గౌరవించడం మన విద్యుక్తధర్మం అన్నారు.. సంస్థ అధ్యక్షులు కొల్లూరి ప్రసంగిస్తూ ప్రతిభ కలవారిని ప్రోత్సహిస్తే వారు మరింత ఉన్నత ప్రమాణాలతో ముందడుగు వేస్తారు అన్నారు.అవార్డు గ్రహీతలంతా తమ ఎక్స్ రే సభ్యులు కావడం సంతోషంగా ఉందన్నారు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సాహిత్యం, కళలకు మంచి ప్రొత్సాహాన్ని అందించడం అభినందనీయమని అన్నారు.వాకర్స్, లయన్స్ నాయకులు రావి కృష్ణారావు మాట్లాడుతూ కవులు మార్గనిర్దేశకులుగా ఉండాలి అన్నారు. సంస్థ కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన వీరు భవిష్యత్ లో మరెన్నో అవార్డు పొందుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు. సభలో శ్రీ విశ్వావసు ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుండి కళారత్న పురస్కారం అందుకున్న అంతర్జాతీయ జానపద గాయకులు దామోదర గణపతి, ఉగాది విశిష్ఠ పురస్కారం అందుకున్న నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ(కలిమికొండ సాంబశివరావు) ,ప్రముఖ కవులు సరికొండ నరసింహ రాజు, బండ్ల మాధవరావు, చలపాక ప్రకాష్, సింహాద్రి వాణి., చిత్రకారులు అరసవల్లి గిరిధర్, శ్రీ దేవి దూపాటిలఅభినందనలను సభలో వక్తలు అభినందించారు.అనంతరం వారందరిని నిర్వహకులుసత్కారించారు.సంస్థ. కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య వందన సమర్పణ చేసారు. సంస్థ ఉపాధ్యక్షులు కందికొండ రవి కిరణ్ పర్యవేక్షించారు.ఈ సమావేశంలో పాల్గొన్న అందరికి ఘంటా ఇందిర స్మృత్యర్థం ప్రముఖ రచయిత విజయ కుమార్ చల్లటి మజ్జిగ అందించారు.

# రూ.కోటి విరాళమిస్తే.. దాతలకు ఏడాదిలో మూడురోజులు సుప్రభాతసేవ, విఐపి బ్రేక్ దర్శనాలు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి కోటి రూపాయలు విరాళాలిచ్చే దాతలకు తిరుమల తిరుపతి దేవస్థానం పలు ప్రయోజనాలు చేకూరుస్తోంది. భారీ మొత్తంలో భూరీగా విరాళాలిచ్చిన దాతలకు జీవితకాలంలో దాతతోబాటు మరో నలుగురికి ప్రతి ఏడాదిలో మూడురోజులు సుప్రభాతసేవ దర్శనాలు, 3మూడురోజులు విఐపి బ్రేక్ దర్శనాలు, నాలుగురోజులపాటు సుపథం ప్రవేశ దర్శనం ద్వారా ఆ దేవదేవుని దర్శనం చేసుకునే వెసలుబాటు కల్పించారు. ఈ ప్రయోజనాలతో బాటు ఒకసారి 10 పెద్ద లడ్డూలు, 20 చిన్నలడ్డూలు, ఒక దుప్పట,రవికె, 10 మహాప్రసాదం ప్యాకెట్లు బహుకరిస్తారు. ఏడాదిలో ఒకసారి దాతలైన భక్తులకు వేద ఆశీర్వచనం వంటి సౌకర్యం పొందవచ్చు. తిరుమలలో 3వేల రూపాయలు అద్దెతో కూడిన వసతి గదుల సదుపాయం మూడురోజులు కల్పిస్తారు. జీవిత కాలంలో దాతకు ఒకసారి ఐదు గ్రాముల బంగారు డాలర్, 50గ్రాముల వెండిడాలర్‌ను తగిన ఆధారాల్నికార్యాలయంలో చూపి పొందవచ్చు. మదినిండా దేవదేవుని దర్శనం: ఒక్కసారి గోవింద..గోవిందా... నామంతో మనస్ఫూర్తిగా ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని మదిలో తలచుకుని మొక్కుకుంటే తమ కష్టాలు తీరిపోతాయని హిందూ భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆనందనిలయంలో కొలువైనా వేంకటేశ్వరస్వామిని ఎన్నిసార్లు దర్శనం చేసుకున్నా మళ్ళీ మళ్ళీ ఆ దివ్యమంగళరూపాన్ని చూడాలనే తాపత్రయం భక్తులకు కలుగుతుంది.సామాన్యభక్తులు ఆ దేవుని క్షణకాల దర్శనం కోసం పరితపిస్తుంటే ధనవంతులైన ,కోటీశ్వరులైన భక్తులకు, దాతలకు తిరుమల తిరుపతి దేవస్థానం బహుళప్రయోజనాలు చేకూరుస్తోంది. గతంలో కోటి రూపాయలు,1.50కోట్ల రూపాయలు దాతలు విరాళమిస్తే వారికి ఏడాదిలో ఆరుమందికి ఉదయాస్తమాన సేవదర్శనం టిక్కెట్ (తెల్లవారూజామున సుప్రభాతం నుండి సాయంత్రం సహస్రదీపాలంకారసేవ వరకు) ఆలయం లోపల కులశేఖరపడివద్ద నుండి వేంకటేశ్వరస్వామి కొలువైన ముందుకు వెళ్ళి తనివితీరా దర్శనం చేసుకునే వెసలుబాటు కల్పించింది. అంతేగాక ఆ భక్తులకు సుప్రభాతం, తోమాల, అర్చన సేవలు కొందరు గృహస్థభక్తులు, విఐపి బ్రేక్‌కు మరికొందరు గృహస్థభక్తులను దాత తీసుకెళ్ళే ప్రయోజనం ఉండేది. ఆ విరాళాల్లో కొంత మార్పుచేసి కోటి రూపాయలు విరాళమిస్తే ఆ దాతలకు ఏడాదిలో మరిన్ని ప్రయోజనాలు, దేవుని దర్శనం,వసతి,ప్రసాదాలు అందించే దిశగా కార్యాచరణ రూపొందించి అమలుచేస్తారు. తిరుమలలో ప్రత్యేక ఉత్సవాలు జరిగే రోజుల్లో మినహాయించి మిగిలిన రోజుల్లో కోటి విరాళమిచ్చిన భక్తులు తమకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకునే వెసలు బాటు కల్పించారు. -రూ.కోటి విరాళాలివ్వాల్సిన పథకాలు: దాతలు కోటిరూపాయలు విరాళాలివ్వాల్సిన టిటిడి ట్రస్టులలో కాటేజీ డొనేషన్ స్కీం, ఎస్వీప్రాణదానట్రస్ట్, ఎస్వీ విద్యాదనట్రస్ట్, బర్డ్ ట్రస్ట్, ఎస్వీ అన్నదానట్రస్ట్, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్, ఎస్వీ సర్వశ్రేయాస్‌ట్రస్ట్, ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్, శ్రీవాణి ట్రస్ట్, ఎస్వీబిసిట్రస్ట్, బాలాజీఆరోగ్యవరప్రసాదిని స్కీమ్‌లకుదాతలు విరాళాలు చెల్లించి సౌకర్యాలను పొందవచ్చని టిటిడి తెలిపింది. దాతలు టిటిడి వెబ్‌సైట్"డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.టిటిదేవస్థానమ్స్.ఎపి.జివోవి,ఇన్"లో ఆన్‌లైన్ ద్వారా విరాళాలు చెల్లించవచ్చు. ఆఫ్‌లైన్‌లో దాతలు విరాళాలను ఇఒ టిటిడి పేరున డిడి,చెక్‌లను తిరుమలలోని దాతల విభాగంలో (డోనార్‌సెల్)అంద జేయవచ్చు.

# జమ్ముకశ్మీర్‌లో ఉగ్రమూకల దుశ్చర్య అమానవీయం: మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:** .ఈ ఘటనలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంపై సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఘటనను తీవ్రంగా ఖండించారుకాశ్మీరులో ఉగ్రదాడిలో మరణించిన చంద్రమౌళి, మధుసూదన్‌ల చిత్రపటాలకు మంత్రి దుర్గేష్‌నివాళి అర్పించారు.మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి మంత్రి తెలిపారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిని రాష్ట్ర పర్యాటక, .ఉగ్రమూకలు విచక్షణారహితంగా కాల్పులు జరిపిన ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన విశాఖకు చెందిన జె.ఎస్. చంద్రమౌళి, కావలికి చెందిన మధుసూదన్ కుటుంబాలకు మంత్రి దుర్గేష్ ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేసారు.మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఇది హృదయ విదారకమైన, హేయమైన, అమానుషమైన చర్యగా మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

# విఆర్‌ఓల సమస్యలు పరిష్కరిస్తాం: గ్రామవార్డు సచివాలయ శాఖ డైరెక్టర్ శివప్రసాద్

**విజయవాడ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** విఆర్‌ఓల సమస్యలను పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తామని రాష్ట్ర గ్రామవార్డు సచివాలయ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ హామీ ఇచ్చారు. ఆయనకు విజయవాడలోని ఆయన కార్యాలయంలో రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు నేతృత్వంలో సంఘ నేతలంతా కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భూపతిరాజు మాట్లాడుతూ క్లస్టర్ విధానంలో రెండు సచివాలయాలకు ఒక విఆర్‌ఓ వుంటే ఇబ్బంది అవుతుందని, సచివాలయ రేషనైలేజేషన్ విషయంలో విఆర్‌ఓలను డిస్టర్బ్ చేయొద్దని, లైన్ డిపార్ట్‌మెంట్ రెవెన్యూలోనే గ్రేడ్1, 2, విఆర్‌ఓలకు డిడివోలుగా తహసీల్దార్లు వుండేలా నిర్ణయం తీసకోవాలని చేసిన వినతికి శివప్రసాద్ స్పందిస్తూ వారి సమ్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ, చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షులు బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చేనేత, జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఆర్.పి. సిసోడియా

**విజయవాడ, ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** సీనియర్ ఐఏఎస్ అధికారి ఆర్.పి. సిసోడియా రాష్ట్ర సచివాలయంలో చేనేత, జౌళి శాఖ (పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విశాల దృష్టి, పరిపూర్ణ పరిపాలనా అనుభవంతో సిసోడియా నేతృత్వంలో శాఖ అభివృద్ధి దిశగా నడిచే అవకాశం ఉందని నేత కార్మికులు ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతలు చేపట్టే ముందు సిసోడియా ఛాంబర్ లో సంప్రదాయ పూజాదికాలు నిర్వహించారు ఈ సందర్భంగా చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి శాఖకు సంబంధించిన ప్రాధాన్య విషయాలు, అమలులో ఉన్న పథకాలు, భవిష్యత్తు కార్యాచరణల పై సిసోడియాకు సమగ్ర వివరాలు అందించారు. చర్చల సందర్భంగా చేతివృత్తుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల ఆధునీకీకరణ, జాతీయఅంతర్జాతీయ విపణుల్లో చేనేత వస్త్రాలకు ప్రాధాన్యం కల్పించడం వంటి కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి సీఈఓ వీఆర్ విజయరాఘవ నాయక్, చేనేత, జౌళి శాఖ అదనపు డైరెక్టర్లు మురళీకృష్ణ, శ్రీకాంత్ ప్రభాకర్, సంయుక్త డైరెక్టర్లు కన్న బాబు, రాజారావు, ఆప్కో జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, అకౌంట్స్ ఆఫీసర్ పార్వతి పాల్గొన్నారు. ఈ సమావేశం ద్వారా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా నేతృత్వంలో చేనేత జౌళి శాఖ మరింత చురుకుగా ప్రభుత్వ లక్ష్యాలసాధనకు సన్నద్ధమైంది.

# యుపిఎస్సీ విజేతలకు పవన్‌కళ్యాణ్ అభినందనలు

**విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:**యూపీఎస్‌సీ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు పలువురు విజేతలుగా నిలవడం సంతోషదాయకమని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అన్నారు. 11వ ర్యాంకుతో ఇ.సాయిశివాని,15వ ర్యాంకుతో బి.వెంకటేశ్ తొలి 20 మందిలో నిలవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. పిఠాపురం పట్టణానికి చెందిన చక్కా స్నేహిత్ 94వ ర్యాంకు సాధించడం ముదావహమన్నారు. విజేతలందరికీ ఒక ప్రకటనలో ఆయన అభినందనలు తెలిపారు. సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ప్రజలే దేవుళ్ల అనే సూత్రాన్ని పాటించాలన్న ప్రధాని మోడీ మాటలను గుర్తుంచుకోవాలని విజేతలకు పవన్‌కళ్యాణ్ సూచించారు.

# మద్యం అమ్మకాలకు వ్యక్తిగత గరిష్ట పరిధి ఉండేలా చేయాలంటూ హైకోర్టులో పిల్

**విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం అమ్మకాలకు వ్యక్తిగత గరిష్ట పరిధి ఉండేలా చేయాలంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఒక నెలలో గరిష్టంగా విక్రయించే మద్యం బాటిళ్ల అమ్మకాలకు పరిమితిని విధించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని, మద్యం విక్రయాలన్నింటినీ ఆధార్‌తో అనుసంధానం చేసేలా ఉత్తర్వులివ్వాలని పిల్‌లో కోరారు. ఈ మేరకు విశాఖపట్నంకు చెందిన వైద్యులు డాక్టర్ షిరిన్ రహ్మన్ పిల్ వేశారు. మద్యాన్ని 21 ఏళ్ల లోపు వారు కొనుగోలు చేయకుండా నియంత్రించాలన్నారు. సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వశాఖ మార్గదర్శకాల మేర జిల్లా, రాష్ట్ర స్థాయి నషా ముక్తి కమిటీలను ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇందులో ఎక్సైజ్‌శాఖ కార్యదర్శి, కమిషన్, వైద్యారోగ్యశాఖ కార్యదర్శిని ప్రతివాదులుగా చేశారు.రిటైర్డు అటవీశాఖ అధికారి మూర్తి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించొద్దు హైకోర్టు ఆదేశం సీనియర్ ఐఎస్ ఆర్‌పి సిసోడియా ఒఎస్‌ఓగా పనిచేసిన రిటైర్డు అటవీశాఖ అధికారి ఎంవివిఎస్‌ఎన్ మూర్తి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించరాదని, ఈ విషయంలో జోక్యం చేసుకోరాదని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఇంటెలిజెన్స్ అధికారులకిచ్చిన వాంగ్మూలాన్ని ఉపసంహరించు కోవాలని మూర్తిని ఒత్తిడి చేయొద్దని చెప్పింది. ఈ మేరకు విజయవాడ డిప్యూటీ పోలీస్ కమిషనర్, మాచవరం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒలను ఆదేశిస్తూ జస్టిస్ హరినాథ్ ఆదేశాలిచ్చారు. సిసోడియా సూచనల మేరకు ఆయన మనుషులు తనను కిడ్నాప్ చేశారని, దీనిపై విజయవాడ డిప్యూటీ పోలీస్ కమిషనర్, మాచవరం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒలకు తానిచ్చిన వాంగ్మూలాన్ని వాపస్ తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారంటూ మూర్తి పిటిషన్ వేశారు. గత ఫిబ్రవరి 27న సిసోడియా మనుషులు తనను కిడ్నాప్ చేశారన్నారు. దీనిపై హైకోర్టు పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది.

# అమరావతిలో హరిత ప్రాజెక్టుల అభివృద్ధికి ఆరావళి బయోడైవర్సిటీ సహకారం

**విజయవాడ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాజధానిలో హరిత ప్రాజెక్టుల అభివృద్ధికి ఆరావళి బయో డైవర్సిటీ ఆమోదం తెలిపింది. బుధవారం అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడిసి) సిఎండి డి లక్ష్మి పార్థసారధి ఢిల్లీలోని యమునా బయో డైవర్సిటీ పార్కు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరావళి బయో డైవర్సిటీ పార్కులను స్థాపించిన ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ సిఆర్ బాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు అభివృద్ధి చేసిన ఉద్యానవనాలను పరిశీలించారు.

బయోడైవర్సిటీ పార్కుల అభివృద్ధిలో బాబు వారి బృందం చేపట్టిన విధానాలను ఏడిసి ప్రతినిథులకు వివరించారు.

ఈ సందర్భంగా సిఎండి లక్ష్మి పార్థసారధి తీపి నారింజ మొక్కను నాటారు. ఈ పర్యటనలో ఏడిసి హార్టికల్చర్ విభాగాధిపతి విఎస్ ధర్మజ వున్నారు.

# మే 6న గంగమ్మజాతరకు చాటింపు

**తిరుపతి,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మికనగరం తిరుపతి గ్రామదేవతగా కొలువై పూజలందుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మ ఆలయ జాతర వారంరోజులుపాటు జరుగుతుంది. రాయలసీమజిల్లాల్లోనేగాక తెలుగురాష్ట్రాల్లో ఎక్కడా అమ్మవారి జాతరలు వారం రోజులు నిర్వహించరు. తిరుపతి తాతయ్యగుంటగంగమ్మ జాతర వేడుకలు వారంరోజులు పాటు భక్తితో అంగరంగ వైభవంగా జరిపించడం ఆనవాయితీ. రానున్న మేనెలలో 6వతేదీ మంగళవారం రాత్రి తిరుపతి రూరల్ అవిలాల నుండి సారెతో ఆలయ పూజారులు వచ్చి నగరంలో చాటింపు వేస్తారు. ఇక మరుసటిరోజు మేనెల 7వతేదీ బుధవారం నుండి 13వతేదీ మంగళవారం వరకు వివిధ రకాల అలంకరణల్లో గంగమ్మ దర్శనమిస్తుంది. తిరుపతి తిరుమల పరిసరాల్లోనే భక్తులేగాక తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి భక్తులు భారీగా వస్తారు. ఒక్కోరోజు ఒక్కోరక వేషధారణలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. మేనెల 7వతేదీ తొలివేషంగా బైరాగివేషం, 8వతేదీ బండవేషం,9న తోటివేషం, 10న దొరవేషం, 11న మాతంగివేషం, 12న సున్నపుకుండలు 13వతేదీ మంగళవారం అమ్మవారి జాతర, అర్ధరాత్రి అమ్మవారి విశ్వరూపం చెంపనరకడంతో జాతర పరిసమాప్తమవుతుంది. ఈ జాతర వేడుకలకు టిటిడి, తుడ, నగరపాలకసంస్థ సహకారం అందిస్తారు.

# ఇక నుండి తరచుగా ఆకస్మిక తనిఖీలు : ఏడిసిపి గుణ్ణం రామకృష్ణ

-పత్రాలు లేని 50 వాహనాల సీజ్ -అదుపులోకి 5 గురు అనుమానితులు

విజయవాడ క్రైం,ఏప్రిల్ 23,ప్రభాతవార్త: ఇక నుండి తరచుగా కార్డన్ సెర్చ్‌తో పాటు ఆకస్మిక తనిఖీలు,వాహన తనిఖీలు,డ్రంక్ అండ్ డ్రైవ్



కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని ఏడిసిపి గుణ్ణం రామకృష్ణ పేర్కొనా న్నరు. ఎన్టీఆర్ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా,సంఘ వ్యతిరేక శక్తులు,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు,సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేసే వారిని గుర్తించే దిశగా ప్రజలకు మేమున్నామని భరోసా ఇచ్చేందుకు సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఇన్‌చార్జి డిసిపి గుణ్ణం రామకృష్ణ,పశ్చిమ ఎసిపి దుర్గారావు, పశ్చిమ జోన్ సిఐలు చిన్న కొండలరావు, గురుప్రకాష్ ,చంద్రశేఖర్, ఉమామహేశ్వరరావు కృష్ణ మోహన్,శ్రీలక్ష్మీ నారాయణలు వారి సిబ్బందితో మొత్తం 103 మంది అధిరారులు,సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ లోని పశ్చిమ డివిజన్,టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి లోని వైఎస్ఆర్ కాలనీ పరిసర ప్రాంతాల్లో బుధవారం తెల్లవారుజామున 5 గంటల నుండి 8 గంటల వరకు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 350 వాహనాలను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని 50 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. 640 ప్లాట్లను తనిఖీ చేసి ఐరిస్ వాహనం ద్వారా 128 మందిని తనిఖీ చేసి 5 గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.ఈ సంద్భంగా ఎడిసిపి గుణ్ణం రామకృష్ణ మాట్లాడుతూ సిపి ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతాయని గుర్తించబడిన పరిసర ప్రాంతాల్లో అణువణువు క్షుణ్ణంగా సోదాలు చేసామన్నారు. గంజాయి,ఇతర మత్తు పదార్థాల విక్రయాలు,వినియోగంపై అనుమానం ఉన్న వ్యక్తులపై ఆరా తీసామని, శాంతి భద్రతలకు భంగం కల్గించే అసాంఘిక శక్తులపై పూర్తి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాత్రి సమయాల్లో చిన్న చిన్న సంఘటనలు,పెద్ద సంఘటనలుగా ప్రజల్లో వ్యాప్తి చెందుతున్నాయని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి ప్రతిరోజు అన్ని ముఖ్య ప్రదేశాల్లో కార్డన్ అండ్ సెర్చ్,ఆకస్మిక తనిఖీలు,వాహన తనిఖీలు,డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి ఘర్షణలకు అస్కారం లేకుండా,అసత్య ప్రచారాలను నియంత్రించేలా పోలీసులు చర్యలు తీసుకోవడం జరుగుతుందన న్నారు. ఇక నుండి తరచుగా కార్డన్ సెర్చ్ నిర్వహించడంతో పాటు అన్ని ప్రాంతాల్లో తనిఖీలు డ్రంక్ అండ్ డ్రైవ్ జరుగుతాయన్నారు. నేరాలు,ఘర్షణలు,నియంత్రణకు పూర్తి స్థాయిలో అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# 598 మార్కులు సాధించిన ఒప్పిచర్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని పావనిచంద్రిక

- అభినందించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



**మాచర్లటౌన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** పది ఫలితాల్లో ఒప్పిచర్ల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అంగడి పావని చంద్రిక 598 మార్కులతో సత్తా చాటించింది. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల ఫలితాల్లో మొదటిస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్‌కు ధీటుగా పోటీ పడుదూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదిలో సత్తాచాటడం మంత్రి లోకేష్ నిబద్ధతకు నిదర్శనమన్నారు. పావని చంత్రిక తండ్రికి నేరుగా ఫోన్ చేసి విద్యార్థికి అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచడం మాచర్ల నియోజకవర్గానికేకాక పలనాడుకే గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థిని పావనిచంద్రికకు, పాఠశాల ఉపాధ్యాయులకు ఒప్పిచర్ల తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి, మాజీ వైస్ ఎంపీపీ పంగులూరి పుల్లయ్య, గ్రామ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

# ఉగ్రదాడికి పాల్పడిన వారిని సహించేది లేదు

-భాజపా గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు

**గుంటూరుతూర్పు,ఏప్రిల్23,ప్రభాతవార్త:** కాశ్మీర్ అభివృద్ధి ఆపటం ఎవరితరం కాదు. ఉగ్రదాడికి పాల్పడినటువంటి వారిని సహించేది లేదని బిజెపి గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు అన్నారు.



బుధవారం కాశ్మీర్లో అమాయక ప్రజల పైన జరిగినటువంటి అమానుషమైన దాడికి నిరసనగా స్టానిక లాడ్జి సెంటర్ నుంచి శంకర్ విలాస్ వరకు కొవ్వొతుల ర్యాలీని గుంటూరు జిల్లా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించి వారి ఆత్మకు శాంతి జరగాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ కాశ్మీర్లో జరిగిన ఉగ్రవాదదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సంఘటన భారతదేశ చరిత్రలో ఒక చీకటి రోజుగా నిలిచిందని, ఈ సంఘటనలో ప్రాణాలు కోల్పోయినటువంటి వారి కుటుంబ సభ్యులకూ భారతీయ జనతాపార్టీ అండగా నిలుస్తుందని, ఈ దాడికి పాల్పడినటువంటి వారిపై ఊహించలేని స్థాయిలో ప్రతిదాడి చేయడానికి భారత సైన్యం సిద్ధంగా ఉందని దానికి కావాల్సిన వ్యూహరచన జరుగుతుంది అని అన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం నూతన కార్యాచరణలను రూపొందిస్తది అని అన్నారు.

బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ సరిహద్దు ప్రాయోజిత ఉగ్రవాదులు పహల్గామ్‌లో అమాయక పౌరులపై జరిపిన క్రూరమైన, నీచమైన దాడిలో విషాదకరంగా ప్రాణాలు కోల్పోయిన అమాయక పౌరుల జ్ఞాపకాలను మేము గౌరవిస్తున్నాము వారి కుటుంబాలకు మా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాము. ఈ పిరికి ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా కాశ్మీర్ లోయ ప్రజలలో కోపం, ద్వేషాన్ని మనం మీడియాలో చూశాము. లోయ శాంతి, అభివృద్ధి మరియు శ్రేయస్సు మార్గంలో ఉందని ఇది స్పష్టంగా చూపిస్తుంది. దేశ అంతర్గత భద్రత బలపడింది. అందుకే ఉగ్రవాదులు మరియు వారి ఖిఅక్కఖి ఇప్పుడు నిరాశకు గురయ్యారు. ఈ సమయంలో, మనం కలిసి రావాలి. బాధిత కుటుంబాలకు అండగా నిలిచి వారికి గౌరవం చూపాలి. ఈ విషయంలో రాజకీయాలకు చోటు ఉండకూడదు.బిజెపి సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా జమ్ము కాశ్మీర్ అభివృద్ధి ధ్యేయంగా యావత్ భారతదేశం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమినేని చంద్రశేఖర్, ఈదర శ్రీనివాసరెడ్డి, చరక కుమార్ గౌడ్, డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, నేరళ్ళ మాధవరావు, మంత్రి సుగుణ, ఏలూరి లక్షి ్మ, మేరీ సరోజినీ, బొల్లా ప్రగడ శ్రీదేవి, వాణి వెంకట్, కోలా రేణుకాదేవి, గాయత్రి, రాజేష్ నాయుడు, దార అంబేద్కర్, దర్శనపు శ్రీనివాస్, కంతేటి బ్రమ్మయ్య, బజరంగ్ రామకృష్ణ,, దుర్గా ప్రసాద్, రామచంద్రరావు, తూనుగుంట్ల రాజేష్, మల్లాల లక్ష ్మణ్, కామేపల్లి వెంకటేశ్వర్లు, మోతే శేషగిరి, పోతురాజు వెంకటేశ్వర్లు, తానుచింతల అనిల్, సాధు రామకృష్ణ, షేక్ బిలాల్, శ్రీను నాయక్, పద్మనాభం, రాజా అజయ్ కృష్ణ, షేక్ సాంబశివరావు, సురేష్ జైన్, కృష్ణ చైతన్య, పేరుమళ్ల పద్మనాభం, వక్కలగడ్డ తిరుమలరావు సాంబమూర్తి, నాగసాయి, కారం శెట్టి రమేష్, చంద్రశేఖర్, తాడువాయి రామకృష్ణ, సాంబయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

# వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

**తెనాలి, ఏఫ్రియల్ 23 (ప్రభాతవార్త) :** పట్టణంలోని రావి రవీంద్రనాథ్ నగర్‌లో గల ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ వసతి గృహ బాలికల పాఠశాల యందు ఈనెల 25వ తేదిన ప్రపంచ మలేరియా దినోత్సవంపై వ్యాసరచన, మరియు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం మాట్లాడుతూ



2027నాటికి మలేరియా కేసుల సంఖ్య జీరోకి రావాలని, 2030నాటికి మలేరియా రహిత భారతదేశం సాధించాలని ప్రభుత్వ లక్ష్యంగా నిర్ధేశించిందని, ప్రజలు దీనిపై పూర్తిగా అవగాహన కలిగించుట ద్వారానే ఇది సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన ప్రథమ బహుమతి హారిక, ద్వితీయ బహుమతి శ్రావణి, తృతీయ బహుమతి లక్ష్మీప్రసన్న కైవసం చేసుకోగా చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ బహుమతి దుర్గాభవాని, ద్వితీయ బహుమతి స్వాతి, తృతీయ బహుమతి కావ్యశ్రీ కైవసం చేసుకోగా జిల్లా మలేరియా అధికారి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బండి విజయ్‌కుమార్, ఉపాధ్యాయునిలు బి.నాగమణి, టీవీఎస్ నాగలక్ష్మీ, తెనాలి ఇన్‌చార్జి సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, పట్టణ యూనిట్ అధికారి శ్రీకంత ఉమాకాంత్, సదాశివ గణేష్, ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, మలేరియా సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, దాసరి శివ నాగమల్లేశ్వరరావు, ఫైలేరియా జూనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ తిరువీధుల శివరామప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ సయ్యద్ కరిముల్లా, దీపాల శ్రీనివాసరావు, ఆలా వేణుగోపాల్, సంకాశరత్‌బాబు, షేక్ నవీద్, ఏఎన్ఎం రాజ్యం, ఆశా కార్యకర్త యశోద తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాలలో 598 మార్కులతో సత్తా చాటిన విద్యార్థిని హాసినికి ఎమ్మెల్యే నసీర్ అభినందనలు

**గుంటూరుతూర్పు,ఏప్రిల్23,ప్రభాతవార్త :** పదోవ తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించిన పల్లపోతు హాసినిని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అభినందించారు. బుధవారం



విడుదలైన పదోవ తరగతి ఫలితాల్లో 598 మార్కులతో హాసిని సత్తా చాటింది. ఈ సందర్భంగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో విద్యార్థిని హాసినిని ఎమ్మెల్యే అభినందించారు. హాసిని పదోవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటి గుంటూరు తూర్పు నియోజకవర్గానికి ఖ్యాతి తీసుకొచ్చిందని ఎమ్మెల్యే నసీర్ కొనియాడారు. ఈ సందర్భంగా ఆమె చదువులకు ఎలాంటి సాయం కావాలన్నా అందిస్తానని భరోసా ఇచ్చారు.

# పది ఫలితాల్లో ఒప్పిచర్ల విద్యార్థినికి స్టేట్ ర్యాంకు

– అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే జూలకంటి

**కారంపూడి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండలంలోని ఒప్పిచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని అంగడి పావని చంద్రిక స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. మార్చి నెలలో జరిగిన పరీక్షల్లో మండలంలో 684 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరుకాగా 561 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. చినగార్లపాడు జడ్పీ హైస్కూలు నుంచి 26 మంది, మిరియాల జడ్పీ స్కూల్ నుంచి 27 మంది, పెదకొదమగుండ్ల జడ్పీ స్కూల్ నుంచి 63, కారంపూడి జడ్పీ స్కూల్ నుంచి 111, ఒప్పిచర్ల జడ్పీ స్కూల్ 45 మంది, బీఆర్ అంబేద్కర్ గురుకులం 63, కస్తూరిబా గాంధీ పాఠశాల 38, మోడల్ స్కూల్ 80, ఏపీటీడబ్ల్యూఎస్ బాలుర పాఠశాల 23, ఏపీటీడబ్ల్యూఎస్ బాలికలు 16, ప్రభుత్వ గుర్తింపు పొందిన అక్షర ఇంగ్లీష్ మీడియం 3, సెయింట్ జాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 51, వివేకానంద 16, రెయిన్‌బో 90, దివ్యసాయి 32 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా ఒప్పిచర్ల జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థిని 500 మార్కులకు 598 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల ఫలితాల్లో స్టేట్ ర్యాంకుల పట్టికలో నిలిచింది. ప్రభుత్వ పాఠశాలలు వేగంగా పునరుజ్జీవం పోసుకుంటున్నాయని కూటమి ప్రనభుత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో కారంపూడి మండలం ఒప్పిచర్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని పావని చంద్రిక సత్తా చాటడం హర్షణీయమని శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా పోటీ పడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతిలో సత్తా చాటడం నిదర్శనమని అన్నారు. పావని చంద్రిక తండ్రికి ఫోన్ చేసి విద్యార్థినిని అభినందించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచడం పల్నాడుకే గర్వకారణమని అన్నారు. విద్యార్థిని పావని చంత్రికను కూటమి నేతలు అధికారులు అభినందించారు. కారంపూడి బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి కె.కావ్య 591 మార్కులు, బీఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థి సీహెచ్ షాలెం 529 మార్కులు సాధించారు.

# జల జీవన్ మిషన్ ద్వార రూ.25 లక్షలతో కుళాయి కనెక్షన్లు

**బాపట్ల,ఏప్రిల్23,ప్రభాతవార్త:** చిన్న కొత్త గొల్లపాలెం గ్రామంలో జల జీవన్ మిషన్ కింద రూ.25 లక్షలతో కుళాయి కనెక్షన్లు ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఇచ్చిన హామీల అమలుపై జిల్లా అధికారులతో బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించడానికి జల జీవన్ మిషన్ కింద పనులు మంజూరు చేశామని కలెక్టర్ చెప్పారు. తద్వారా సురక్షితమైన తాగునీరు ఆ గ్రామ ప్రజలకు అందుతుందన్నారు. 9 కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్ల మంజూరు ప్రక్రియ వారంలో ముగుస్తుందన్నారు. గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రూ. ఒక కోటి నిధులు మంజూరు చేశామన్నారు. డి ఎం ఎఫ్ కింద రహదారుల నిర్మాణానికి మరో రూ.3.15 కోట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఎనిమిది మందికి బిసి కార్పొరేషన్ రుణాలు మంజూరు చేశామన్నారు. 249 ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఐదు మండలాలలో అంబేద్కర్ భవనాలకు స్థలం కేటాయింపులు జరిగాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలి

-మార్కెట్ యార్డ్ చైర్మన్ జవాద్ కిరణ్

**మంగళగిరి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ చైర్మన్ సభ్యులు తమ వంతుగా కృషిచేసి మరింత అభివృద్ధి చేయాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ జవాద్ కిరణ్ కోరారు. మంగళగిరి నగరంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం పాలకమండలి ప్రమాణస్వీకారం బుధవారం ఆలయ ప్రాంగణంలో వేడుకగా నిర్వహించారు. కమిటీ చైర్మన్ గా భోగి కోటేశ్వరరావు సహా 8మంది కమిటీ సభ్యులు, ఎక్స్ ఆఫీషియా సభ్యులుగా ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ కుమార్ శర్మలు ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత నగరంలో ర్యాలీ నిర్వహించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.ఈ కార్యక్రమం లో మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ పాల్గొని నూతన కమిటీ చైర్మన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



# సీనియర్ సిటిజన్స్‌కు సాయికృష్ణ మల్టీస్పెషాల్టీ వైద్యశాల ఉచిత వైద్య శిబిరం

నరసరావుపేట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : సాయికృష్ణ మల్టీస్పెషాల్టీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పెన్షనర్స్, సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన



సదస్సు,ఉచిత వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో వైద్యశాల చైర్మన్ డాక్టర్ సింగరాజు సాయికృష్ణ,డాక్టర్ సింగరాజు విద్యలు శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి అవసరమైన వైద్య సలహాలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణి చేసారు. తమ వైద్యశాలలో సీనియర్ సిటీజన్స్‌కు ప్రాధన్యత ఇచ్చి వారికి వైద్య సేవలలో రాయితీ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా బిపి, షుగర్, థైరాయిడ్, విష జ్వరాలు, మలేరియా, టైపాయిడ్, డెంగ్యూ, పాముకాటు, పురుగుమందు కేసులు, లివర్ సంబంధించిన వ్యాధులు, ఆయాసం, నెమ్ము, ఉబ్బసం, దగ్గు, కాళ్ళవాపులు, శ్వాసకోస సంబంధింత వ్యాధులతో పాటు జనరల్ వ్యాధులకువైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. తమ వైద్యశాలలో అత్యాధునిక వసతులతో కూడిన ఐసీయూ, క్రిటికల్ కేర్, ల్యాబ్, అందుబాటులో ఉన్నాయని డాక్టర్ సింగరాజు సాయికృష్ణ తెలిపారు.

# టెన్త్‌లో కెజిబివి ప్రభంజనం

- 525 మార్కులతో ఎం వర్షిత మండల ఫస్ట్

**ఎ కొండూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ (కెజిబివి) టెన్స్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ కెజిబివిలో మాలాజి వర్షిత 525, శీలం శ్రీజా 506, మాలాజి అనురాధ 503 మార్కులు, మాలాజి వర్షిత 525 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానంలో నిలిచింది ఈ ఏడాది ఈ పది



పలితాల్లో ఈ విధంగా విద్యార్థినులు ప్రభంజనం సాధించడానికి ప్రిన్సిపాల్ ఎస్‌కె మీరుసా బేగం కృషిని విద్యార్థినుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ సందర్భంగా ఈ కెజిబివిలో పదిలో ప్రభంజనంగా సృష్టించగా ఇంటర్‌లో మాత్రం ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం ఇంటర్ విద్య సంవత్సరం ఆఖరులో ప్రిన్సిపాల్ మీరున్నీసా బేగంను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేయడం వల్ల ఇంటర్ విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడం అభినందనీయం

-వేమూరు సిఐ వీరాంజనేయ

**కొల్లూరు, ఏఫ్రియల్ 23 (ప్రభాతవార్త) :** గ్రామీణ ప్రాంతాల్లో ఫోర్ ఫ్రంట్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కొల్లూరులో ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడం అభినందనీయమని వేమూరు సిఐ వీరాంజనేయ అన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రమైన కొల్లూరులోని ఫోర్ ఫ్రంట్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో జరిగిన స్కూల్ యూనివర్సరీ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమూరు సిఐ వీరాంజనేయులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఏర్పాటు చేసిన స్కూల్ డైరెక్టర్ నవీనపాల్‌ను ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు స్కూల్ ప్రిన్సిపాల్ అనిత కుమారి రాజన్ అత్యక్షత వహించారు. కొల్లూరు స్టేట్ బ్యాంక్ మేనేజర్ రమేష్ మాట్లాడుతూ ఇంగ్లీష్ మీడియం విద్యతో పాటు కరాటే, డాన్స్‌లు నందు విద్యార్థులకు శిక్షణ ఇప్పించడం ఎంత ఉపయోగం ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వేమూరు సిఐ వీరాంజనేయ, కొల్లూరు స్టేట్ బ్యాంక్ మేనేజర్ రమేష్, స్కూల్ డైరెక్టర్ తెనాలి నవీన్‌పాల్, ప్రిన్సిపాల్ అనితకుమారి రాజన్‌లు వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థి చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

# 28న మునిసిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

**మాచర్ల, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** ఈ నెల 28న మాచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు కమిషనర్ వేణుబాబు బుధవారం తెలిపారు. మాచర్ల మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగే ఈ ఎన్నికకు సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రిసైడింగ్ అధికారి, గురజాల రెవెన్యూ డివవిజనల్ అధికారి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరుగుతుందన్నారు.

# రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ తప్పనిసరి

**మాచర్ల, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** క్రయ విక్రయాలకు స్లాట్ బుకింగ్ తప్పనిసరని మాచర్ల ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ కె.కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం క్రయ విక్రయాలకు స్లాట్ బుకింగ్ తప్పనిసరి అన్నారు. రిజిస్ట్రేషన్‌కు క్రయ విక్రయదారులు స్లాట్ బుకింగ్ అనంతరం ఇరువురి సెల్‌ఫోన్లలో ఓటీపీ తెలిపిన తరువాతే రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 26 నుంచి స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి రానున్నట్లు పేర్కొన్నారు. అవగాహన కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదిచాలన్నారు.

# ఉగ్రదాడిని ఖండించిన విద్యార్థి నాయకులు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఏప్రిల్ 23,ప్రభాతవార్త :** జమ్మూకాశ్మీర్‌లో మంగళవారం జరిగిన మారణహోమంలో 27మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఏఎన్‌యులో విద్యార్థి సంఘ నాయకులు పేర్కొన్నారు.ఈ ఘటన చాలా బాధాకరమని అన్నారు.ఇలాంటిఛ దాడులను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ మేరకు ఏబివిపి విద్యార్థి సంఘం బుధవారం యూనివర్సిటీ లో కొవ్వొత్తుల ర్యాలీ



నిర్వహించింది.విద్యార్థులు పరిశోధకులు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యతను ప్రదర్శించారు.ప్రాణాలు కోల్పోయిన వారికి ఏబివిపి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఇటువంటి ఉగ్రదాడులను నిలువరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్టేట్ సోధ్ కన్వీనర్ రమాకాంత్,స్టేట్ టెక్నికల్ సెల్ కన్వీనర్ మోహనరావు,విశ్వవిద్యాలయ రాష్ట్ర కన్వీనర్ గంగాధర్ స్టేట్ కోకన్వీనర్ శివగణేష్ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు హేమంత్ రామ్‌లు పాల్గొన్నారు.కాగా ఏఐఎస్ఎఫ్ వర్సిటీ అధ్యక్షుడు పాలం నాసరయ్య మాట్లాడుతూ దేశంలో ప్రజలకు శాంతి భద్రతల విషయంలో రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.దీనికి జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన దాడే ఉదాహరణగా పేర్కొన్నారు.

# కార్యకర్తకు కొండంత అండగా ఎమ్మెల్యే నసీర్

-యాక్సిడెంట్ లో చేయి కోల్పోయిన టీడీపీ కార్యకర్త బాలశౌరి. -కార్యకర్తల నిధి ద్వారా రూ.3 లక్షలు మంజూరు చేయించి ఎమ్మెల్యే...

**గుంటూరుతూర్పు,ప్రభాతవార్త :** పతి క్షణం కార్యకర్త కుటుంబానికి భరోసాగా నిలిచిన నసీర్...పార్టీ జెండాను భుజాన మోసిన కార్యకర్త కొండంత కష్టమొస్తే ఎమ్మెల్యే నసీర్ నేనున్నానంటూ గుండెల్లో పెట్టుకుని అండగా నిలిచారు. ఆ కార్యకర్తను తన కుటుంబ సభ్యుడిలా కంటికి రెప్పలా కాపాడారు. ప్రతిపక్షంలో ఉనప్పుడు కార్యకర్తకు ప్రమాదం జరిగితే ప్రతి క్షణం ఆ కుటుంబానికి ఆత్మస్థైర్యం కల్పించిన ఎమ్మెల్యే నసీర్ .. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థిక భరోసా కల్పించి నాయకుడంటే నమ్మకమని నిరూపించారు. గుంటూరు తూర్పు నియోజకర్గానికి చెందిన చల్లా బాలశౌలి 20 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పని చేస్తుర్ను. మొదటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారు. 2023 ఆగస్టు నెలలో చల్లా బౌలశౌరికి యాక్సిడెంట్ కావడంతో ఎడమ చేయి కోల్పోయారు. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఎమ్మెల్యే నసీర్ హాస్పిటల్ వారితో మాట్లాడి బాలశౌరి కుటుంబానికి అండగా నిలిచారు. ఎప్పటికప్పుడు బాలశౌరి యోగక్షేమాలు తెలుసుకుంటూనే ఉన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు వద్దకు బాలశౌరి విషయాన్ని తీసుకెళ్లి కార్యకర్తల సహాయ నిధి కోసం ప్రయత్నించారు. ఈ క్రమంలో బాలశౌరికి రూ.3 లక్షల కార్యకర్తల నిధి మంజూరయ్యాయి. ఈ నగదును బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బాలశౌరికి ఎమ్మెల్యే నసీర్ అందించారు. కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి ఊపిరి అని, వారిని కాపాడుకోవడం మా బాధ్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రతి క్షణం తమ కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచిన ఎమ్మెల్యే నసీర్, ఆర్థిక సాయం అందించిన సీఎం చంద్రబాబు నాయుడుకు బాలశౌరి కృతజ్ఞతలు తెలిపారు.

# కలెక్టరేట్ ఎదుట క్రైస్తవుల రిలే నిరాహార దీక్షలు

-పాల్గొన్న పలు క్రైస్తవ సంఘాలు

**గుంటూరు విద్య,ఏప్రిల్ 23,ప్రభాతవార్త :** స్థానిక కలెక్టరేట్ ఎదుట క్రైస ్తవ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో క్రైస్తవుల రీలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి.50మంది క్రైస్తవ నాయకులు దీక్షలో పాల్గొన్నారు.ఈ



సందర్భంగా ప్రార్థన దీక్షలో డాక్టర్ గోళ్ళమూడి రాజసుందరబాబు మాట్లాడుతూ పాస ్టర్ ప్రవీణ్ పగడాల మరణం హత్యఅని చెప్పడానికి 100రుజువులున్నాయని,ఆయన మరణ విషయంలో ప్రారంభమైన పోలీసు విచారణ మొదటి నుంచి చివరి వరకు ఆయన ప్రమాదవశాత్తు చనిపోయారని తేల్చడం సరైన విచారణ కాదని పేర్కొన్నారు.అది సరైన సమంజసమైన విచారణ కాదని ఆ విచారణ నివేదికను వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడించారు. హైకోర్టు జడ్జి పర్యవేక్షణలో సిబిఐ చేత దర్యాప్తు జరిపించితే నిజాలు వెళ్ళడవుతాయనీ డాక్టర్ రాజసుందర్ బాబు అన్నారు.కొన్ని కోట్ల మంది ప్రజలను పాస్టర్ ప్రవీణ్ తన ప్రసంగాల ద్వారా ఆకర్షితులవుతున్నారనేది ఒక కారణమైతే,16రాష్ట్రాల్లో మతమార్పిడి వ్యతిరేక చట్టానికి వ్యతిరేకంగా ఆయన సుప్రీంకోర్టులో న్యాయపోరాటానికి దిగారని,వాదించడానికి సరిపోయినంత సమాచారాన్ని ఆయన సేకరించి పోరాటానిక సిద్ధమయ్యారని ఇది గమనించిన మతోన్మాదులు ఆయనను మట్టుపెట్టాలని ఒక పథకం ప్రకారం హత్య చేశారని రాజ సుందరబాబు వెల్లడించారు.పాస్టర్ ప్రవీణ్ ది హత్యని తేలితే దేశంలో చాలా పెద్దపెద్ద నాయకుల గొంతుకు చుట్టుకుంటుందని వారిని రక్షించేందుకే ప్రవీణ్ మరణాన్ని ప్రమాదవశాత్తు జరిగినట్లుగా పోలీసులు తేల్చి తప్పుచేసు ్తన్నారని డాక్టర్ గోళ్ళమూడి ఆరోపించారు. నేషనల్ దళిత్ క్రిస్టియన్ వాచ్ రాష్ట్ర అధ్యక్షురాలు గద్దె రత్నశ్రీ,డాక్టర్ గోళ్ళమూడితో పాటు దీక్షలు పాలొ ్నన్న 50మందికి దీక్షా కండువాలు కప్పి దీక్షలను ప్రారంభించారు.గద్దె రత్నశ్రీ మాట్లాడుతూ ఈ దీక్షల కార్యక్రమంలో మహిళలు యువకులు పాస్టర్లు పాల్గొని పోరాటాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.దీక్షా శిబిరం నిర్వాహకులు,క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు మద్దు ప్రేమజ్యోతి బాబు మాట్లాడుతూ అన్ని చర్చీల పాస్టర్లు దీక్షలో పాల్గొని న్యాయపోరాటాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.శిబిరంలో ప్రసంగించిన వారిలో పెంతెకోస్తు ప్రార్థన మందిరం,గుంటూరు జిల్లా క్రైస్తవ నాయకులు ఆరుమళ్ళ మార్కు, ఇద్వావ్యవస్థాపక గౌరవాధ్యక్షులు బడుగు విజయలక్ష్మీ,బీమ్‌సేన్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం,స ృష్టికర్త ప్రార ్ధన మందిరం పాస్టర్ రవిచంద్ర,ఇమ్మానియేల్ ప్రార్థనా మందిరం పాస్టర్ భాగ్యరాజ్,లూథరన్ చర్చి పాస్టర్ సంతోషరావు,ఇద్వా నాయకులు వేల్పూరి మరియరాణి,కోరబండి జోత్స్న, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# మయామీ ఓపెన్‌లో ఒసాకా నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** నాలుగుసార్లు గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్ నవోమి ఒసాకా మాడ్రిడ్ ఓపెన్ తొలి రౌండ్‌లో లూసియా బ్రాంజెట్టి చేతిలో 4-6, 6-2, 4-6 తేడాతో ఓటమి పాలైంది. జపాన్ మాజీ ప్రపంచ నంబర్ 1, 55వ ర్యాంక్‌లో ఉన్న ఈ క్రీడాకారిణి, మొదటి సెట్‌ను కోల్పోయిన తర్వాత బలమైన రెండవ సెట్‌తో తిరిగి పోరాడింది, కానీ చివరికి తన దృఢనిశ్చయంతో ఉన్న ఇటాలియన్ ప్రత్యర్థిపై విజయం సాధించలేకపోయింది. కాగా టెన్నిస్ నుంచి 15 నెలల విరామం తర్వాత ఇంకా ఫామ్‌లో కొనసాగుతున్న ఒసాకా, చివరిసారిగా మార్చిలో మయామి ఓపెన్‌లో ఆడింది, మొదటి సెట్‌లోని నాల్గవ గేమ్‌లో రెండు బ్రేక్ పాయింట్లను సాధించింది, కానీ ఆమె దానిని తిరస్కరించింది. ఒసాకా తీవ్రంగా స్పందించే లోపు బ్రోంజెట్టి ఏడో సర్వ్‌ను బ్రేక్ చేసి దానిని అవుట్ చేసింది. 27 ఏళ్ల ఒసాకా తీవ్రంగా స్పందించేలోపు బ్రోంజెట్టి ఏడో సర్వ్‌ను బ్రేక్ చేసి దానిని అవుట్ చేసింది. ఒసాకా వెంటనే విరామం ఇచ్చింది మరియు ఆటలో తన ఐదవ బ్రేక్ పాయింట్ తీసుకున్నప్పుడు 33 వద్ద సర్వ్‌లో తిరిగి కుస్తీ పట్టినప్పటికీ, వెంటనే ఆమె మళ్ళీ బ్రేక్ అయింది. క్రాస్‌కోర్ట్ షాట్‌ను చేరుకోవడానికి ప్రయత్నించినప్పుడు ఒసాకా జారిపడటంతో బ్రాంజెట్టి విజయం సాధించింది. ఈ ఇటాలియన్ క్రీడాకారిణి రెండవ రౌండ్‌లో అమెరికన్ ప్రపంచ నంబర్ 5 మాడిసన్ కీస్‌తో తలపడుతుంది.

# 'ఏసియన్'లో భారత్ బాక్సర్ల జోరు



**న్యూఢిల్లీ:** ఆసియా అండర్-15, అండర్-17 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లలో భారత బాక్సర్లు తమ బలమైన ప్రస్థానం కొనసాగించారు. జోర్డాన్‌లోని అమ్మాన్‌లో జరిగిన 2వ రోజు పోటీల్లో మూడు కమాండింగ్ విజయాలు సాధించారు. ఎస్‌జిఎఫ్ 2024 బంగారు పతక విజేత టికమ్ సింగ్ (52 కిలోలు) యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌కు చెందిన అలీ అల్మేస్మారిపై ఆధిపత్యం చెలాయించాడు. మూడవ రౌండ్‌లో రిఫరీ స్టాప్డ్ కాంటెస్ట్‌తో బౌట్‌ను ముగించాడు. ఇక ఉధమ్ సింగ్ (54 కిలోలు) ఇరాన్‌కు చెందిన మహ్మద్‌పర్సా మోటెవాలియా నస్తనెహ్‌సారిని అవుట్ బాక్సింగ్ చేసి 50 తేడాతో క్లీన్ విజయాన్ని నమోదు చేశాడు. ఇక ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో జరిగిన బాలుర అండర్-17 63 కిలోల తొలి రౌండ్‌లో భారత యువ బాక్సర్ అమన్ సివాచ్ 41తో కిర్గిస్థాన్‌కు చెందిన అబుబకీర్ దుషీవ్‌పై అద్భుత విజయం సాధించాడు. ఆది నుంచే తనదైన జోరు కనబరిచిన అమన్..ప్రత్యర్థి బాక్సర్‌పై పదునైన పంచ్‌లతో చెలరేగాడు.

## ఆట



# పసికూన జింబాబ్వే సంచలన విజయం

### 3 వికెట్ల తేడాతో స్వంత గడ్డపై బంగ్లాదేశ్ చిత్తు

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ క్రికెట్ జట్టుకు వారి సొంతగడ్డపై పసి కూన జింబాబ్వే ఊహించని షాకిచ్చింది. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం బాంగ్లాదేశ్‌లో పర్యటిస్తున్న జింబాబ్వే క్రికెట్ జట్టు తొలి టెస్టులో సంచలన విజయం సాధించింది. సిల్హెట్ వేదికగా బుధవారం జరిగిన తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ జట్టును చిత్తు చేసింది. దీంతో అరేళ్ల తర్వాత బంగ్లా గడ్డపై జింబాబ్వే విజయం సాధించినట్లయింది. ఈ మ్యాచ్‌లో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 191 పరుగులు చేయగా, జింబాబ్వే 273 పరుగులు చేసింది. ఇక రెండో ఇన్నింగ్స్ బుధవారం ఓవర్ నైట్‌తో కలిపి బంగ్లాదేశ్ 255 పరుగులు చేసి ఆలౌట్ కాగా, జింబాబ్వే 7 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. దీంతో బంగ్లాదేశ్ రెండు ఇన్నింగ్స్‌లోనూ కలిపి 446 పరుగులు చేయగా, జింబాబ్వే 447 పరుగులు చేసింది. జింబాబ్వే బ్యాటర్లలో బ్రియాన్ బెన్నెట్ (52) టాప్ స్కోరర్‌గా నిలవగా, బెన్ కుర్రాన్ (44) పరుగులతో రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహది హసన్ మిరాజ్ 5 వికెట్లు పడగొట్టగా, తైజుల్ ఇస్లాం 2 వికెట్లు సాధించాడు. ఇక ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బాంగ్లాదేశ్, జింబాబ్వే బౌలర్లు రెచ్చిపోవడంతో తొలి ఇన్నింగ్స్‌లో 191 పరుగులకే కుప్పకూలింది. జింబాబ్వే బౌలర్లలో ముజరబానీ, వెల్లింగ్టన్ మసకద్జ తలో 3 వికెట్లు, న్యాయుచి, మదెవెరె చెరో 2 వికెట్లు తీసి బంగ్లాదేశ్ దెబ్బకొట్టారు. అనంతరం జింబాబ్వే తమ తొలి ఇన్నింగ్స్‌లో 273 పరుగులకు ఆలౌట్ అయింది. జింబాబ్వే బ్యాటర్లలో ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (57), సీన్ విలియమ్స్ (59) అర్థ సెంచరీలతో రాణించగా, వికెట్ కీపర్ న్యాషా మయవో (35), వెస్లీ మెదెవెరె (24), రిచర్డ్ నగరవ (28 నాటౌట్)గా పర్వాలేనిపించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహిది హసన్ మిరాజ్ 5 వికెట్లతో చెలరేగగా, నహిద్ రాణా 3, హసన్ మహమూద్, ఖలీద్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు. రెండో ఇన్నింగ్స్‌లో కూడా బాంగ్లా బ్యాటర్లు తీరు ఏ మాత్రం మార లేదు. రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 255 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ శాంటో (60), జాకీర్ (58), మోమినల్ (47) మినహా మిగిలిన బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. దీంతో జింబాబ్వే ముందు కేవలం 174 పరుగుల లక్ష్యాన్ని మాత్రమే ఉంచగలిగింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని 7 వికెట్లు కోల్పోయి పర్యాటక జట్టు ఛేదించింది. కాగా బంగ్లాపై జింబాబ్వేకు ఇది రెండో టెస్టు విజయం. ఇక ఇరు జట్ల మధ్య రెండో టెస్టు మ్యాచ్ ఈ నెల 28 నుండి ఛటోగ్రామ్ వేదికగా జరగనుంది.

# ఆ రెండు టీమ్స్ ఇంటికే..

### ప్లే ఆఫ్ రేసులో ఉన్న జట్లు ఇవే

### మారుతున్న ఐపిఎల్ లెక్కలు

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025 టోర్నమెంట్, 18వ సీజను కీలక దశకు చేరుకుంది. తాజాగా ఐపీఎల్ లీగ్‌లో మొదటి దశ ముగిసింది. ప్రతి మ్యాచ్ తర్వాత పాయింట్ల పట్టికలో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ సీజన్ లో కూడా కేవలం రెండు జట్లు తప్ప, మిగిలిన టీమ్స్‌లో టాప్ 4 కోసం గట్టి పోటీ ఉండేలా కనిపిస్తోంది. రెండవ దశ మ్యాచ్ లు ప్రారంభమయ్యాయి. దీంతో ప్లే ఆఫ్ రేసు ఉత్కంఠగా మారింది. కానీ ప్రస్తుతం ఈ రెండు జట్ల పరిస్థితిని బట్టి చూస్తే ప్లే ఆఫ్ కు అర్హత సాధించడం కష్టంగా కనిపిస్తోంది. రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లకు ఈ సీజన్ చాలా కఠినంగా మారింది. ప్లే ఆఫ్స్‌లో చోటు దక్కించుకోవాలంటే ఈ జట్లు మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లోనూ గెలవాలి. ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాలంటే 16 పాయింట్లు తప్పనిసరి. ఈ పరిస్థితుల్లో రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ తమ మిగిలిన అన్ని మ్యాచ్‌లను గెలవవలసి ఉంటుంది. చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య మ్యాచ్ ఏప్రిల్ 25న జరుగుతుంది. కాబట్టి ఈ మ్యాచ్ చెన్నై భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. ఇక ముంబై ఇండియన్స్ వరుసగా 3మ్యాచ్‌ల్లో గెలిచి ప్లేఆఫ్ రేసులో నిలిచింది. అయితే హార్దిక్‌సేన తమ మిగిలిన ఆరు మ్యాచ్‌ల్లో కనీసం 4 గెలవాలి. ఎందుకంటే ముంబైఖాతాలో ఇప్పుడు 8 పాయింట్లు ఉన్నాయి. కాబట్టి నాలుగు మ్యాచ్‌లు గెలిస్తే ఆ జట్టుకు 16 పాయింట్లు ఉంటాయి. ఇక కోల్‌కతా నైట్ రైడర్స్‌కు కూడా ప్లే ఆఫ్ అవకాశం ఉంది. కానీ జట్టు మిగిలిన ఆరు మ్యాచ్‌ల్లో ఐదింటిని ఎలాగైనా గెలవాలి. కోల్‌కతా ఖాతాలో ఇప్పుడు 6 పాయింట్లు ఉన్నాయి. ఐదు మ్యాచ్‌లు గెలిస్తే రహానే టీమ్ కు 16 పాయింట్లు వస్తాయి. ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు తదుపరి 6 మ్యాచ్‌లు చాలా ముఖ్యమైనవి. ప్రస్తుతం ఆర్‌సిబి ఖాతాలో 10 పాయింట్లు ఉన్నాయి. మిగిలిన 6 మ్యాచ్‌ల్లో 3 గెలిస్తే వారి ఖాతాలో 16 పాయింట్లు ఉంటాయి. గుజరాత్ టైటాన్స్ జట్టు 8 మ్యాచ్‌ల్లో 6 గెలిచింది. ఆ జట్టు ఖాతాలో 12 పాయింట్లు ఉన్నాయి. అలాగే, గుజరాత్ నికర రన్ రేట్ +1.104. కాబట్టి, గుజరాత్ ప్లేఆఫ్స్‌కు చేరుకోవాలంటే ఇంకా 2 మ్యాచ్‌లు మాత్రమే గెలవాలి. కాబట్టి, గుజరాత్ ప్లేఆఫ్స్‌కు చేరుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఐపిఎల్ 2025లో ఇప్పటివరకు సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ రెండూ 7 మ్యాచ్‌లు ఆడాయి. మిగతా 8 జట్లు ఒక్కొక్కటి 8 మ్యాచ్‌లు ఆడాయి. పాయింట్ల పట్టికలో గుజరాత్ తర్వాత ఢిల్లీ, ఆర్‌సిబి పంజాబ్ మరియు లక్నో మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. నాలుగు జట్లు చెరో 5 మ్యాచ్‌ల్లో గెలిచాయి. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో రాజస్థాన్, హైదరాబాద్, చెన్నై జట్లు వరుసగా ఎనిమిదవ, తొమ్మిదవ, పదవ స్థానాల్లో ఉన్నాయి.





# అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో.. తెలంగాణ ఖాతాలో రెండో స్వర్ణం

### ఆంధ్రప్రదేశ్‌కు మరో స్వర్ణం

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ ఖాతాలో మరో స్వర్ణ పతకం చేరింది. దీంతో తెలంగాణ ఖాతాలో స్వర్ణ పతకాల సంఖ్య రెండుగా ఉంది. కొచ్చిలో జరుగుతున్న అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మహిళల హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో తెలంగాణకు చెందిన అగసార నందిని పసిడి పతకాన్ని సొంతంచేసుకుంది. ఏడు క్రీడాంశాలైన 100 మీటర్ల హార్డిల్స, హై జంప్, షాట్‌పుట్, 200 మీటర్లు, లాంగ్ జంప్, జావెలిన్ త్రో, 800 మీటర్లు సమాహారమైన హెప్టాథ్లాన్‌లో నందిని మొత్తం 5813 పాయింట్లు స్కోరు చేస అగ్రస్థానంలో నిలిచింది. హరియాణాకు చెందిన పూజ 5401 పాయింట్లు సంపాదించి రజత పతకాన్ని దక్కించుకోగా, రిలయన్స్‌కు చెందిన మౌమిత మండల్ 5373 పాయింట్లతో కాంస్యం గెలిచింది. మరోవైపు మహిళల 100 మీటర్ల హార్డిల్స్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి యర్రాజి జ్యోతి బంగారు పతకాన్ని దక్కించుకుంది. రిలయెన్స్ జట్టు తరపున బరిలోకి దిగిన జ్యోతి 100 మీటర్ల హార్డిల్స్ ఫైనల్ రేసును 13.23 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. విజేతగా నిలిచే క్రమంలో జ్యోతి ఆసియా ఛాంపియన్‌షిప్ అర్హత ప్రమాణ సమయాన్ని 13.26 సెకన్లతో అధిగమించింది.

# సెన్సెక్స్, నిఫ్టీలకు ఐటి, బ్యాంకింగ్ మద్దతు


## వాణిజ్యం

**ముంబై, ఏప్రిల్ 23:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఏడోరోజూ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నా, మన మార్కెట్లు మాత్రం రాణించాయి. భవిష్యత్‌లో జరిగే వాణిజ్య చర్చల్లో చైనా దిగుమతులపై సుంకాలు తగ్గిస్తామని ట్రంప్ పేర్కొనడం, వడ్డీ రేట్ల విషయంలో విభేదిస్తున్న ఫెడ్ చీఫ్ జెరోమ్ పావెల్‌ను తొలగించే ఉద్దేశమేదీ తనకు లేదంటూ ఆయన ప్రకటించడం మార్కెట్ సెంటి మెంట్‌ను బలపరిచింది. దేశీయంగా ఐటీ షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ కనిపించింది. ఈ క్రమంలో సెన్సెక్స్ మళ్లీ 80వేల మార్క్ ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఆరంభం లోనే 80 వేల మార్కును అందుకుంది. 80,142.09 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆ తర్వాత కాస్త ఒడుదొడుకులకు లోనైనా మళ్లీ పుంజుకొంది. ఇంట్రాడేలలో 80,2454 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచి చివరికి 520.90 పాయింట్ల లాభంతో 80,116.49 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 161.70 పాయింట్ల లాభంతో 24,328.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 24 పైసలు బలహీన పడి 85.43గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, ఐటీసీ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68.25 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు కాస్త తగ్గుముఖం పట్టి 3239 డాలర్ల వద్ద కొనసాగింది.



# 'ఇంటెల్'లో లేఆఫ్స్

**ముంబై, ఏప్రిల్ 23:** టెక్ పరిశ్రమలో అనిశ్చితులు ఇప్పట్లో కుదటపడేలా కనిపించడం లేదు. టాప్‌కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపులు కొనసాగుతున్నాయి. తాజాగా టెక్ దిగ్గజం ఇంటెల్ కార్పొరేషన్ భారీ సంఖ్యలో ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమైంది. తమ వర్క్ ఫోర్స్‌లో 20 శాతానికిపైగా తొలగించాలని యోచిస్తోన్న ఇంటెల్ ఈ వారంలోనే లేఆఫ్‌లను ప్రకటించబోతున్నట్లు తెలిసింది. గత మార్చిలో సిఇఒగా బాధ్యతగా స్వీకరించిన లిప్-బు తాన్ నాయకత్వంలో ఇంటెల్ కంపెనీ ఈ వారం 20వేల కంటే ఎక్కువ మంది ఉద్యోగులను తొలగించే ప్రణాళికను ప్రకటించనుందని నివేదికలు సూచిస్తున్నాయి. 2024లో 19 బిలియన్ డాలర్ల నష్టంతో ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఇంటెల్, ఈ కోతలతో అధికారిక వ్యవస్థను తగ్గించి, నిర్వహణను



సరళీకరించి, ఇంజినీరింగ్-ఆధారిత సంస్కృతిని పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇంటెల్ తన పరిస్థితిని మెరుగుపరచుకునేందుకు ఉద్యోగాల కోతలను చేపట్టడం ఇదే మొదటిసారి కాదు. 2024 ఆగస్టులో 15వేల మంది ఉద్యోగులను తొలగించింది. దీంతో కంపెనీ మొత్తం సంఖ్య 1,08,900కు చేరింది. అంతకుముందు సంవత్సరం 2023లో ఇంటెల్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,24,800 ఉండేది. 2025లో 257 టెక్ కంపెనీలు రోజుకు సగటున 450 మంది చొప్పున 50,372 మంది ఉద్యోగులను తొలగించాయని లేఆఫ్స్-ఎఫ్‌వైఐ తెలిపింది. 2024లో 1,115 కంపెనీల్లో 2,38,461 మంది ఉద్యోగులు తొలగింపునకు గురయ్యారు.

# ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు లాభాలు పైపైకి

**ముంబై, ఏప్రిల్ 23:** ప్రైవేట్ రంగ సంస్థ ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు (ఎస్‌ఎఫ్‌బి) గతేడాది 2024-25 చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి నాలుగవ త్రైమాసికంలో నికర లాభం 18శాతం పెరిగి రూ.504 కోట్లకు చేరింది. ఇందుకు ఇతర ఆదాయం దోహదపడింది. అంతకుముందు యేడాది ఇదే కాలంలో రూ.428 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ.3,385 కోట్ల నుంచి రూ.5,031 కోట్లకు జంప్ చేసింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 57శాతం పెరిగి రూ.2,094 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 0.7శాతం మెరుగుపడి 5.8శాతానికి చేరాయి. పూర్తి యేడాదికి బ్యాంకు నికర లాభం 32శాతం పెరిగి రూ.2,106 కోట్లయింది. 2023-24లో రూ.1,591 కోట్లు మాత్రమే ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ.ఒకటి చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కాగా స్థూల మొండిబకాయిలు (ఎన్‌పిఎలు) 1.67శాతం నుంచి 2.28 శాతానికి, నికర ఎన్‌పిఎలు 0.55 శాతం నుంచి 0.74 శాతానికి పెరిగాయి. వెరసి ప్రొవిజన్లు, కంటింజెన్సీలు రూ.118 కోట్ల నుంచి రూ.635 కోట్లకు భారీగా పెరిగాయి.

ప్రైవేట్ రంగ కంపెనీ మహీంద్రా లాజిస్టిక్స్ గతేడాది చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి నాలుగవ త్రైమాసికంలో స్టాండెలోన్ నికర లాభం 67శాతం పెరిగి రూ.13 కోట్లకు చేరింది. అంతకుముందు యేడాది ఇదే కాలంలో దాదాపు రూ.8 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ.1,183 కోట్ల నుంచి రూ.1,293 కోట్లకు చేరింది. అయితే మార్చితో ముగిసిన పూర్తి యేడాదికి నికర లాభం 30శాతం క్షీణించి దాదాపు రూ.44 కోట్లకు పరిమితమైంది. 2023-24లో రూ.62 కోట్లు ఆర్జించింది. కాగా టర్నోవర్ 10శాతం వృద్ధితో రూ.5,013 కోట్లకు చేరింది. 2023-24లో రూ.4,530 కోట్ల ఆదాయం అందుకుంది.



# లగ్జరీ బ్యాగులు, వాచీలపై ఒకశాతం టిసిఎస్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:** లగ్జరీ వస్తువుల విక్రయాలపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. రూ.10 లక్షలు అంతకంటే ఎక్కువ విలువ చేసే బ్యాగులు, చేతి గడియారాల వంటి వాటిపై 1 శాతం టీసీఎస్ (మూలం వద్ద వసూలుచేసే పన్ను) ప్రకటించింది. ఏప్రిల్ 22 నుంచే ఈ టీసీఎస్ అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. ఈ మేరకు ఆదాయపు పన్ను విభాగం బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. పెయింటింగ్స్, శిల్పాలు, సన్‌గ్లాసెస్, హ్యాండ్‌బ్యాగ్‌లు, పాదరక్షలు, హోం థియేటర్ సిస్టమ్స్, రేసింగ్ గుర్రాలు, చేతి గడియా రాలు, హై ఎండ్ స్పోర్ట్స్ వేర్, క్రీడా పరికరాలు వంటి వాటిపై ఈ టీసీఎస్ వర్తిస్తుందని ఐటీ శాఖ తమ నోటిఫికేషన్‌లో పేర్కొంది. అధిక విలువకలిగిన వస్తువుల విక్రయాల్లో పారదర్శకతను పెంచేందుకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తాజా నిర్ణయంతో విక్రయ దారులు టీసీఎస్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అలాగే లగ్జరీ వస్తువులను కొనుగోలు చేసే సమయంలో కస్టమర్లు కేవీసీ, ఇతర డాక్యుమెంట్లను పూర్తిచేయాలి. ఈ నిర్ణయంతో లగ్జరీ వస్తువుల అమ్మకాలపై నియంత్రణ ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# ఏథర్ ఎనర్జీ ఐపిఒ

**ముంబై, ఏప్రిల్ 23:** ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ ఐపీఓ ధరల శ్రేణిని ప్రకటించింది. రూ.2,981 కోట్ల ఐపీఓకు సంబంధించి ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.304-321గా పేర్కొంది. ఏప్రిల్ 28 నుంచి 30 వరకు సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉంటుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 25న విండో తెరుచుకోనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెయిన్ బోర్డు నుంచి పబ్లిక్ ఆఫర్‌కు వస్తున్న తొలి ఐపీఓ ఇదే కావడం గమనార్హం. ఏథర్ ఎనర్జీ సంస్థ ఈ పబ్లిక్ ఇష్యూలో తాజా షేర్ల జారీ ద్వారా రూ.2,626 కోట్లు సమీకరించనుంది. దీంతో పాటు 1.1 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. ప్రమోటర్లు, వాటాదారులు తమ వాటాలను ఆ మేర తగ్గించుకోనున్నారు. రూ.11,956 కోట్ల విలువ వద్ద మొత్తం రూ.2,981 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించేందుకు కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఐపిఒ ద్వారా సమీకరించిన నిధులను మహారాష్ట్రలోని ద్విచక్ర వాహన ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు రుణాన్ని తగ్గించుకునేందుకు కంపెనీ వినియోగించుకోనుంది. కొంత మొత్తాన్ని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సామర్థ్యాలు పెంచుకోవడానికి వినియోగించ బోతోంది. ఐపిఒలో భాగంగా 75 శాతం షేర్లను క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు కంపెనీ కేటాయించింది. 15 శాతం నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు, 10 శాతం షేర్లను రిటైల్ ఇన్వెస్టర్లకు రిజర్వ్ చేసింది. యాక్సిస్ కేపిటల్, హెచ్‌ఎస్‌బీసీ సెక్యూరిటీస్, జేఎం ఫైనాన్షియల్, నొమురా బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి. మరో విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్, గతేడాది రూ.రూ.6,415 కోట్లను ఐపీఓ ద్వారా సమీకరించింది. విద్యుత్ వాహన విభాగంలో ఐపీఓకు వస్తున్న రెండో సంస్థగా ఏథర్ ఎనర్జీ నిలవనుంది.



# టాటా కమ్యూనికేషన్స్ లాభాలు జూమ్

**ముంబై, ఏప్రిల్ 23:** ప్రైవేట్ రంగ సంస్థ టాటా కమ్యూనికేషన్స్ గతేడాది చివరి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. జనవరి-మార్చి నాలుగవ త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపుపైనా వృద్ధితో రూ.761 కోట్లను అధిగమించింది. సహచర కంపెనీకి చెన్నైలోని భూమిని విక్రయించడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతకు ముందు యేడాది ఇదే కాలంలో కేవలం రూ.346 కోట్లు ఆర్జించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 30 కోట్ల డాలర్ల పెట్టుబడులు వెచ్చించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. గతేడాది 27 కోట్ల డాలర్లు కేటాయించినట్లు తెలియచేసింది. కాగా మొత్తం ఆదాయం కూడా 6శాతానికిపైగా పెరిగి రూ.6,059 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 6శాతం పెరిగి రూ.5,723 కోట్లకు చేరాయి. చెన్నైలోని భూమి అమ్మడంతో రూ.577 కోట్ల మేర అదనపు లాభం ఆర్జించినట్లు కంపెనీ పేర్కొంది. అంతేకాకుండా టాటా కమ్యూనికేషన్స్ పేమెంట్స్ సొల్యూషన్స్‌లో వాటా విక్రయం ద్వారా రూ.311 కోట్లు అందుకున్నట్లు తెలియచేసింది. మార్చితో ముగిసిన పూర్తి యేడాదికి రూ.23,238 కోట్ల ఆదాయం సాధించింది. మార్చికల్లా రూ.9,377 కోట్ల రుణభారం నమోదైంది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps